14 . 01. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 221 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## సీఎం రిలీఫ్ ఫండ్ (CMRF) చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు జనవరి 13:**
ఆదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ (CMRF) చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వ్యాధులతో చికిత్స పొందుతూ ఆసుపత్రుల్లో ఖర్చు చేసిన బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. మొత్తం 33 చెక్కులు, రూ. 9.70 లక్షల విలువైన సీఎం

## ప్రారంభానికి సిద్ధంగా ప్రధాని కార్యాలయం

సర్వాంగ సుందరంగా రూపు దిద్దుకున్న కొత్త ఆఫీస్

సేవాతీర్థ్‌లోకి త్వరలోనే మారనున్న మోడీ



## 18న మేడారంలో కేబినెట్ భేటీ ?

19న మేడారం పనులకు సిఎం ప్రారంభోత్సవాలు

19న రాత్రికి దావోస్ వెళ్లనున్న రేవంత్





**హైదరాబాద్,జనవరి 13 వెలుతురు:**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 18న ములుగు జిల్లా మేడారంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. రాజదాని వెలుపల కేబినేట్ భేటీ జరపాలని నిర్ణయించడం ఇటీవల ఇదే ప్రథమం. అయితే సిఎం షెడ్యూల్ కారణంగా అక్కడ నిర్వహించేందుకు నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై అధికారికంగా సమాచారం తెలియాల్సి ఉంది. 'సమ్మక్క సారలమ్మ మేడారం మహాజాతర' ఈ నెల 28న ప్రారంభం కానుండడంతో.. సంప్రదాయానికి భిన్నంగా ఈసారి మేడారంలో క్యాబినెట్ భేటీ నిర్వహించనున్నట్లు సమాచారం. 18న ఉదయం

# కుంభమేళాకు మించి సమ్మక్క-సారలమ్మ జాతర

- రూ.250 కోట్లకుపైగా నిధులతో పనులు
- సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ
- మేడారం జాతర ఏర్పట్లపై మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క





**హైదరాబాద్,జనవరి 13 వెలుతురు:**
ఈనెల 28వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఈసారి గతంకన్నా రెట్టింపు సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వంలోని వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్షణ్ కుమార్, దనసరి అనసూయలు అన్నారు. మేడారం జాతరపై డా. బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రులు,అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సబ్యసాచి ఘోష్, అడిషనల్ డీజీలు విజయ్ కుమార్, స్వాతి లక్రా, వివిధ శాఖ కార్యదర్శులు, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ మాట్లాడుతూ, గత 2024 మేడారం జాతరకు కోటిన్నర మంది హాజరుకాగా, ఈసారి 2026 లో జాతరకు దాదాపు గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ. 150 కోట్ల నిధులను మంజూరు చేసి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నందున ఈసారి దాదాపు మూడు కోట్ల మంది

## సైరన్స్ న్యూసెన్స్

- టోల్ ప్లాజాల వద్ద అత్యవరస సైరన్స్ (పోలీస్, అంబులెన్స్) దుర్వినియోగం....
- విచ్చలవిడిగా సైరన్స్ వాడుతున్న పోకిరీలు...
- సైరన్ తో న్యూసెన్స్ చేస్తున్న వాహనదారులు...
- టోల్ రుసుము తప్పించుకునేందుకు సైరన్ తో హంగామా....
- వీఐపీల్లా బిల్డప్ ఇస్తూ టోల్ ప్లాజా నిర్వాహకులకు టోకరా....
- సైరన్ చప్పుడుతో మిగతా వాహనదారులను హడలెత్తిస్తున్న పోకిరీలు...
- మూడు రోజులుగా సైరన్ లతో పంతంగి,కొర్లపహాడ్ టోల్ గేట్లను దాటుకుంటూ వెళ్లిన వందలాది వాహనాలు....
- పలానా ఎమ్మెల్యే బామ్మర్దిని,మంత్రి గారి బంధువును అంటూ బురిడి కొట్టిస్తున్న ఫేక్ వీఐపీలు...
- పోలీసులకు సవాల్ మారిన పోకిరీల సైరన్స్...

**హైదరాబాద్ వెలుతురు జనవరి 13:**

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుదిజాబితా ప్రకటన

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52,43,023 మంది ఓటర్లు

26,80,014 మంది మహిళా ఓటర్లతో వారిదే అగ్రస్థానం

నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు

# "వీబీ-జీ రామ్ జీ" పథకం ఎందుకు వద్దు?

- తెలంగాణకు అదనంగా రూ.340 కోట్లు రాబోతున్నాయి
- దేశవ్యాప్తంగా అదనంగా రూ.17 వేల కోట్లు వస్తాయి
- గ్రామాలకు ఆస్తులను సృష్టించే పథకం
- రైతులకు ఉపశమనం కలిగించే స్కీం
- ప్రతి ఒక్కరికీ 125 రోజుల పని కల్పించబోతున్నాం
- నేరుగా డబ్బులన్నీ కూలీల ఖాతాలోనే పడతాయి
- నూతన ఉపాధి పథకం కావాలా? వద్దా? సమాధానం చెప్పాలి
- నిర్ణీత టైంలో పని కల్పించకపోతే వడ్డీతోసహా ఉపాధి భత్యం చెల్లించాల్సిందే
- ప్రజలకు మంచి జరుగుతుంటే కాంగ్రెస్ కు ఎందుకింత అక్కసు?
- మహాత్ముడి ఆశయాలను తుంగలో తొక్కినోళ్లే మొసలి కన్నీరు కార్చడమా?
- వాంబే ఇండ్ల స్కీం పథకంలో వాల్మీకీ, అంబేద్కర్ పేర్లను ఎందుకు తొలగించారు?
- ఎయిర్ పోర్టుకు ఎన్టీఆర్ పేరును తొలగించి రాజీవ్ గాంధీ పేరును పెట్టలేదా?
- మీరు చేస్తే సంసారం...మేం చేస్తే వ్యభిచారమా?
- కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్ వెలుతురు జనవరి 13:**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "వీబీ-జీ రామ్ జీ" పథకం అద్భుతమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. గ్రామానికి స్థిర ఆస్తులను సృష్టించడంతోపాటు ప్రతి ఒక్కరికి కచ్చితంగా 125 రోజుల పని దొరుకుతుందన్నారు. వ్యవసాయ సీజన్ లో కూలీలు దొరకక ఇబ్బంది పడుతున్న రైతులకు ఈ పథకం ద్వారా ఉపశమనం కల్పించబోతోందన్నారు. గతంతో పోలిస్తే ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.17 వేల కోట్లు కేటాయించబోతోందన్నారు. తెలంగాణకు సైతం రూ.340 కోట్లు అదనంగా రాబోతున్నాయని తెలిపారు. ఇంత గొప్ప పథకాన్ని అడ్డుకోవాలని చూడటం కాంగ్రెస్ నీచ రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరును తీసేయడంపై కాంగ్రెస్ అనవసరం రాద్ధాంతం చేస్తోందన్నారు. తొలుత ఈ పథకానికి మహాత్ముడి పేరే కాంగ్రెస్ పెట్టలేదని చెప్పారు. పాలకులు మారినప్పుడు పథకాల పేర్లు మారడం సహజమేనని, గతంలో వాల్మీకీ, అంబేద్కర్ పేర్లతో వాజ్ పేయి ప్రభుత్వం వాంబే స్కీం పేరుతో ఇండ్ల నిర్మాణ పథకాన్ని ప్రవేశపెడితే... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వారి పేర్లను తొలగించి ఇందిరాగాంధీ ఆవాస్ యోజన పథకంగా మార్చారని గుర్తు చేశారు. హైదరాబాద్ ఎయిర్ పోర్టుకు ఎన్టీఆర్ పేరుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్



# సీఎం రిలీఫ్ ఫండ్ (CMRF) చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

రిలీఫ్ ఫండ్ సహాయాన్ని అర్హులైన రోగుల కుటుంబాలకు ఎమ్మెల్యే గ అందజేశారు. ఈ సహాయం ఆసుపత్రి ఖర్చుల భారాన్ని కొంతవరకు తగ్గించడంలో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. అవసరంలో ఉన్న ప్రతి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందేలా కృషి చేస్తామని ఆయన అన్నారు. అర్హులైన వారు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రారంభానికి సిద్ధంగా ప్రధాని కార్యాలయం

**న్యూఢిల్లీ,జనవరి 13 వెలుతురు:**

ఢిల్లీలో ప్రతిష్టాత్మక సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ప్రధానమంత్రి కొత్త కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. రైసినా హిల్ సమీపంలో అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ భవన సముదాయంలోకి ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెలలోనే మారే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నిర్మాణ దశలో 'ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్' గా పిలిచిన ఈ సముదాయానికి కేంద్ర ప్రభుత్వం 'సేవా తీర్థ్' అని నామకరణం చేసింది. ఈ ప్రాంగణంలో మొత్తం మూడు మెయిన్ బిల్డింగులు ఉన్నాయి. ఒకదాంట్లో ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) ఉంటుంది. రెండో భవనం నుంచి కేబినెట్ సెక్రటేరియెట్ విధులు సాగుతాయి. మూడో భవనంలో జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్(ఎన్ఎస్‌సీఎస్)తో పాటు జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ కార్యాలయం ఉంటుంది. కొత్త కార్యాలయంలో విదేశీ ప్రముఖులు, అతిథులతో సమావేశమయ్యేందుకు వీలుగా హై-ఎండ్ రూమ్‌లను రూపొందించారు. ఇవి అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉండటమే కాకుండా.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉన్నాయి. ముఖ్యంగా కేబినెట్ సమావేశాల కోసం ఒక హాలును సిద్ధం చేశారు. అధికారుల మధ్య సమన్వయం పెంచేందుకు 'ఓపెన్ ఫ్లోర్' మోడల్‌ను ఇక్కడ అమలుచేస్తున్నారు. కాగా.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రధానమంత్రి కార్యాలయం సౌత్ బ్లాక్ నుంచే పనిచేస్తున్నది. తాజా మార్పుతో దశాబ్దాల చరిత్రకు తెరపడనుంది. నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్‌లలో ఉన్న హోం, ఫైనాన్స్, విదేశీ వ్యవహారాలు, రక్షణ శాఖలు ఇప్పటికే కొత్తగా నిర్మించిన 'కర్తవ్య భవన్' కు తరలివెళ్లాయి. ఖాళీ అయిన ఈ పురాతన కట్టడాలను భారీ మ్యూజియంగా మార్చనున్నారు. సేవా తీర్థ్ సమీపంలోనే ప్రధాని కొత్త నివాసం కూడా నిర్మాణం అవుతున్నది. ప్రస్తుతం 7 లోక్ కల్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని నివాసాన్ని కూడా అక్కడికే మార్చనున్నారు.

## 18న మేడారంలో కేబినేట్ భేటీ ?

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు చేస్తారు. అక్కడే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సీపీఐ వంద సంవత్సరాల వేడుకకు హాజరవుతారు. అదే రోజు సాయంత్రానికి ముఖ్యమంత్రి సహా మంత్రివర్గం మేడారం చేరుకుంటుంది. 5 గంటల తర్వాత క్యాబినెట్ సమావేశమయ్యే అవకాశాలున్నాయి. 19న ఉదయం అమ్మవార్ల నూతన ప్రాంగణ ప్రారంభోత్సవం, దర్శనం అనంతరం ముఖ్యమంత్రి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు. అదే రోజు రాత్రి దావోస్‌కు వెళ్తారు. 18న మేడారంలో నిర్వహించాలని యోచిస్తున్న మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా త్వరలో పురపాలక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో పట్టణాభివృద్ధి పథకాలపై చర్చించే అవకాశముంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపైనా క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. ఫిబ్రవరి 1న కేంద్ర బ్జడెట్ ప్రవేశపెట్టనుండడంతో.. అందుకు అనుగుణంగా శాఖల వారీగా రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిసింది. రైతుభరోసా నిధుల విడుదల, హ్యామ్ రోడ్లు, తదితర అంశాలపైనా నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుదిజాబితా ప్రకటన

**హైదరాబాద్,జనవరి 13 వెలుతురు :**

తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. వీరిలో 25,62,369 మంది పురుష ఓటర్లు కాగా.. 26,80,014 మంది మహిళా ఓటర్లు, 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉండగా.. కొత్తగూడెం కార్పొరేషన్‌లో అత్యల్పంగా 1,34,775 మంది ఓటర్లు ఉన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా.. అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత నోటిఫికేషన్ విడుదల కానుంది. జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మొత్తం ఎన్నికల పర్వంలో రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకం కావడంతో అధికారులు దీనిని సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో గడువు ముగిసిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల ఎన్నికలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే.

# సిఎం రేవంత్‌పై వ్యాఖ్యలకు నొచ్చుకున్న తలసాని

- ఆవేశంతో చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా
- సికింద్రాబాద్‌పై రాజీలేని పోరాటం చేస్తాం
- ఈ నెల 17న శాంతి ర్యాలీ చేపడుతున్నట్లు తలసాని ప్రకటన

**హైదరాబాద్,జనవరి 13 వెలుతురు:**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారడంతో. దీనిపై తలసాని స్పందిస్తూ.. సీఎం రేవంత్ రెడ్డిపై తాను చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. మంగళవారం నాడు తలసాని మాట్లాడుతూ.. 'సికింద్రాబాద్‌ను ముక్కలు ముక్కలుగా చేస్తే ముక్కలుగా చేస్తా' అనే మాటల్లో ఆవేశం తప్ప వేరే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారంటే తనకు గౌరవం ఉందని ఆయన తెలిపారు. తమ ప్రాంతాన్ని కాపాడుకోవడం తప్ప వేరే ఉద్దేశం లేదని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలుసుకోవాలని సూచించారు. 220ఏళ్ల చరిత్ర గల సికింద్రాబాద్ ఇమేజ్‌ను దెబ్బతీసే కుట్రలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం పోరాటం చేస్తున్నామని వివరించారు. సికింద్రాబాద్‌ను ప్రత్యేక కార్పొరేషన్‌గా ప్రకటించి తీరాల్సిందేనని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. ఈ అంశంపై నిరసనగా ఈ నెల 17న భారీ శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ ర్యాలీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమై క్లాక్ టవర్, ప్యాట్నీ, ప్యారడైజ్ మీదుగా ఎంజీ రోడ్‌లోని గాంధీ విగ్రహం వరకు సాగుతుందని వెల్లడించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సికింద్రాబాద్ ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటన సాధించేందుకు ఈ ర్యాలీ నిర్వహించనున్నట్లు తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.సికింద్రాబాద్‌ను ముట్టుకోవడం లేదని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని.. కానీ సికింద్రాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్లు మల్కాజిగిరి జోన్లో కలిపింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు తలసాని. అలాగే సికింద్రాబాద్ పరిధిలోని పలు డివిజన్‌లను మల్కాజిగిరి జోన్ పరిధిలోని బోయిన్ పల్లి సర్కిల్‌లో చేర్చారని ఆరోపించారు. సికింద్రాబాద్ జీహెచ్ఎంసీలోనే ఉందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన తప్పుడు ప్రకటన ప్రజలను మభ్యపెట్టడానికే అంటూ విమర్శించారు.

# "వీబీ-జీ రామ్ జీ" పథకం ఎందుకు వద్దు?

గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుగా నామకరణం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ఈరోజు సాయంత్రం కరీంనగర్ లోని త్రిధా హోటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ బాస సత్యనారాయణ, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, వాసాల రమేశ్, రాజేంద్రప్రసాద్ లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ వీబీ జీ రామ్ జీ పథకం ఉద్దేశాలను వివరిస్తూనే... కాంగ్రెస్ తీరుపై నిప్పులు చెరిగారు. ఏమన్నారంటే... వీబీజీ రామ్ జీ పథకం అనేది గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంతోపాటు గ్రామానికి దీర్ఘకాలిక ఆస్తులు కూడబెట్టేందుకు ఉద్దేశించినది. ఉపాధి పథకం కింద ఏటా 86 వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసినా గ్రామానికి ఆస్తులు మాత్రం పెద్దగా పెరగ లేదు. తవ్విన గుంతలే తవ్వడం వంటి పనులే చేశారు.

ఈ నూతన చట్టబద్ద ఉపాధి హామీ పథకం అమలువల్ల ఏటా 1 లక్షా 51 వేల 282 కోట్ల ఖర్చవుతుందని ప్రభుత్వ అంచనా. "వీబీ-జీ రామ్ జీ" అనే పథకం కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యం తప్పనిసరి. ఇందులో కేంద్రం వాటా 95 వేల 692 కోట్లు... అట్లాగే అన్ని రాష్ట్రాల వాటా మొత్తం కలిపి 55 వేల 589 కోట్లు. గత ఏడాదితో పోలిస్తే దేశవ్యాప్తంగా ఈ ఏడాది 17 వేల కోట్లు అదనంగా కేంద్రం ఖర్చు చేయబోతోంది. తెలంగాణ రాష్ట్రానికి కూడా గత ఏడాదితో పోలిస్తే సుమారు 340 కోట్లు అదనంగా కేంద్రం అందించబతోంది.

"వీబీ-జీ రామ్ జీ" కూలీలకే కాదు, రైతుల నెత్తిన పాలుపోసే పథకం. ఈ కొత్త చట్టంతో వ్యవసాయ సీజన్ లో గరిష్టంగా 60 రోజుల పాటు ఈ చట్టం కింద పనులు చేపట్టకుండా నోటిఫై చేసే అధికారం రాష్ట్రాలకు ఇచ్చినం. దీనివల్ల రైతులకు అదనపు భారం ఉండదు.. పేదల కూలీ పనులకు ఢోకా ఉండదు... వ్యవసాయ సీజన్ లో కచ్చితంగా ఏటా 60 నుండి 80 రోజుల పని దొరుకుతుంది. ఇవిగాక జీ రామ్ జీ పథకం ద్వారా 125 రోజుల పని పక్కా... మొత్తంగా ఏటా సగటున 200 రోజులు పని పక్కా...

ఈ పథకం సమర్ధవంతంగా అమలవ్వడానికి అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన నిధులను 6 నుండి 9 శాతానికి పెంచినం. ఉపాధి పనుల ఎంపిక గ్రామ సభల ద్వారా ఎంపిక. పనుల ద్వారా గ్రామానికి ఆస్తులను నిర్మించాలనేది ప్రజలే నిర్ణయిస్తారు. కేంద్ర ప్రభుత్వం గైడ్ గా వ్యవహరిస్తోందే తప్ప అజమాయిషీ చేయదు.

ప్రజలకు మంచి జరుగుతుంటే కాంగ్రెస్ కు అక్కసు ఎందుకు? గ్రామానికి ఆస్తులు నిర్మించడం తప్పా? రైతులకు కూడా మేలు జరిగే పథకం కదా? తెలంగాణకు అదనంగా రూ.340 కోట్లు వస్తుంటే వద్దంటారా? వీబీ జీ రామ్ జీ పథకం కావాలా? వద్దా? కాంగ్రెస్ స్పష్టం చేయాలి.

ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై నీచ రాజకీయడం సిగ్గు చేటు. వాల్మీకీ అంబేద్కర్ ఆవాస్ యోజన(వాంబే) పేరుతో వాజ్ పేయి తెచ్చిన ఇండ్ల నిర్మాణ పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు తీసేశారు? వాల్మీకీ, అంబేద్కర్ పేర్లను తీసేసి ఇందిరా ఆవాస్ యోజన (ఐఏవై) పథకంగా ఎందుకు మార్చారు? వాల్మీకీ, అంబేద్కర్ వంటి వారిని అవమానించినట్లా? హైదరాబాద్ ఎయిర్ పోర్టు టెర్మినల్ ను గతంలోఎన్టీఆర్ టెర్మినల్ ఉంటే తీసేసి రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అని ఎందుకు పెట్టారు? గాంధీ పేరును వాడుకున్నారే తప్ప మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని పాతరేసి ఆయన ఆత్మను క్షోభకు గురిచేసిన 'ఘాంఢీ" వారసులు కాంగ్రెస్ నేతలు. వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించిన గాంధీ ఆశయాలను నీరుగార్చారు. కాంగ్రెస్ అంటే జవహర్ లాల్ నెహ్రూ. ..ఇందిరాగాంధీ.. రాజీవ్ గాంధీ... సోనియాగాంధీ...రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వీళ్లే కదా?... మహాత్మా గాంధీ నిజంగా బతికుంటే... మిమ్ముల్ని, మీ ఘాంఢీ కుటుంబ వారసులను చూసి పైనున్న గాంధీ ఆత్మ క్షోభిస్తోంది. పథకాల మార్పుపై కాంగ్రెస్ చేస్తే సంసారం... మేం చేస్తే వ్యభిచారమా?

శ్రీరాముడి పేరును బతికినంత కాలం పెట్టుకుంటాం. మా కార్యకర్తలు ఎక్కడికి పోయినా జైశ్రీరాం అంటారు. మా ఊపిరి ఆగిపోయే క్షణంలో కూడా భారతమాతా కీ జై... జై శ్రీరాం అంటాం. నక్సల్స్ కాల్చి చంపుతుంటే కూడా భారతమాతాకీ జై... జై శ్రీరాం అని నినదించిన చరిత్ర బీజేపీది. రాముడి బాటలో నడుస్తాం... రాముడి ఆలయాలను నిర్మిస్తాం... మీకు నొప్పి ఏంది?.

దేశంలో అనేక పథకాలు కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో నడుస్తున్నయే కదా?. ఈ పథకానికి రాష్ట్రాల భాగస్వామ్యం కల్పిస్తే తప్పేంది? ఉపాధి కూలీ వేతనాలే సకాలంలో ఇవ్వలేని కాంగ్రెస్ నేతలా మాట్లాడేది?

జిల్లాల పునర్ వ్యవస్థీకరణ విషయంలో కేసీఆర్ ఇష్టానుసారంగా వ్యవహరించారు. కుటుంబ ఆస్తులను పంచినట్లుగా కొడుకు, కూతురు, అల్లుడి కోసం జిల్లాలను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అదే తీరులో చేస్తే ఇబ్బందులు తప్పవు. తక్షణమే అఖిలపక్షం ఏర్పాటు చేయాలి...ప్రజాభిప్రాయ సేకరణ జరపాలి.

బీసీ రిజర్వేషన్లపై బీజేపీ స్టాండ్ క్లీయర్ గా ఉంది. మతపరమైన రిజర్వేషన్లను తొలగించాల్సిందే. బీజేపీ అధికారంలోకి వస్తే మతపరమైన రిజర్వేషన్లను తొలగించి బీసీలకు రిజర్వేషన్లను అమలు చేసి తీరుతాం.

# కుంభమేళాకు మించి సమ్మక్క-సారలమ్మ జాతర

భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని వివరించారు. సమ్మక్క?సారలమ్మ జాతరను కుంభమేళాకు మించి అద్భుతంగా నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు పిలుపునిచ్చారు. ఈ మహాజాతరను విజయవంతంగా నిర్వహించడం ప్రతి అధికారికి ఒక బాధ్యతగా తీసుకుని, ఏ చిన్న లోపం కూడా లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ జాతరకు రూ.150 కోట్లకుపైగా నిధులు కేటాయించి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈ నిధులతో మౌలిక వసతులు, భద్రత, రవాణా, పారిశుద్ధ్యం, వైద్య సేవలు వంటి అన్ని విభాగాల్లో సమగ్ర ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఏ ఒక్క భక్తుడికి కూడా ఇబ్బంది కలగకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి, జాతరకు వచ్చే భక్తులు సులభంగా గమ్యానికి చేరుకునేలా అన్ని ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాల్లో స్పష్టమైన దిశా సూచిక బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు ఎలాంటి అయోమయానికి గురికాకుండా ట్రాఫిక్ నియంత్రణ పటిష్టంగా ఉండాలని, ప్రత్యేక రూట్ మ్యాప్‌లతో పాటు అవసరమైన చోట వన్‌వే వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. ఈ జాతరపై క్యాబినెట్ మొత్తం ప్రత్యేక దృష్టి సారించిందని, మంత్రులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇలాంటి స్థాయి సమిష్టి పర్యవేక్షణ గతంలో ఎప్పుడూ జరగలేదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా వసతి, పార్కింగ్, రవాణా సౌకర్యాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ విషయంలో వీఐపీలు,సామాన్య భక్తులు అనే తేడా లేకుండా, అందరికీ సమాన సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి జాతర ఏర్పాట్లకు రూ. 150 కోట్లతో పాటు గ్దదెల పునరుద్ధరణ పనులకు రూ. 101 కోట్లు మొత్తం 251 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేశారని వివరించారు. జాతరకు వచ్చే ప్రతీ భక్తులకు సాఫీగా దర్శనం లభించేలా ప్రాధాన్యత నిస్తున్నట్టు అన్నారు. ఇందుకు గాను ప్రతీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో వివిధ శాఖ కార్యదర్సులు, హెచ్.ఓ.డీ లతో ప్రత్యేకంగా వాట్స్-అప్ గ్రూప్ ను ఏర్పాటు చేసి జాతర నిర్వహణపై ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సీతక్క సూచించారు. శానిటేషన్, తాగునీరు, రవాణా, భద్రతాలపై ప్రత్యేకంగా ద్రుష్టి సారించాలని, ప్రధానంగా టాయిలెట్ లను మరింత పెంచాలని కోరారు. జాతర సందర్భంగా గురు, శుక్ర వారాల్లోనే ప్రతి రోజు కనీసం 40 లక్షల మంది భక్తులు ఉంటారని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. మేడారం జాతరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2010 నుండి ప్రతీ సంవత్సరం వస్తున్నారని, వచ్చే వందేళ్లకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలకు మొట్టమొదటిసారిగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని సీతక్క గుర్తు చేశారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ రావు మాట్లాడుతూ, జాతర నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం పర్యవేక్షిస్తున్నందున అన్ని శాఖల ఉన్నతాధికారులు జాతర పనులకు సకాలంలో పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సాధించాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా భక్తులకు చేసిన ఏర్పాట్లు, రవాణా, ఇతర సౌకర్యాలు, భక్తులు పాటించాల్సిన సూచనలపై విస్తృత స్థాయిలో సమాచారాన్ని అందించాలని తెలిపారు. మేడారానికి వచ్చే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణకుగాను డ్రోన్ లను ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా, జాతర సమాచారాన్ని, నియమ నిబంధనలను తెలియచేసే ప్రత్యేక యాప్ ను/ క్యూ.ఆర్ కోడ్ రూపొందించి విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. పార్కింగ్ ఏరియాలలో కూడా ప్రత్యేకంగా వాటర్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. శానిటేషన్, పరిశుభ్రతపై ప్రత్యేక ద్రుష్టి సాధించాలన్నారు. ప్రస్తుతం మేడారంలో జరుగుతున్న జాతర ఏర్పాట్లు, పురోగతి తదితర విషయాలను తెలియచేసే నివేదికను ప్రతీ రోజూ తమకు సమర్పించాలని సంబంధిత శాఖల కార్యదర్శులను కోరారు. ఈ సందర్భంగా, మేడారం జాతరకు వివిధ శాఖలు చేస్తున్న ఏర్పాట్లు, చేపట్టిన పనులు, వాటి పురోగతి పై ములుగు జిల్లా కలెక్టర్ దివాకర పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. ఈసారి జాతరకు దాదాపు మూడు కోట్ల మంది హాజరవుతారని అంచనా వేసినట్లు తెలిపారు. తదితర ప్రారంభానికి ముందే దాదాపు 30 శాతం భక్తులు సందర్శిస్తారని అన్నారు. జాతర సమయంలో 60 శాతం నుండి 65 శాతం వరకు, జాతర అనంతరం 5 శాతం భక్తులు మేడారం సందర్శిస్తారని వివరించారు. మేడారం జాతరపై ములుగు జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక లోగో, యాప్, వీడియోలను మంత్రులు సీతక్క, లక్షణ్ కుమార్, సి.ఎస్ రామకృష్ణరావులు ఆవిష్కరించారు.

# కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశం లేదు

- బిఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యతు లేదు...రాదు
- కెసిఆర్ కుటుంబ అవినీతిపై కవిత వ్యాఖ్యలే నిదర్శనం
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,జనవరి 13 వెలుతురు:**




తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారంటూ కొద్దిరో జులుగా వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తోసిపుచ్చుతూ.. అలాంటిదేమీ లేదని అన్నారు. మంగళవారం నాడు మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదని స్పష్టం చేశారు. తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీకి గతం తప్ప.. భవిష్యత్తు లేదంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబ అవినీతి గురించి కవిత నిజాలు చెప్తున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలపై కవిత సమాధానం రూపంలో రుజువైందని చెప్పారు. కవిత మాటలతో కేసీఆర్ అవినీతి నిజమని ప్రజలు అర్ధం చేసుకుంటున్నారని ఆయన చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణా ప్రయోజనాలే ముఖ్యమని.. ఒక్క నీటిబొట్టును కూడా వదలమని తేల్చిచెప్పారు. అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీల విషయంలో మంచి స్పందన వస్తోందని నమ్ముతున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో కార్పొరేషన్ ఛైర్మన్లను భర్తీ చేస్తామని ప్రకటించారు. పదవులు తక్కువ అయ్యాయని... ఆశావహులు ఎక్కువ అయ్యారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ తరఫున ఒక కమిటీ వేస్తామని.. సర్వేల ఆధారంగా టికెట్ల ఇస్తామని చెప్పారు. గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుపై పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీజేపీని తెలంగాణాలో నమ్మే పరిస్థితి లేదన్నారు మహేశ్ కుమార్. మత రాజకీయాలు రాష్ట్రంలో నడవవని అన్నారు. రాముడికి, బీజేపీకి సంబంధమేంటి అని ఆయన ప్రశ్నించారు. తాము హిందూ ఆచారాలను పాటిస్తామని.. కానీ హిందూ సెంటిమెంట్‌తో ఓట్లు అడగమని తెలిపారు. తనకు, సీఎం రేవంత్ మధ్య మంచి సాన్నిహిత్యం ఉందన్నారు పీసీసీ చీఫ్. మంత్రులకు, సీఎంకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని మహేశ్ తేల్చిచెప్పారు. ఇతర మంత్రుల శాఖల్లో ముఖ్యమంత్రి తలదూర్చరన్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారని వెల్లడించారు. డీ సెంట్రలైజేషన్ కోసమే మేడారంలో క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని పీసీసీ చీఫ్ తెలిపారు. కేసీఆర్.. కుమారుడికి ఒక జిల్లా, కూతురికి ఒక జిల్లా, అల్లుడికి ఒక జిల్లా ఇచ్చారని పీసీసీ చీఫ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ అశాస్త్రీయంగా జిల్లాలను విభజించారని మండిపడ్డారు. శాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన చేయాలని కమిటీ వేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌ను ఎవరు ముట్టుకున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ గాబరాపడుతున్నారని ప్రశ్నించారు. వ్యక్తిగత జీవితాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదన్నారు. మహిళా అధికారులపై ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే ఎంత ఇబ్బంది పడతారో అర్థం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాను కట్టడి చేయాలన్నారు. పదేళ్లలో వచ్చిన ఉద్యోగాలు ఎన్ని.. రెండేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలు ఎన్నో నిరుద్యోగులు అర్థం చేసుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## వీధి కుక్కల బాధ్యత రాష్ట్రాలదే

- ఒక్కరిని కరిచినా అందుకు బాధ్యత వహించాల్సిందే
- అందుకు విధించే జరిమానాలకు సిద్ధంగా ఉండండి
- వీధి కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా దోషులే
- ఘాటు హెచ్చరిక చేసిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ,జనవరి13 వెలుతురు:**

వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోతే ఆయా రాష్ట్రాలపై భారీ జరిమానాలు వేస్తామని హెచ్చరించింది. ప్రతి కుక్క కాటు కు పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టంచేసింది. వీధి కుక్కల బెడదను నివారించేందుకు రాష్ట్రాలు తగిన చర్యలు చేపట్టాలి. లేదంటే ప్రతి కుక్క కాటుకు, కుక్కల దాడిలో జరిగిన ప్రతి మరణానికి గానూ ఆయా రాష్ట్రాలపై మేం నిర్దేశించిన భారీ పరిహారాలను చెల్లించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.కుక్క కరిచిన ప్రభావం బాధిత వ్యక్తిపై జీవితకాలం ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న వారిపైనా కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఏదైనా సంస్థ ఆహారం పెడుతున్న కుక్కల దాడిలో ఓ చిన్నారి మరణిస్తే.. అప్పుడు ఎవరిని బాధ్యుల్ని చేయాలి? ఆ ప్రాణనష్టానికి సదరు సంస్థ బాధ్యత వహించదా అని ప్రశ్నించింది. ఇక, వీధికుక్కలకు ఆహారం పెట్టే వారి గురించి మాట్లాడుతూ.. మీకు శునకాలపై అంత ప్రేమ



ఉంటే.. వాటిని మీ ఇంటికి తీసుకెళ్లి పెంచుకోండి. వీధి కుక్కల సమస్య భావోద్వేగభరిత అంశమని అంటున్నారు. మీ భావోద్వేగం కేవలం కుక్కల పైన మాత్రమేనా? మేం మనుషుల గురించి కూడా సమానంగా ఆందోళన చెందుతున్నాం. కుక్కలు వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయపెట్టే పరిస్థితిని మేం ఆమోదించబోం అని ధర్మాసనం వెల్లడించింది. దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబరులో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపంలోని వాటిని షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

## సమ్మక్క సారక్క సీతక్క పాట సిడి ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి దనసరి అనసూయ సీతక్క



**హైదరాబాద్ వెలుతురు జనవరి 13:**
ప్రముఖ కళాకారుడు, గాయకుడు గడ్డం సంతోష్ గారు వారి బృందంతో కలిసి తెలంగాణ కుంభమేళా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా పాట రచించి, పాడి,వీడియో రూపంలో చిత్రీకరించిన సమ్మక్క సారక్క సీతక్క పాట సిడినీ మంగళవారం రోజున ప్రజా భవన్ లో మంత్రి సీతక్క గారి చేతుల మీదుగా ఆవిష్కరించారు, ఈ పాటలో రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి దనసరి అనసూయ సీతక్క కూడా తన గానం కలిపి సమ్మక్క సారక్కలపై ఉన్న భావోద్వేగాన్ని పంచుకున్నారు, సమ్మక్క సారక్క జాతర కోసం గడ్డం సంతోష్ వారి బృందం పాడిన పాటను రాష్ట్ర ప్రజలందరూ ఆదరించాలని మంత్రి సీతక్క వారికి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం మంత్రి సీతక్క నవ తెలంగాణ పత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో గడ్డం సంతోష్ వారి బృందం కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలకు రూ.277 కోట్ల నిధులు విడుదల

**- సీఎం, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సీతక్క**



**హైదరాబాద్, వెలుతురు జనవరి 13:**
గ్రామ పంచాయతీలకు సంక్రాంతి పండుగ సందర్భంగా రూ.277 కోట్ల నిధులు విడుదల కావడం పట్ల రాష్ట్ర పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులకు ఇది ఒక గొప్ప ప్రోత్సాహకరమైన సంకేతమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు వంటి అత్యవసర అవసరాలను వేగంగా తీర్చేందుకు ఈ నిధులు ఎంతో దోహదపడతాయని తెలిపారు. గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి ఇది మరో ఉదాహరణగా నిలుస్తుందని మంత్రి సీతక్క అన్నారు. పంచాయతీలకు పెండింగ్ లేకుండా నిధులు అందేలా చొరవ చూపిన ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క కు కృతజ్ఞతలు తెలిపారు. “గ్రామ పంచాయతీలే రాష్ట్ర అభివృద్ధికి పునాది. గ్రామాలు బలపడితేనే తెలంగాణ ముందుకు సాగుతుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేయడం ఒక చారిత్రక నిర్ణయం” అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి 15 వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ప్రజా ప్రయోజనాలకు, గ్రామాభివృద్ధికి పారదర్శకంగా, సమర్థవంతంగా వినియోగించాలని సర్పంచులు, వార్డు సభ్యులకు సూచించారు. సర్పంచ్ లు, వార్డు సభ్యులకు సంక్రాంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతవరణాన్ని పెంపొందించేందుకు కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు మంత్రి సీతక్క.

## తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు - మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు జనవరి 13:**
భోగి, మకర సంక్రాంతి పండుగ పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. భోగభాగ్యాలతో సిరి సంపదలతో ప్రజలందరూ ఆనందంగా, సుఖంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ భోగి, సంక్రాంతి ప్రజల జీవితాల్లో నూతన కాంతులు తీసుకురావాలని,ఆనందోత్సాహాల నడుమ భోగి, సంక్రాంతి పండుగ జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. సంక్రాంతి సందర్భంగా ప్రజలతోపాటు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

## డీలిమిటేషన్ ప్రజాస్వామ్య సంస్కరణ మహిళా హక్కులకు పునాది

**- సీఎం రేవంత్ రెడ్డి పై తలసాని వ్యాఖ్యలను ఖండించిన**
**డా. రేఖ బోయలపల్లి ఉపాధ్యక్షురాలు, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్**



**హైదరాబాద్ వెలుతురు జనవరి 13:**
బిఆర్ఎస్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ను ఉద్దేశించి చేసిన అనుచిత, బెదిరింపు వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి తీవ్రంగా ఖండించారు. విమర్శలకు స్థానం ఉన్నా, బెదిరింపులు––దూషణలు రాజకీయ సంస్కృతి కావని ఆమె స్పష్టం చేశారు. డీలిమిటేషన్ అనేది కక్ష రాజకీయాలు కాదు . రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య సంస్కరణ అని పేర్కొన్నారు. ప్రతి ఓటుకు సమాన విలువ కల్పించడమే దీని లక్ష్యమని తెలిపారు.ముఖ్యంగా, మహిళా రిజర్వేషన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలంటే డీలిమిటేషన్ తప్పనిసరి అని డా. రేఖ బోయలపల్లి స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారత, ప్రజాస్వామ్య బలోపేతం దిశగా ముందుకు సాగుతుందని చెప్పారు. తెలంగాణను బెదిరింపులతో కాదు, రాజ్యాంగంతో పాలిస్తాం సంస్కరణలను భయపెట్టలేరు.

# సంక్రాంతి - ముగ్గులు- ప్రత్యేకత



**రచయిత్రి : కోట. ఉమా శర్మ**
**9958144884**

ముగ్గులు ఏ ప్రదేశాన్నైనా, అందంగా, లక్ష్మీ ప్రధానముగ మారుస్తాయి. రంగు రంగుల పూలు, మంచి డిజైన్ లే కాకుండ, ముగ్గుల గురించి ఎన్నో తెలియని విషయాలు ఉన్నయి. ప్రతి రోజు మనం చూసే ఒక సాధారణమైన ముగ్గు అర్థం ఏమిటి? కారణం ఏమిటి? ప్రభావం ఏమిటి? ఉద్దేశం ఏమిటి? ఇపుడు మనం సంక్రాంతి సందర్భంగా తెలుసుకుందాము.


నెల ముందుగా 17వ్ర డిసెంబర్ నుండి జనవరి 13, 14, 15 దాకా ధనుర్మాసము. ఆ చివరి మూడు రోజులే సంక్రాంతి. ఈరోజులలో మన ఇళ్ళ ముందర రకరకాల ముగ్గులు, రంగురంగుల్లో, వాటిల్లో గొబ్బెమ్మలు, రంగుల పూలు, పసుపు కుంకుమలతో, మామిడి బంతిపూల తోరణాలతో, ఇంటిముందు కనిపించే దృశ్యాలు చాలా బాగుంటయి. ఎగిరే గాలిపటాలతో ఆకాశం నిండి పోయి సూర్య దేవునితో పోటీపడినట్లు ఉంటుంది. హరిదాసులు, గంగిరెద్దులు, వాటి ఉండే మైథలాజికల్ అర్థాలు వాటి వల్ల వచ్చే ప్రయోజనాలు ఎన్నో ఉంటయి. చలిగా ఉండే నెల కాబట్టి భోగి పండుగ నాడు భోగి మంటలు, పిల్లలకి భోగి పళ్ళు, ఆడవాళ్ళకి పసుపు, కుంకుమలు, పువ్వులు, గాజులు, చలిమిడి, కొత్త బట్టలు తీపి పదార్థాలు ఇవన్నీ ఆచారాలు.

ఇలాగే కనుమ నాడు ముగ్గులతో స్వర్గ ద్వారాలు, వాటిని తెరిచి ఉంచితే జరిగే ముఖ్యమైన సంఘటనలతో కూడిన ఆశ్చర్యకరమైనవి, అపురూపమైనవి అనుబంధాలు వాటి ప్రాముఖ్యతలు తెలుసుకోవచ్చు.

పితృదేవతల ఆశీర్వచనములతో అటువంటి ముగ్గుల వల్ల వచ్చే అనుభూతి ఆశీర్వచనాల వల్ల ప్రాప్తించే సంతృప్తి, సంపద, దీర్ఘాయువు భవిష్యత్తుకి బంగారు బాటలు. చిరకాల సౌభాగ్యము పొందటమే ఇటువంటి పండుగలకి ఆయువు పట్టు లాంటివి.

ఇక భోగినాడు రకరకాల ఆచార వ్యవహారాలతో ఇంటిముందు ధనుర్మాసంలో రోజు వేసే ముగ్గులు కాకుండా చివరి మూడు రోజులు ప్రత్యేకమైన పెద్ద పెద్ద ముగ్గులు ఉంటయ్యి. వాటిల్లో ఐదు చుక్కలు, 7 చుక్కలు, 9, 11, 13, 15 చుక్కలతోనూ ం, – , ఐ కాకుండా గీతలతో కూడా చేర్చి చేకూర్చిన ముగ్గులు ప్రత్యేకమైనవి. పద్మములు, శంఖాలు, చతురస్రాలు, చక్రాలు ( వృత్తాలు) మన పూర్వీకులు మనకు అందించే దేవతల గుర్తులు, ధరించే అలంకారాలు, వాటి అర్థాలు వాటి వల్ల మానవాళికి వచ్చే ప్రయోజనాలు, లాభాలు ఉంట. మహిమాన్వితమైన ధర్మ, అర్థ, కామ మోక్షమార్గాలను సూచిస్తూ ముందు తరాలకు ఉపయోగకరమైనవి, శుభప్రదమైనవి, గృహిణి వారి ప్రతిభను అలవోకగా ప్రదర్శించడం మామూలు విషయం కాదు.

ఈ దైవ చిహ్నాలను బియ్యం పిండితో ఎంతో కష్టమైనవి కూడా అతి తేలికగా కనిపించే ఆ కలలను ప్రకృతి సాక్షిగా ముగ్గుల రూపంలో ఈ సమాజానికి మన సంస్కృతి , ఆధ్యాత్మిక తో అలారాలిల్లె భావనను దివి నుండి భువికి తీసుకు రాగలిగిన ఆ మహిళలకు మన జోహార్లు. స్వర్గ ద్వారాల ముగ్గును పాఠకులకు అందించే ప్రయత్నం చేద్దాము. ఇటువంటి స్వర్గ ద్వారాల ముగ్గులను ఇప్పటి తరం వాళ్లు అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే మంచిది. దానివల్ల మన సంస్కృతి, ఆచారవ్యవహారాలు, అది ప్రదర్శించగల్గిన ముందు చూపు, ముగ్గుల రూపంలో భూమాత కి దైవ చిహ్నాలుగా అందించగల శక్తి ఉన్న మహిళలకి నీరాజనం తో సుమాంజలి. ముగ్గులతో ముగ్గులలో మన లోగిల్లు ఎంతో అందంగా ఉన్న ఆ సమయంలో హరిదాసులు వస్తుంటారు. హరి అంటే “శ్రీమహావిష్ణువు” – దాసు అంటే శిష్యుడు, ఈ అర్థవంతమైన పేరులోనే అన్ని నిబిడీకృతమై ఉన్నవి. అతని వేష భాషలు చాలా మనసుకు హత్తుకు పోయేటట్లు, ఆ ఆశీర్వచనములు ఎంతో ప్రాముఖ్యమైనవి.



హరిదాసు దుస్తులు అలంకారాలు వర్ణించడం చాలా ముఖ్యమైనది. హరికి ముఖ్య శిష్యుడు అంటే సాక్షాత్తు దైవిక శక్తే కదా! ఈ కలియుగంలో మనకి ఇంతైనా అదృష్టం ఇచ్చిన ఆ దైవానికి కోటి కోటి నమస్కారములు. అట్టి శిష్యుని దుస్తులు రంగురంగులతో ఎరుపు – పసుపు డిజైన్లతో అద్దాల ఖండువతో, అప్పుడే లేలేతగా వస్తున్న సూర్య కాంతిలో, మంచు పడుతూ నిలిచిపోయిన చెట్ల కొమ్మలు, వాటి మీద తీయని కూతల తో అలరించే కోయిలలు, వాటి సంగీతం, మైమరిచిపోయే ప్రకృతిలో ప్రత్యేకమైన దేవదూతేమో!? అనిపించేటట్లు గా ఉంటారు.

ఆ హరిప్రియునికి చేతిలో చిరతలు, కాలికి గజ్జలు, సాంప్రదాయ చిహ్నంగా బొట్టు, దేశీయతతో ఉట్టిపడే పంచ కట్టు, అర్థవంతమైన ఖండవా తో ఇంటి ముందు ముగ్గులలో వెల్కమ్ చెపుతారు. నిండుతనాన్ని ప్రసాదింపచేసే ధారణ గల ఆ హైందవ దైవిక శక్తికి మన: సుమాంజలి.

అతని తలమీద కంచు పాత్ర దగదగా మెరిసేదాన్ని డిజైన్ అలంకరణతో చుట్టూ పూలదండలతో అందమైన హార్యానికి పోటీపడుతూ కనిపిస్తున్న శంఖచక్రములు ఉంటయ్యి. తల కుదురు మీద పెట్టిన కలశం, చేతులకి బిగుతుగా పెట్టిన పూల, మెడలో బండిపూసలతో అసాధారణమైన చిత్రవిచిత్ర మాలల తో హరిదాసు వస్తారు. శ్రీకృష్ణుని తలపించే వైజయంతి మాల లాంటి పూలదండలు, భగవంతుని పాటలతో పసుపు, కుంకుమలు, పూలు గొబ్బెమ్మల కళ తో ఉట్టిపడుతున్న ముగ్గులో ప్రత్యక్షమైన హరిప్రియునికి ఆహ్వానం. ఆ శిష్యుడు ముగ్గుల లోగిళ్ళలో లయబద్ధంగా దేవదేవుని పాటలతో, చిరు గజ్జల సవ్వడితో కీర్తిస్తూ సందడిగా నాట్యం చేస్తారు. ఆ లోగిళ్లకు ప్రత్యేక అందాలు తీసుకువచ్చిన అట్టి దృశ్యం చూసే వాళ్ళ అదృష్టం చెప్పతరమా!. అనుభూతికి కూడా, కాలం, సమయం, కలిసి రావాలంటే ఎంతటి వారైనా ఎదురుచూడాల్సిందే.

అతను రావటమే ప్రత్యేకం. కొత్త బట్టలు కట్టుకున్న ఆడపిల్లలు, పట్టు పరికిణిలో అందాల పూల జడలతో, కాళ్లకు వెండి పట్టీలు, జడకు బంగారు జడ కుప్పెలు, నడుముకి వడ్డాణాలు, చేతులకు కట్టే- వంకీలు, బంగారు గాజులు, తలమీద సూర్యచంద్రులూ పెట్టుకున్న చిన్న శ్రీ మహాలక్ష్మి లాగా దోసిల్లలో బియ్యం తీసుకుని హరిప్రియ శిష్యుడి కలశంలో పోస్తుంటారు.

ఆ చిన్నారి బంగారు తల్లి చేతుల్లో ఉన్న ఆ బియ్యాన్ని ముగ్గులలో ఉన్న హరిదాసు కొంచెం వంగి ఆ పాప దోసిల్లో ఉన్నవి అతని కలశంలో పోయించుకుంటారు. ఆ ఇంటి యజమానికి అతని కుటుంబానికి అంతా భోగభాగ్యాలతో, అఖండ సౌభాగ్యంతో చిరకాలం వర్ధిల్లాలని ఆశీర్వదిస్తూ ఆ ప్రక్కన ఉన్న ఇంటికి ఇంకో ముగ్గుల ముంగిటికీ దేవుడి శిష్యుడు పయన్నమైతారూ. ఇటువంటి లోగిలిలో కళకళలాడే ముగ్గులు తోరణాలతో అలరారుతున్న ఆ ఇంట్లోని మహిళలు లక్ష్మీదేవికి ఆహ్వానం పలకడం అనే ఆలోచన ఎంతో పవిత్రమైనది. ఆ ఇంటి ముందున్న ముగ్గులలోని గొబ్బెమ్మల అలంకారాలు, వాటి మీద పూలు, గుమ్మడి, ముళ్ళ గోరింట, బంతి, చిక్కుడు వ్,ఎ,. వాటి మీద బియ్యం పిండితో వేసిన డిజైన్లు ఎకో ఫ్రెండ్లీ. ఇంకా ఆ మహిళ ఒక తల్లిగా, ఒక సోదరిగా, ఒక భార్యగా, ఒక కూతురుగా, ఒక ఇంటి గౌరవప్రదమైన ఆడపడుచుగా, అలరాలే ఒక సలహాదారినిగా, ఒక ఉపాధ్యాయని, ఒక నెలసరి ఆదాయం సంపాదించగలిగే ప్రతిభ కల్గి, అయినను సర్వసాధారణంగా కనబడేటటువంటి శక్తి స్వరూపమే. తానే బహుముఖ ప్రజ్ఞాశాలి.! ఎంతో పట్టుదల, సహనం, ఓర్పు, త్యాగమే ఇటువంటి మహిళ విజయానికి పునాది. ముగ్గుల ప్రత్యేకతలతో ఒక జామెంట్రీ ని ఒక సాంప్రదాయ పద్ధతిని అలవోకగా ఇంటిముందు ఆవిష్కరించేవారు మహిళలు – అట్టివారికి “నీరాజనాలు”.

ఇలాంటి ముగ్గులు ఒక పైథగరస్ థీయరం, ఒక పద్మ పురాణం, ఒక శంఖ చక్రధారి అయిన శ్రీ మహావిష్ణువుల చిహ్నాలని, ఆయన భార్య శ్రీ మహాలక్ష్మికి ఇష్టమైన ఆభరణాలతో కూడినది. సాక్షాత్తు ఆ మంచు కొండల్లో నివసిస్తున్న మహా శివుడి తాండవ నాట్యంలో ప్రధమ గణాల సందడితో పాటు ఈ సంక్రాంతికి వచ్చే గంగిరెద్దు రూపంలో ఆ మహా నందీశ్వరుని దర్శించ కలగటం లో అనేక రహస్యాలు దాగి ఉన్నాయి. ఇందులో ప్రత్యేకత ఏమిటంటే శివకేశవులు ఇరువురు కాదు ఒకరే. అభేద్యం అని కూడా!.

ఇంకొక ముఖ్యమైన విషయము ఈ పండుగలో మన దేశ ప్రగతికి తోడ్పడే వ్యవసాయ రైతుకి కూడా భాగం వుంది. ధాన్యలక్ష్మిని ఇంటికి తీసుకువచ్చే సమయం కూడా సంక్రాంతి, అనేక ఋతువుల ఆటుపోట్లను తట్టుకొని పొలంలో ఆ సమయాన్ని గడిపి ఇంటికి వచ్చే రైతు ధన్యుడు. ఆ కొత్త ధాన్యంతో పరమాన్నం-కొత్తబియ్యం, బెల్లం, పాలతో, చేసి ఆ ధాన్యలక్ష్మికి, భూమాతకు, అష్టదిక్పాలకులకు, వరుణ వాయుదేవుళ్ళకు, ధన్యవాదములుగా నైవేద్యం సమర్పించే అవకాశమేకదా ఈ మన దేశ రైతుల సంస్కృతి. ఇది కాక పల్లెటూర్లలో పొలం నుండి వచ్చిన ధాన్యం భద్రతగా ముందు రోజుల కోసం దాయటాన్ని “పాతర “ వేయటం అంటారు. ఇది ఇంట్లో భూమిలో లెక్క ప్రకారం తవ్వి ఎండు గడ్డిలో “ వెంట్లు” తయారుచేసి దాని లోపల అమర్చటం, ఆ మధ్యలో వడ్లను ఇంటి ఆడపిల్లలతో ఐదు దోసిళ్లతో ముందర వేయించి తరువాత వారికి ఐదు గంపల ధాన్యాన్ని బహుమతిగా ఇవ్వటం ఆనాదిగా వస్తున్న ఆచారం.

తర్వాత ఇంకో ముఖ్యమైనది గంగిరెద్దు దాన్ని తీసుకువచ్చేవారు. దాని మూపురం మీద రంగుల అద్దాలు పట్టు దారాలతో చూడ చక్కని డిజైన్లతో చేసిన అద్భుత అలంకారాల సమూహమే. అట్టి అందాల దుప్పటి తో వచ్చిన ఆ గంగిరెద్దు చూడముచ్చటగా ఉంటుంది. ఈ గంగిరెద్దు ముంగిలిలోని ముగ్గుల్లో ప్రత్యేకమైన ఆ వెంకన్న స్వరూపం ఎంతో శుభప్రదంగా పరిగణిస్తారు. దాని మెడలో గంటల పట్టి, కొమ్ములకి పట్టు దారాలు కుచ్చులు పసుపు కుంకుమలతో అలంకరించి చివర్న రెండు చిరుమువ్వల్ని కడతారు. ఆ మెడ భాగం వెనుక శంఖ చక్రాలు నుదుట వెంకన్న నామాలు లాగా బొట్టు ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. యక్ష, గంధర్వ, కిన్నర, కింపురుష స్వర్గద్వార ముగ్గులలో దేవతలు వచ్చి ఆశీర్వదిస్తారని ప్రతీతి. అంతేకాకుండా పితృదేవతలు సంతృప్తిగా ఈ తరం తన పిల్లలను ఆశీర్వదిస్తూ శాశ్వత స్వర్గలోక ప్రాప్తి తో ఆ లోకానికి ప్రయాణిస్తుంటారని పూర్వీకుల మనోగతం. సంక్రాంతి ముగ్గుతో స్వర్గ ధామంగా మలిచే స్త్రీ శక్తి మూలంగా ఇంట్లో లక్ష్మీ సరస్వతి పార్వతిల స్థిర నివాసం ఏర్పరుచుతారు. ఇటువంటి అలంకారాలతో అర్థవంతమైన ముగ్గులతో ఆ సాంప్రదాయాన్ని పాటిస్తూ తన కుటుంబంలో అందరి మన్ననలు పొందగలిగేదే మన భారతదేశ మహిళల సంస్కృతి, సంస్కారాలు.

## ఉస్మానియా మెడికల్ కాలేజీలో నూతనంగా ఎంపికైన 1257 మంది ల్యాబ్ టెక్నీషియన్ లకు నియామక పత్రాలు అందజేసిన మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్

**- అందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు**
**- మంత్రి పొన్నం ప్రభాకర్**






**హైదరాబాద్ వెలుతురు జనవరి 13:**
ఉస్మానియా మెడికల్ కాలేజీలో నూతనంగా ఎంపికైన 1257 మంది ల్యాబ్ టెక్నీషియన్ లకు నియామక పత్రాలు అందజేసిన మంత్రులు దామోదర రాజనర్సింహ,పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ సురేఖ ఓం ప్రకాష్ , వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు ,ఇతర అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్ అందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు మంగళవారం రోజున 1257 మంది ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలకి ఎంపికై నియామక పత్రాలు అందుకుంటున్న మీ అందరికీ శుభాకాంక్షలు.. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో మన ప్రాబ్లం చెప్తే చికిత్స చేసేది..ఇప్పుడు మనకు ఉన్న ప్రాబ్లం చెప్తే వైద్య పరీక్షలు చేసిన తరువాతనే చికిత్స చేస్తున్నారు.. మారుతున్న కాలానికి అనుగుణంగా వైద్య రంగంలో ఆరోగ్య పరీక్షలు మరింత లోతుగా జరుగుతున్నాయి మీరు ఇచ్చే రిపోర్ట్ ఆధారంగానే చికిత్స అందిస్తుంటారు.. మీరు డాక్టర్ కి చెవులు కళ్ళలగా పని చేయాలి.. రోగుల పట్ల మీరు సానుకూలంగా ప్రేమతో వ్యవహరించాలి.. మీ దగ్గరకు రోగులు రాగానే అక్కడే వారికి సగం వ్యాధి తగ్గిపోవాలి.. ఈ ప్రాంగణంలో కనిపిస్తున్న హాస్టల్ బిల్డింగ్ నిర్మాణం జరుగుతుందంటే దామోదర రాజనర్సింహ, గాంధీ, ఉస్మానియా, కాకతీయ మెడికల్ కాలేజీలు ,హాస్పిటల్ లు ఎంతో అభివృద్ధి చేస్తున్నారు మా హుస్నాబాద్ నియోజకవర్గంలో దామోదర రాజనర్సింహ గారి సహకారంతో 250 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుంది.. హుస్నాబాద్ నియోజకవర్గంలో నిత్యం డయాలసిస్ కేసులు ఎక్కువగా వస్తుండడంతో దానిని నివారించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.. హుస్నాబాద్ ను ప్లాస్టిక్ రహిత నియోజకవర్గం గా తీర్చిదిద్ది 280 మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశాం.. 500 పైగా హెూటల్ లకు గ్లాస్ లు పంపిణీ చేశాం.. దాని ద్వారా క్యాన్సర్ సంబంధిత వ్యాధులు చెక్ పెట్టే దిశగా చర్యలు తీసుకున్నాం..

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పేవి అన్ని అబద్దాలు.

**- మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

**హైదరాబాద్ వెలుతురు జనవరి 13:**
సనత్ నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశమైన తలసాని శ్రీనివాస్ యాదవ్ సికింద్రాబాద్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ లు మల్కాజిగిరి జోన్ లో కలిపింది వాస్తవం కాదా? 17 వ తేదీన నిర్వహించనున్న శాంతి ర్యాలీకి అనుమతి కోసం ఈ నెల 5 న హైదరాబాద్ పోలీసు కమిషనర్ కు దరఖాస్తు చేస్తే మల్కాజ్ గిరి కమిషనర్ అనుమతి ఇవ్వాలంటూ సమాధానం సికింద్రాబాద్ పరిధిలోని పలు డివిజన్ లను మల్కాజిగిరి జోన్ పరిధిలోని బోయిన్ పల్లి సర్కిల్ లో చేర్చారు ప్రభుత్వం విడుదల చేసిన ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. అధికారులు కూడా ధృవీకరిస్తున్నారు సికింద్రాబాద్ +ఎవీజ లోనే ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పుడు ప్రకటన చేయడం ప్రజలను మభ్య పెట్టడమే భవిష్యత్ తరాలకు నష్టం జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరిది మన అస్తిత్వం, ఆత్మగౌరవంపై జరుగుతున్న దాడిని ప్రతిఘటించాలి ఈ నెల 17 న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి శాంతి ర్యాలీ ని వీ+ రోడ్ లోని గాంధీ విగ్రహం వరకు సాగుతుంది భారీ ర్యాలీలో అన్ని సంఘాలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చిన తలసాని




# సంపాదకీయం.. తెలుగు లోగిళ్లలో భోగి...భాగ్యం!



భారతీయయ సంస్కృతిలో పండగలది విశేష స్థానం. ప్రత ఇపండగకూ పరమార్థం ఉంది. ఇందులో కాలనుగుణంగా పండగలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. భోగి,సంక్రాంతి, కనుమ అన్నవి దక్షిణాయం నుంచి ఉత్తరాయణ ప్రయణానికి సూచికగా గుర్తించాలి. సూర్య గమనం ముందు ఇదో విశేషం.దక్షిణాయనంలో సూర్యుడు రోజు రోజుకి భూమికి దక్షిణం వైపుగా కొద్ది కొద్దిగా దూరమవుతూ దక్షిణ అర్ధగోళంలో భూమికి దూరం అవుట వలన భూమిపై బాగా చలి పెరుగుతుంది. ఈ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు సెగ కోసం భగ భగ మండే చలి మంటలు వేసుకునేవారు, ఉత్తరాయణం ముందురోజుకి చలి విపరీతంగా పెరగడం ఈ చలిని తట్టుకునేందుకు భగ భగ మండే మంటలు అందరు వేయటం వలన ఈ రోజుకు భోగి అనే పేరు వచ్చిందనే ప్రచారం ఉంది. శాస్త్రీయ కారణాల ప్రకారం, సూర్యుడు దక్షిణయానం కాలంలో భూమికి దూరంగా ఉండటంతో ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత పెరుగు తుంది. ఈ చల్లని వాతావరణాన్ని తట్టుకునేందుకు, చలి బాధలను తప్పించుకునేందుకు, దక్షిణా యానంలో తాము పడిన కష్టాలు, బాధలను తట్టుకున్నందుకు.. ఉత్తరాయణ కాలంలో సుఖ సంతోషాలను కోరుకుంటూ భోగి మంటలను వేస్తారు. భుగ్ అనే సంస్కృత పదం నుంచి భోగి అనే పదం వచ్చిందని చరిత్ర ద్వారా తెలుస్తోంది. భోగం అంటే సుఖం. పురాణాల ప్రకారం, శ్రీ రంగనాథ స్వామిలో గోదాదేవి లీనమై భోగాన్ని పొందిందని.. దానికి సంకేతంగానే భోగి పండుగ ఆచరణలో వచ్చినట్లు పెద్దలు చెబుతారు. మరో కథనం మేరకు.. శ్రీ మహా విష్ణువు వామనుడి అవతారంలో వచ్చి బలి చక్రవర్తిని పాతాళంలోకి తొక్కింది కూడా భోగి రోజునే. ఇంకోవైపు ఇంద్రుడి పొగరును అణచివేస్తూ గోవర్ధన పర్వతం ఎత్తిన పవిత్రమైన రోజు కూడా భోగి రోజే అని పెద్దలు చెబుతారు. అంతేకాదు రైతుల కోసం ఈశ్వరుడు నందిని భూమికి పంపిన పవిత్రమైన రోజునే భోగి రోజు అని.. అందుకే ఈరోజు భోగి పండుగను జరుపుకుంటారు. జనవరి నెలలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి సాధారణంగా చలి మంటలను వేసుకుంటారు. కానీ భోగి మంటలనేవి కేవలం చలి తీవ్రత నుంచి తప్పించుకునేందుకు మాత్రమే కాదు.. ఆరోగ్య ప్రయోజనాల కోసం కూడా వేస్తారు. సంక్రాంతి పండక్కి సరిగ్గా నెలరోజుల ముందు ధనుర్మాసం ప్రారంభమవుతుంది. ఈ సమయంలో ఇంటి ముందు పెట్టిన గొబ్బెమ్మలను పిడకలుగా చేస్తారు. వాటినే భోగి మంటల్లో వేస్తారు. వీటిని కాల్చడం వల్ల గాలి శుద్ధి అవుతుంది. సూక్ష్మ క్రిములు నశిస్తాయి. మనకు శ్వాసకోశకు సంబంధించిన అనేక రోగాల నుంచి ఉపశమనం లభిస్తుంది. భోగి మంటల్లో పిడకలతో పాటు రావి, మామిడి, మేడి, ఔషధ చెట్ల కలప, ఆవు నెయ్యి వేస్తారు. ఆవు నెయ్యి, ఆవు పిడకలను మంటల్లో వేయడం వల్ల శక్తివంతమైన గాలి విడుదలవుతుంది. అందుకే భోగి మంటలను ప్రతి పలెటూళ్లో విధిగా వేస్తారు. అంతేకాదు ఊళ్లో ఉండే వారందరినీ కులాలకు అతీతంగా అందరినీ ఒకేచోట చేర్చి, ఐక్యమత్యం పెంచడంలో కూడా భోగి ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతేకాదు అగ్నిదేవుడిని ఆరాధిస్తూ.. వాయుదేవునికి గౌరవం ఇచ్చినట్టు భోగి పండుగ రోజున సాయంత్రం వేళలో బొమ్మల కొలువు నిర్వహిస్తారు. ఇదే రోజున చిన్నారుల తలపై భోగి పళ్లను పోస్తారు. ఇదే రోజున బదరీ వనంలో శ్రీహరిని పిల్లాడిగా మార్చి దేవతలంతా బదరీ పళ్ల(రేగు పళ్ళ)తో అభిషేకం చేశారు. అవే కాలానుగుణంగా వచ్చిన మార్పులో భోగి పళ్లుగా మారాయి. వీటితో పాటు పూలు, శనగలు కూడా కలిపి చిన్నారులపై వేయడం వల్ల వారు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతారని చాలా మంది నమ్ముతారు. సంక్రమణ మహాపర్వానికి ముందు రోజుకి ఒక ప్రాధాన్యం ఉంది. దీనికి భోగిపర్వం అని పేరు. అయితే భోగము అనే మాటకు అర్థం ఏమిటంటే అనుభవము అని. ఆనందంగా దేనిని అనుభవిస్తామో లేదా దేనిని అనుభవించడం వల్ల ఆనందం పొందుతామో దానిని భోగము అనాలి. అలాంటి భోగములు అనుభవించవలసిన రోజుని భోగి అంటారు. నిజమైన ఆనందాన్ని అనుభవించడమే నిజమైన భోగం. ఒక్కొక్కరికి ఒక్కొక్కటి ఆనందం. సామాన్యుల ఆనందాలు వేరు. వాళ్ళకి లౌకిక విషయాలు దొరికితే అది భోగం. ఆ విషయంతో విసుగు కలిగితే మరో విషయం లభించాలని. కానీ ఏది లభిస్తే మరి ఇంకేదీ కావాలని అనిపించదో, ఏది పరిపూర్ణమైన ఆనందమో అదే నిజమైన భోగం. అలాంటి భోగం యోగం వల్లనే లభ్యం అవుతుంది. అందుకే యోగులే భోగులు కాగలరు. అలాంటి దివ్య భోగం ఈరోజున అమ్మ గోదాదేవి ఆండాళ్ళమ్మ పొందినది. అదేమిటంటే పరమాత్మ ప్రాప్తి. రంగనాథుని చేపట్టినది. రంగనాథుని అనుగ్రహాన్ని పొందినది. రంగనాథుని సాంగత్యం అనబడేటటువంటి ఆ కైవల్యానందం అనే భోగాన్ని అమ్మ పొందినది కనుక ఈరోజు భోగి అనే పేరు భక్తి సాంప్రదాయం పరంగా నిర్వచించేవారు చెబుతారు. సరిగ్గా ఈ రోజుతో ధనుర్మాసం పూర్తి అవుతున్నది. తర్వాతు రేప్పు నుంచి మకర మాసం వస్తున్నది సౌరమానం ప్రకారంగా. ఈ ధనుర్మాస వ్రతమంతా ఈరోజు పూర్తి జరిగి దాని ఫలితంగా అమ్మవారు స్వామియొక్క అనుగ్రహాన్ని పొందినది.భోగి లేదా భోగి పండుగ అనునది ఆంధ్రులు జరుపుకునే ఒక ముఖ్యమైన పండుగ. ఆంధ్రులు పెద్ద పండుగగా జరుపుకునే మూడు రోజుల సంక్రాంతి పండుగలో మొదటిరోజును భోగి అంటారు. చలికాలంలో అత్యంత చలిగా ఉండే రోజు భోగి. ఈ రోజున ఆంధ్రులు మంటలు వేసి చలికాచుకుంటారు, ఈ మంటలనే భోగి మంటలు అంటారు. భోగిమంటలకు ఎక్కువగా తాటిఆకులను ఉపయోగిస్తారు. ఈ ఆకులను భోగికి కొన్ని రోజుల ముందే కొట్టుకొని తెచ్చి భోగిమంటల కొరకు సిద్ధం చేసుకుంటారు. అనేక ప్రాంతాలలో ప్రత్యేకంగా భోగిమంటల కొరకు తాటాకు మోపులను ఇళ్ళవద్దకే తెచ్చి విక్రయిస్తున్నారు. వీటితో పాటు మంటలలో మండగల పనికిరాని పాత వస్తువులను ముందురోజు రాత్రికి సిద్ధం చేసుకుంటారు. తెల్లవారుజామున సాధారణంగా 3 గంటల నుంచి 5 గంటల మధ్యన ఎవరి ఇంటి ముందువారు ఈ మంటలు వేయడం ప్రారంభిస్తారు. పండుగ నెలలో ముగ్గులు ప్రతిరోజు వేస్తారు, కాని భోగి రోజు ముగ్గు ఒక ప్రత్యేకత. రోజు వేసే ముగ్గుల కన్నా ఈ రోజు మరింత అందంగా రంగు రంగుల రంగవల్లికలేస్తారు. భోగి పండుగ రోజు పిల్లలపై భోగి పలు పండ్లు పోసి ఆశీర్వదిస్తారు, అందుచేత ఈ పళ్ళను భోగి పళ్ళు అంటారు, భోగి పళ్ళ ఆశీర్వాదాన్నీ శ్రీమన్నారాయణుడి ఆశీస్సులుగా భావిస్తారు. కొన్ని ప్రాంతాలలో భోగి రోజున రైతులు తమ సాగుభూమికి ఆనవాయితీగా కొంతమేర సాగునీరు పారించి తడి చేస్తారు, ఒక పంట పూర్తయిన తదుపరి మళ్ళీ పంట కొరకు సాగుభూమిలో నీరు పారించడాన్ని పులకేయడం అంటారు, ఆనవాయితీగా భోగి రోజున పులకేయడాన్ని భోగి పులక అంటారు.

## నేటితో ముగియనున్న ధనుర్మాస వ్రతం

**- నెలరోజులుగా వైష్ణవాలయాల్లో తిరుప్పావై పఠనం**



**తిరుమల,జనవరి13( వెలుతురు):**

సూర్యుడు ఏడాదిలో ప్రతి నెలా ఒక్కో రాశిలో సంచరిస్తుంటాడు. సౌరమానం ప్రకారం సూర్యుడు ఏ రాశిలో ఉంటే ఆ నెలను ఆ రాశి పేరుతో పిలుస్తారు. సూర్యుడు ధనస్సు రాశిలో ప్రవేశించి మళ్లీ మకర రాశిలోకి వెళ్లే వరకూ ఉన్న సమయమే ధనుర్మాసం. దక్షిణాయనం దేవతలకు రాత్రి. ఉత్తరాయణం పగలు. ఉత్తరాయణం ముందు వచ్చే ధనుర్మాసం దేవతలకు బ్రాహ్మీ సమయం. సూర్యదేవుడు ధనుస్సురాశిలో ప్రవేశించడంతో మొదలై భోగిపండుగ రోజువరకూ, సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించేంతవరకూ ఉండే మాసం ధనుర్మాసంగా ఆచరించారు. వైష్ణవ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైన మాసం ఇది. అందుకు గత నెల రోజులుగా వైష్ణవాలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు సాగాయి. భోగిరోజు గోదా కళ్యాణంతో ధనుర్మాస ఉత్సవాలు ముగుస్తాయి. ఈ మాసమంతా వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. గోదాదేవి రచించిన 'తిరుప్పావై' ని ఈ మాసం రోజులు పఠించారు. ముఖ్యంగా కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల రోజులు సుప్రభాతానికి బదులుగా తిరుప్పావైని పఠించారు. అటువంటి పవిత్రమైన ధనుర్మాసంలో శ్రీమహావిష్ణువును 'మధుసూదనుడు' అనే పేరుతో పూజించడం ఆనవాయితీ. శ్రీరగంలో ధనుర్మాస ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. అక్కడి శ్రీరంగనాథుడి కోవెలలో ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ధనుర్మాసం మొత్తం ఇంటి ముందు ఆవుపేడను కలిపిన నీటిని చల్లి బియ్యపుపిండితో అందమైన ముగ్గులు పెట్టి, ముగ్గుల మధ్యలో ఆవు పేడతో చేసి, పసుపు, కుంకుమలు, వివిధ పూలను అలంకరించిన గొబ్బిళ్ళను ఉంచాలి. ఈ విధంగా చేయడం వల్ల కన్యకు మంచి భర్త లభిస్తాడు, సౌభాగ్యం కలకాలం వర్ధిల్లుతుంది అని నమ్మకం. గోదాదేవి కల్యాణం, కాత్యాయని, శ్రీవ్రతం చేస్తే సకలశుభాలు కలుగుతాయని భక్తులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తెల్లవారుజామున నిద్రలేచి భక్తిశ్రద్ధలతో ప్రతిమను తయారుచేసి నారాయణుడి ఆవాహన పూజలు చేస్తారు. రోజూ పూజకు పంచామృత స్నానం, తులసి దళాలతో అర్చన, నైవేద్యాలుగా నెయ్యి, బియ్యం, బెల్లం, మిరియాలు, పెసరపప్పు, పొంగలి, జీలకర్ర వేసి తయారు చేసిన నైవేద్యాన్ని సమర్పించాలి. ధనుర్మాసం ప్రారంభమైన నాటి నుంచి పక్షం రోజులు ఈ నైవేద్యాలను, మిగిలిన పక్షం రోజులు దద్ధోజనాన్ని నైవేద్యంగా సమర్పించాలి. సూత, శౌనకాది మహామునులు వ్రత విధానాన్ని బోధించినట్లు పురాణాలు వెల్లడిస్తున్నాయి. ధనస్సు సంక్రమణం మొదలు మకర సంక్రమణం వరకు వ్రతాన్ని ఆచరిస్తారు. దీనిని కాత్యాయనీ వ్రతంగా కొందరు ఆచరిస్తారు. ధనుర్మాసంలో గోదారంగనాథ స్వామిని ఆరాధించడం మూలంగా సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ మాసంలో పాశురాలను చదవడం వల్ల ఎంతో పుణ్యఫలం లభిస్తోంది. ధనుర్మాస వ్రతం ఆచరించడం వలన చాలా పుణ్యం లభిస్తుందని పండితులు చెబుతున్నారు. మాసం రోజులు భగవంతుడిని ఆరాధించి పుణ్య ఫలాలను పొందాలని పండితులు సూచిస్తున్నారు

## భోగి మంటలు రకరకాల ఆచారాలు

**- సుగంధ ద్రవ్యాలను వేయడం మంచిది**

**విజయవాడ,జనవరి13( వెలుతురు):**

సంక్రాంతి పండుగకు ముందు రోజు వచ్చే పండుగ భోగిగా భావిస్తారు. ఈ భోగి పండుగ రోజును భోగభాగ్యాలు ఇచ్చే విశేషమైన పర్వదినంగా భావిస్తారు. ఈ పండగ రోజున అందరూ తెల్లవారుజామునే నిద్రలేచి భోగి మంటలు వేస్తారు. భోగి పండుగ రోజు పిడకలు వేసి మంటలు వేస్తారు. గోదావరి జిల్లాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లో భోగిమంటలు వేయడం ఆనవాయితీ. కొందరు పాతవస్తువులు ఇందులో వేసి పీడ వదులుతుందని నమ్ముతారు. అయితే భోగి మంటల్లో కొన్ని పదార్థాలను ఒక మూటగా కట్టి వేయడం వల్ల ఏడాదంతా శుభ ఫలితాలు కలుగుతాయని.. సకల పీడలు దరిద్రాలు పోతాయని పండితులు చెబుతున్నారు. మనలో చాలా మందికి భోగి మంటలు ఎందుకు వేస్తారో తెలియదు. ఎప్పటి నుంచో వస్తున్న ఆచారం కాబట్టి పాత వస్తువులు, చెత్తా చెదారం వేసి వీధుల్లో మంటలు పెడతారు. కానీ పురాణాల ప్రకారం భోగి మంటల వెనుక ఒక కథ ఉంది. అదేమిటంటే.. పూర్వం రురువు అనే రాక్షసుడు ఉండేవాడట. ఆ రాక్షసుడు బ్రహ్మదేవుడి గురించి కఠోర తపస్సు చేయగా.. బ్రహ్మదేవుడి కరుణించి ప్రత్యక్షమయ్యాడట. ప్రత్యక్షమై నీ కోరిక ఏంటో చెప్పమని రురువు రాక్షసుడిని అడిగాడట. అప్పుడు ఆ రాక్షసుడు తనకు మరణం లేకుండా వరం ఇవ్వమని బ్రహ్మదేవుడిని అడిగాడట. ఆ కోరికను బ్రహ్మదేవుడు అంగీకరించలేదట. అప్పుడు ఈ రాక్షసుడు ఎవరైనా 30 రోజుల పాటు ఇంటి ముందు గొబ్బెమ్మలు పెట్టి, అవి బాగా మంటగా వేసి ఆ మంటల్లో



నన్ను తోస్తేనే మరణించేలా వరం ఇవ్వండి అని బ్రహ్మదేవుడిని కోరాడట. దానికి బ్రహ్మదేవుడు అంగీకరిస్తాడట. అలా రాక్షసుడు మిగిలిన సమయాల్లో మరణించకుండా వరం పొందుతాడట. ఆ వర గర్వంతో దేవతలందరినీ ఎంతో ఇబ్బంది పెట్టేవాడట. ఆ బాధలు భరించలేని దేవతలు అందరూ ఏకమై ధనుర్మాసంలో 30 రోజుల పాటు ఇంటిముందు గొబ్బెమ్మలు పెట్టి.. వాటిని బాగా ఎండిన తర్వాత మంట వేసి.. ఆ మంటలో రురువు రాక్షసుడిని తోస్తారట. అలా ఆ రాక్షసుడి పీడ విరగడైందని.. అప్పటి నుంచి భోగి పండుగ రోజు భోగి మంటలు వేసుకోవడం ఆచారంగా వస్తోందని ఒక కథనం. అంతే కాకుండా ఈ భోగి మంటలు వేయడం వెనుక వైజ్ఞానిక రహస్యం కూడా ఉంది. అదేమిటంటే రురువు అంటే సూక్ష్మక్రిమి అని కూడా అర్థం వస్తుంది. కాబట్టి భోగి మంటలు చలికాలంలో వాతావరణంలో ఉండే [illegible] తొలగిపోవడానికి తోడ్పడతాయనే సందేశం కూడా అందిస్తుంది. అలాగే మనలోని చెడు గుణాలన్నింటినీ కూడా పండుగ రోజు భోగి మంటల్లో కాల్చేయాలని కూడా చెబుతారు. క ఎర్రటి వస్త్రం తీసుకని అందులో కొంచెం కర్పూరం, కొన్ని తెల్ల ఆవాలు, రెండు గోమతి చక్రాలు ఉంచాలి. ఆ ఎర్రటి వస్త్రాన్ని బాగా మూటకట్టి భోగి మంటల చుట్టూ 3 ప్రదక్షిణలు చేసి.. ఆ మూటను భోగి మంటలో వేయాలి. ఇలా చేయడం వల్ల జాతక దోషాలు తొలగిపోతాయని పండితులు చెబుతున్నారు. అలాగే బాగా అదృష్టం కలిసివస్తుందట. ఈ పరిహారం పాటించడం వల్ల ఈ ఏడాదంతా కుటుంబం సంతోషంగా ఉండటమే కాకుండా ఆర్థిక సమస్యలు తొలగిపోతాయని కూడా చెబుతున్నారు.గ్రహ దోషాలు తొలగి పోవాలంటే.. భోగి పండుగ రోజు ఒక పరిహారం చేయాలని పండితులు చెబుతున్నారు. అదేమిటంటే భోగి మంటల సమయంలో మంటల పక్కన ఒక బిందెడు నీళ్లను ఉంచి.. ఆ నీళ్లు బాగా వేడైన తర్వాత ఆ నీటితో స్నానం చేయడం వల్ల గ్రహ దోషాలు తొలగిపోతాయని చెబుతున్నారు. అయితే ఇవన్నీ ఎలా ఉన్నా ఆయా ప్రాంతాల ఆచారాల మేరకు భోగిమంటలు వేస్తుండారు.

## విగ్రహ రూపంలో ఉన్న స్వామిని పరిణమాడిన గోదాదేవి

**- నేడు శ్రీరంగంలో అత్యంత వైభవంగా గోదా కళ్యాణం**

**శ్రీరంగం,జనవరి13( వెలుతురు):**

తిరుప్పావై, గోదాదేవి కళ్యాణానికి తమిళనాడులోని శ్రీరంగం విశేష ప్రాధన్యం ఉంది. మిగతా కళ్యాణాలతో పోలిస్తే గోదా రంగనాథుల కళ్యాణానికి ఒక విశేషం ఉంది. అన్ని కళ్యాణోత్సవాలతో స్వామికి వైభవం ఉంటే గోదా రంగనాథుల కళ్యాణంలో మాత్రం వైభవం అంతా అమ్మ గోదా దేవికే ఉంటుంది. విష్ణుచిత్తుని కూతరుగా పెరిగిన అమ్మవారు శ్రీరంగనాధుడిని వలచి వరించి స్వామిలో ఐక్యం చెందిన ఇతిహాస పురాణం ఉంది. మిగిలిన దేవతా కళ్యాణోత్సవాలతో పోలిస్తే గోదా రంగనాథుల గోదా కళ్యాణం ప్రత్యేకతకు రెండు కారణాలు ఉన్నాయి. గోదాదేవి అద్భుతమైన వ్రతాన్ని ఆచరించి, ఆ ఆచరించిన దాన్ని మన దాకా ఆచరించేట్టుగా చేసింది అందుకే 'పాడియరుళవల్ల పల్-వళై యాయ్' అని అంటుంటాం. తాను ఆచరించిన దాన్ని ఎంతో కాలం దాక ఆచరించగలిగేట్టుగా ప్రబంధాన్ని అందించింది. అది గోదా దేవి గొప్పతనం. ఇది వరకు ఇలాంటి వ్రతాన్ని గోపికలు చేసారు కానీ వారు తరువాతి వారికి ఏమి అందించలేదు శ్రీకృష్ణుని అనుభవాన్ని పొంది ఊరుకున్నారు. గోదాదేవి నిత్యం ఆచరించి తెలియచేసిన కీర్తనలే తిరుప్పావై పాశురాలుగా ప్రసిద్ధి చెందాయి. సీతమ్మ రామచంద్రుణ్ణి వివాహమాడి ఊరుకుంది, పద్మావతి అమ్మవారు శ్రీనివాసున్ని వివాహమాడి ఊరుకుంది, కానీ గోదాదేవి ఒక్కో పాటలో మనం ఏం తెలుసుకోవాలి, ఎలా తెలుసుకోవాలి, ఎలా ఆచరించాలో చెప్పింది. సీతమ్మ కానీ పద్మావతి అమ్మవారు కానీ భగవంతుణ్ణి తనవంటి కదిలే రూపంలోనే వివాహ మాడారు. కానీ గోదా దేవి



మానవకన్యగా ఉంటూ విగ్రహ స్వరూపుడైన రంగనాథున్ని వివాహమాడింది. ఆ వైభవమే తిరుప్పావైగా నెలరోజులు సాగిన తరవాత భోగి రోజు గోదాకళ్యాణంతో ముగిస్తారు. తన ఆచరణతో విగ్రహ స్వరూపుడైన భగవంతుణ్ణి కదిలేట్టు చేసుకుంది. ఇదే అమ్మవారి యొక్క గొప్పతనం. మన ఎదురుగుండా కనిపించే విగ్రహాన్ని, అది దైవమని విశ్వసించి, మనం చెప్పినట్లుగా మనం పిలిచినట్లుగా అది కదలగలుగుతుంది, పలకగలుగుతుంది అనే విశ్వాసాన్ని ఆండాళ్ తల్లి నిరూపించి చూపించింది. 'ఉలగనిల్ తోత్రమాయ్ నింద్ర శుడరే తుయిలెరాయ్', అంది అమ్మ అంటే లోకంలో కంటికి కనిపించేట్టుగా విగ్రహరూపంలొ ఉండే భగవంతుడా! ఆ విగ్రహ రూపంలో నీ ప్రభావము అనుపమానము, అసమానము అని విశ్వసిస్తున్నాను అని చెప్పి భగవంతుణ్ణి కదిలేట్టు చేసింది. మూడు పనులు చేసి విగ్రహరూపంలొ ఉండే భగవంతుణ్ణి కదిలేట్టు చేసింది. అవి కృష్ణమ్ ఉద్బోధ్య, కృష్ణమ్ అధ్యాపయంతి మరియూ 'కృష్ణమ్ బలాత్కృత్య భూంక్తే'. ఆయన ఏమి ఉలకకుండా పడుకుంటే మేల్కొల్పింది. చిన్న పిల్లవాడికి బెత్తం చూపి పాఠం చెప్పినట్లుగా, మనల్ని బాగుచేయడానికి, మనం తెలుసుకోవలసిన విషయాలని మనకి ఆయన ఎట్లా తెలిసేట్టు చేయాలో ఆయనకి పాఠాలు నేర్పింది. అంతే కాదు స్వామి విగ్రహరూపంలో ఉన్నా ఆయన్ని నిర్బందించి, బంధించి, ఆయన్ని పొందింది. అందుకే ఎక్కడో శ్రీవిల్లిపుత్తూరులో ఆండాళ్ ఉంటే, శ్రీరంగంలో ఉన్న స్వామి స్పందించి అర్చకులని, రాజుని అమ్మని తీసుకురమ్మని ప్రేరేపించి రప్పించుకున్నాడు. విగ్రహంలో ఉన్న స్వామితో వివాహమని తెలియగానే జనాలు తండోపతండాలుగా తరలి వచ్చి ఆశ్చర్యపోయినందుకే ఆ వీదికి చిత్ర వీది అనే పేరు ఏర్పడిపోయింది. తరువాత వీది ఉత్తరవీది, అక్కడ ఉన్న స్వామి అమ్మని వివాగమాడి గోదాదేవిని తనలో చేర్చుకున్నాడు. మానవకన్యగా ఉన్న ఆండాళ్ తల్లిని ఉత్సవ మూర్తిగా మలచి తానూ ఉత్సవ మూర్తిగా శ్రీవిల్లిపుత్తూరులో కలిసి ఉన్నాడు. శ్రీరంగనాథున్ని వివాహమాడటంతో సీతారాములకే ఇలవేల్పు అయ్యింది. సీతారాములకి తరువాతి కాలంలో అవతరించినా వారికి ఇలవేల్పు అవడం అమ్మ గొప్పతనం. ఈ సందర్భంగా శ్రీరంగంలో గోదా కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

# బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం డిమాండ్



బషీర్ బాగ్ వెలుతురు 13 జనవరి : తెలంగాణలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 34 శాతం కాకుండా, 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల పరిరక్షణ కోసం హైకోర్టులో బలమైన వాదనలు వినిపించాలని, తుది తీర్పు వచ్చే వరకు అన్ని స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేయాలని ఆయన కోరారు. బీసీల దళపతి ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టడానికి సిద్ధమవుతున్నామని, అవసరమైతే ఎన్నికలను బహిష్కరిస్తామని ఆయన హెచ్చరించారు. మంగళవారం మీడియాతో గుజ్జ సత్యం మాట్లాడుతూ, "కుల గణన ఆధారంగా బీసీలకు 50 శాతం వరకు రిజర్వేషన్లు కల్పించవచ్చని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయి. అయితే, ప్రభుత్వం 34 శాతానికి పరిమితం చేయడం బీసీల రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాయడమే. ఎస్సీ, ఎస్టీలకు కలిపి 15 శాతానికి పైగా రిజర్వేషన్లు కల్పిస్తున్నప్పుడు, మిగిలినది బీసీలకు ఎందుకు ఇవ్వకూడదు?" అని ప్రశ్నించారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో 34 శాతానికి పైగా రిజర్వేషన్లు సూచించినప్పటికీ, ప్రభుత్వం మౌనం పాటిస్తుండటం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా, బీసీ రిజర్వేషన్ల అంశం హైకోర్టులో విచారణలో ఉన్న నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్య విరుద్ధమని గుజ్జ సత్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. "రిజర్వేషన్లు లేకుండా ఎన్నికలు జరిపితే బీసీలకు తీరని అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వం తన తప్పుడు విధానాలను సవరించుకోవాలి" అని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీలు ఏకమై, రాజకీయ పార్టీల కుట్రలను తిప్పికొట్టాలని, హక్కుల కోసం పోరాటమే మార్గమని ఆయన పిలుపునిచ్చారు. ఇటీవలి పరిణామాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 2023 ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు హామీ ఇచ్చినప్పటికీ, ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో దీనిని అమలు చేయలేదు. మార్చి 2025లో అసెంబ్లీ రెండు బిల్లులు ఆమోదించి, జులైలో ఆర్డినెన్స్ జారీ చేసినా, సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితిని మించడంతో హైకోర్టు ఇంటరిమ్ స్టే విధించింది. ఈ బిల్లులు, ఆర్డినెన్స్ రాష్ట్రపతి ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయి. అక్టోబర్ 2025లో హైకోర్టు ఆదేశాలతో కొన్ని స్థానిక ఎన్నికలు నిలిచిపోయాయి. డెడికేటెడ్ కమిషన్ సమర్పించిన నివేదికలో ఎస్సీ, ఎస్టీలకు 15 శాతానికి పైగా కేటాయించి, బీసీలకు 34 శాతం సూచించడంతో ప్రభుత్వం ఒకటి-రెండు రోజుల్లో రిజర్వేషన్లను ఖరారు చేసి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించనుందని సమాచారం. బీసీల హక్కుల పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని గుజ్జ సత్యం తెలిపారు. ఈ అంశంపై రాజకీయ పార్టీలు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు తప్పవని అని అన్నారు.

## ట్రాఫిక్ చలాన్ లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం చట్టబద్ధమైనది కాదు: విక్రమ్ గౌడ్



హైదరాబాద్ వెలుతురు జనవరి 13:
ప్రజల గోపియమైన డేటాను సైబర్ నెరగల చేతిలో పెట్టినట్టే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. చట్టం తన పని తాను చేయాల్సిందే, నిబంధనలు పాటించని వారికి శిక్షలు పడాల్సిందే. కానీ, చలాన్ల రూపంలో జరిమానాను నేరుగా వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల నుండి 'ఆటో-డెబిట్ల చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచన మాత్రం అత్యంత ప్రమాదకరమైనది మరియు తప్పుడు నిర్ణయం అని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు విక్రమ్ గౌడ్ అన్నారు ముఖ్యమంత్రి గారు ఏ పరిస్థితుల్లో ఈ ప్రకటన చేశారో తెలియదు కానీ, ఈ నిర్ణయం వల్ల కాంగ్రెస్ పార్టీకి మరియు ప్రభుత్వానికి ప్రజల్లో ఇప్పటికే ప్రతికూలత మొదలైంది. ఇది భవిష్యత్తులో ప్రభుత్వ ప్రతిష్టను మరింత దెబ్బతీసే అవకాశం ఉంది. నాకు తెలిసినంత వరకు, ఈ అప్రజాస్వామిక నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ నాయకులు మరియు క్యాబినెట్ మంత్రులు కూడా మనస్ఫూర్తిగా అంగీకరించరు. దీనికి కారణాలు స్పష్టంగా ఉన్నాయి: చట్టబద్ధత లోపం: దేశ చరిత్రలో ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా ప్రజల వ్యక్తిగత ఖాతాల్లోకి నేరుగా ప్రవేశించే సాహసం చేయలేదు. చట్టపరంగా ఇలాంటి విధానాలకు ఎక్కడా ఆస్కారం లేదు. న్యాయపరమైన చిక్కులు: ఒకవేళ ప్రభుత్వం మొండిగా ఈ నిర్ణయాన్ని అమలు చేయాలని చూసినా, అది ఉన్నత న్యాయస్థానాల్లో (Courts) నిలబడదు. ఇది ప్రాథమిక హక్కులను కాలరాయడమే అవుతుంది. డేటా ప్రైవసీ (Data Privacy): ఈ టెక్నాలజీ యుగంలో, ఒక వ్యక్తి యొక్క బ్యాంక్ వివరాలను ప్రభుత్వ ఫైన్ల కోసం అనుసంధానం చేయడం అనేది 'వ్యక్తిగత డేటా ప్రైవసీ చట్టానికి' పూర్తిగా విరుద్ధం. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి, ప్రజలపై ఆర్థికంగా దాడి చేసే ఇలాంటి విధానాలను పక్కన పెట్టి, చట్టబద్ధమైన పద్ధతుల్లోనే ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలని కోరుతున్నాను. ప్రస్తుత చట్టం ఏం చెబుతోంది (Legal Standpoint) ప్రస్తుతం ఉన్న మోటార్ వాహనాల చట్టం (వీశీశీతీ ఎవవ్రఅఎశ్రీవం ా్మ) ప్రకారం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినప్పుడు నోటీసు పంపడం లేదా చలాన్ విధించడం జరుగుతుంది. అప్పీల్ చేసుకునే హక్కు: చలాన్ పడగానే డబ్బులు కట్ అయితే, సదరు వాహనదారుడు ఆ చలాన్ తప్పు అని భావిస్తే (ఉదాహరణకు: టెక్నికల్ గ్లిచ్ వల్ల తప్పు నంబర్ ప్లేట్ పడటం), కోర్టుకు వెళ్లే లేదా అప్పీల్ చేసుకునే ప్రాథమిక హక్కుకు భంగం కలిగే అవకాశం ఉంటది కాబట్టి ప్రభుత్వ నిపుణులతోని న్యాయ కోవిదులతోని చర్చించి ట్రాఫిక్కు ఇబ్బందులు తప్పి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండే విధంగా చేయాలని వారు కోరారు.

## సంక్రాంతి పర్వదిన సందర్భంగా అంబర్పేట బతుకమ్మ కుంటలో వి హనుమంతరావు తో కలిసి గాలిపటాలను ఎగురవేసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



బషీర్ బాగ్ వెలుతురు 13 జనవరి :
అంబర్ పేట్ బతుకమ్మ కుంట లో వి హనుమంతరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కైట్ ఫెస్టివల్ లో పాల్గొన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ హనుమంతరావు తో కలిసి రంగనాథ్ గాలిపటాలను ఎగురవేశాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చైనా మాంజను నిషేధించడం పై హర్షం వ్యక్తం చేసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రభుత్వ అధికారుల జీతాలలో కోతలపై రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం పై హర్షం వ్యక్తం చేశారు ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులని చూసుకోవాలని కోరారు, అదే విధంగా అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ కుంట తో పాటు మరో ఐదు చెరువులను నెల రోజుల్లోపు అందుబాటులోకి తీసుకొస్తామని మరో 24 చెరువులను కూడా త్వరలో అందుబాటులోకి తెస్తామని తెలిపారు. బతుకమ్మ కుంటలో కొన్ని సమస్యలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. ఆ సమస్యలను కూడా హైడ్రా ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో పాల్గొన్నవారు శంభుల శ్రీకాంత్ గౌడ్ దిడ్డి రాంబాబు తులిపూరి కృష్ణ గౌడ్ సిపిఎం నాయకులు మహేందర్ కుమార్ స్వామినాథ శ్రీధర్ గౌడ్ తదితరులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## బీసీ ల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



హైదరాబాద్, జనవరి 13 (వెలుతురు):
గౌడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజిగిరి నూతన సంవత్సర క్యాలెండర్ ను బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలుపుతూ రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు తాళ్ళ ఆనంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి బుడంపల్లి నిరంత్ గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు కాసుల మహేష్ గౌడ్, గోపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తిని వినయ్ కుమార్ గౌడ్, రామకృష్ణ, ఎల్గాని వెంకటేష్ గౌడ్, బత్తుల గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గ తండాలో గాలిపటం ఎగరవేస్తూ విద్యుత్ షాక్ గురై గాలయాల పాలైన చిన్నారి సపవత్ ధనుశ్రీకి ఆర్థిక సహాయం

- ఆరుట్ల గ్రామ ప్రాథమిక పారశాల ఉపాధ్యాయులు



మంచాల వెలుతురు జనవరి13:
మంచాల మండలం ఆరుట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని బుగ్గ తండాలో చిన్నారి సపవత్ ధనుశ్రీ గాలిపటం ఎగరవేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగకు గాలిపటం తగిలి విద్యుత్ షాక్ గురై గాలయాల పాలైన చిన్నారి ధనుశ్రీ హాస్పిటల్లో వైద్యం చేయించుకుంటున్న విషయం తెలు సుకున్న ఆరుట్ల గ్రామ ప్రాథమికపాఠశాల ఉపాధ్యాయులు మానవత్వంతో ముందుకు వచ్చి చిన్నారి ధనుశ్రీ వైద్యం ఖర్చుల కోసం 10వేల100 రూపాయలు చిన్నారి తనుశ్రీ బాలిక కు టుంబ సభ్యులకు ఆర్థికసాయంఅందజేసి సేవాభావం చాటుకున్నారు సందర్భంగా ఉపాధ్యా యులు మాట్లాడుతూ పిల్లలు గాలిపటాలు విద్యుత్ తీగలు ఉన్నదగ్గర దూరంగా ఉండి ఎగిరేసే విధంగా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు ఈ సందర్భంగా ధనుశ్రీ కుటుంబ సభ్యులు ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

## రోగులకు ప్రైవేటు ఆసుపత్రుల్లో అయిన వైద్య ఖర్చుల్లో సగం డబ్బులు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరు

- బండలేమూర్ గ్రామ సర్పంచ్ పాతులోతు శ్రీనువాస్ నాయక్



మంచాల వెలుతురు జనవరి 13:
మంచాల మండలం బండ లేమూర్ గ్రామానికి చెందిన గడ్డం శివప్రసాద్ అనారోగ్యంతో ఆస్పత్రి లో చికిత్స పొందిన ఖర్చులులకు 32000 రూపాయలు ఎమ్మెల్సీ నెలికంటి సత్యం సహకారంతో మంజూరి కావడం జరిగింది ఈ చెక్కునేడు ఆయనకుఅందజేయడం జరిగింది. ఈసందర్భంగా బండాలేమూర్ సర్పంచ్ పాతులోత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ సీఎంరిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చే డబ్బు లు నిరుపేదలకు ఆర్థికంగా వెసలు బాటు ఇస్తుంది ఆసుపత్రుల్లో అయి న వైద్య ఖర్చుల్లో సగం డబ్బులు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి అందజేస్తే పేదలకు మరింత వెసలుబాటు ఇచ్చినట్లు అవుతుందని ఆయన అ న్నారుఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు పోఛమోనికృష్ణ వీరయ్యమాజీ ఎంపీటీసీ వట్టి వెంకటేష్.ఉప సర్పంచ్ బూడిద రమేష్ గడ్డం అంజ య్య వల్లపు రంగయ్య గడ్డం లింగస్వామి జోగు జగదీశ్వర్ తదతరులు పాల్గొన్నారు

## చిన్నారిపై అత్యాచారం



భువనగిరి వెలుతురు జనవరి 13 :
భువనగిరి మండలం పెంచికల్ పహాడ్ గ్రామ మాజీ సర్పంచ్ సిలువేరు ఎల్లయ్య 5ఏళ్ల చిన్నారిపై అత్యాచారం.. నేరం ఒప్పుకున్న కిచకుడు పోలీస్ లు ప్రబుద్దుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించ్చినట్లు రూరల్ పోలీస్ లు మీడియా కు తెలిపారు...

## పెరేడ్ గ్రౌండ్ లో అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ ను ప్రారంభించిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్

- కైట్ ఫెస్టివల్ ప్రారంభోత్సవ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసిన మంత్రులు..
- తెలంగాణ ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు..
- మంత్రి పొన్నం ప్రభాకర్





హైదరాబాద్ వెలుతురు జనవరి 13:
పెరేడ్ గ్రౌండ్ లో అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ ను ప్రారంభించిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ కైట్ ఫెస్టివల్ ప్రారంభోత్సవ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసిన మంత్రులు.. కార్యక్రమంలో





పాల్గొన్న టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి , టూరిజం ఎండీ క్రాంతి వల్లూరి ,భాష సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి , ఇతర అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ టూరిజం శాఖ పక్షాన హైదరాబాద్ సంప్రదాయాలకు ఆచారాలకు అనుగుణంగా కైట్ ఫెస్టివల్, స్వీట్ ఫెస్టివల్ 3 రోజుల పాటు జరుగుతుంది..
తెలంగాణ ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు.. హైదరాబాద్ ఆతిథ్యనికి మారుపేరు.. ఇక్కడ జరుగుతున్న కైట్ ఫెస్టివల్ కి 19 దేశాల నుండి 40 మంది అంతర్జాతీయ కైట్ ప్లేయర్స్ వచ్చారు.. 15 రాష్ట్రాల నుండి 55 మంది జాతీయ కైట్ ప్లేయర్స్ వచ్చారు విభిన్నమైన కైట్స్ ఎగురుతున్నాయి.. 1200 శ్రీ స్వీట్స్ తో పాటు 60 స్టాల్ లో తెలంగాణ పిండి వంటలు ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగింది గచ్చిబౌలి లో హాట్ బెలూన్ కార్యక్రమం జరుగుతుంది.. మెట్రో ఫెసిలిటీ ఉంది.. మహిళలు ఆర్టీసీ లో ఉచితంగా రావచ్చు.. కైట్ ఫెస్టివల్ కి వచ్చి ఈ కార్యక్రమాన్ని వీక్షించవచ్చు..



## ఆరుట్ల గ్రామంలో 1700 కుటుంబాలకు గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పంపిణీ

- పేదలకు విద్యుత్ భారాన్ని తగ్గించడానికే గృహజ్యోతి పథకం
- ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కంబాలపల్లి బుగ్గ రాములు బుట్టి కృష్ణ ముదిరాజ్ చెరుకు నరసింహగౌడ్



మంచాల వెలుతురు జనవరి 13:
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోపేదలకు విద్యుత్ భారాన్ని తగ్గించడానికే ప్రభుత్వం గృహజ్యోతి పథకం తీసుకొచ్చిందని గృహజ్యోతి పథకం ద్వారా లక్షలాది నిరుపేదల ఇంట్లో వెలుగులు నిండుతున్నాయని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డై రెక్టర్ సాతిరిఎల్లేష్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కంబాలపల్లి బుగ్గ రాములు బుట్టి కృష్ణ ముదిరాజ్. చెరుకు నరసింహ గౌడ్ అన్నారు తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ శాఖవారు పేదప్రజలకు అందజేస్తున్న సున్నాబిల్లు ప్రొసిడింగులను లబ్దిదారులకు అందజేశారు ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించి సామాన్యులపై ఆర్థిక భారం తగ్గించిందని ఆరుట్ల గ్రామంలో 1700 కు టుంబాలు ఈ పథకంద్వారా లబ్ది పొందుతున్నారు అని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయ కులు మేగవత్ లక్ష్మానాయక్ దాసర మోని రమేష్ వెదిరే రమణారెడ్డి మార సురేష్ అంతటి రాజుగౌడ్ కావలి రమేష్ ముదిరాజ్ మానిపాటి వెంక టేష్ ఎన్నిదుల సురేష్ సుంకరి ప్రవీణ్ గౌడ్ మద్దెల బాలరాజు గౌడ్ నూకం బాలరాజు ముదిరాజ్ మంద దనేందర్ రెడ్డి నూకం మల్లేష్ ముదిరాజ్ ఆర్ల శ్రీకాంత్ మార పర్వతాలు ఆడెపు మధు దండ వెంకన్న మరియు విద్యుత్ శాఖ అధికారులు వెంకటేష్ గృహజ్యోతి లబ్దిదారులు ప్రజా గలం భూపాల్ తదితరులు పాల్గొన్నారు

## కష్టకాలంలో స్నేహితుడికి అండగా నిలిచిన పాఠశాల మిత్రులు



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 13:**
ఈ లోకంలో అన్ని బంధాల కంటే స్నేహబంధం మిన్న అని మరోసారి నిరూపించారు! నార్కట్ పల్లికి చెందిన కొందరు యువకులు. ఇటీవల నార్కట్ పల్లి పట్టణానికి చెందిన ఆందోజు విశ్వరూప చారి తండ్రి ఆందోజు కుమారస్వామి అనారోగ్యంతో మరణించిన సంగతి తెలిసిందే.?ఆ తండ్రిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న తన క్లాస్ మేట్ (పాఠశాల మిత్రుడు) విశ్వరూప చారికి మేమున్నామంటూ తోటి మిత్రులు భరోసానిచ్చారు. ప్రజ్ఞపురం అశోక్, మట్టపల్లి సాయి, ఇప్పలపల్లి నరేష్, కొప్పు శ్రీకాంత్, బండ నవీన్ మానవత్వాన్ని చాటుకుంటూ ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ?తమ వంతు సాయంగా ఆ కుటుంబానికి నిత్యవసర సరుకులు 50 కేజీల బియ్యం మరియు 10 కేజీల వంట నూనెను అందజేసి, ఆర్థికంగాను, మానసికంగాను ధైర్యాన్ని నింపారు. కష్టాల్లో ఉన్న మిత్రుడిని ఆదుకున్న ఈ యువకుల చొరవను స్థానికులు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు. ?"స్నేహితుడు అంటే కేవలం సంతోషంలో పాలుపంచుకునేవాడు మాత్రమే కాదు.కష్టాల్లో తోడుండేవాడే నిజమైన మిత్రుడు. అని అన్నారు.

## 'ప్రజా బాట' కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ పెద్ది కృష్ణ మూర్తి గౌడ్..



**జనగామ జిల్లా జనవరి 13(వెలుతురు):**
దేవరుప్పుల మండలకేంద్రంలోని కొత్తవాడ కాలనీలో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ప్రజా బాట' కార్యక్రమాన్ని దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ గ్రామాలలో ఎలాంటి విద్యుత్ సమస్యలున్నా,ఇంట్లో గాని వ్యవసాయ బావుల వద్ద గాని విద్యుత్ మీటర్లలో ఏమైనా సమస్యలున్నా విద్యుత్ నిర్వాహకులకు తెలుపాలని,ఎస్టీలకు విద్యుత్ వినియోగం లేకుంటే వారికి ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇస్తారని,ప్రజలకు నాణ్యమైన అంతరాయం లేని విద్యుత్ ను అందించేందుకు సిఎం రేవంత్ సర్కార్ కృషి చేస్తుందని, అలాగే విద్యుత్ ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ లైన్ మెన్ నర్సయ్య, వార్డు సభ్యులు చిలుకూరి నర్సయ్య,గోడిశాల శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ,మండల యూత్ ఉపాధ్యక్షులు ఉప్పుల సాయి ప్రకాష్,ఉప్పుల అనిల్,విద్యుత్ సిబ్బంది,కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన నాయకులు కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిన్ననాటి మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన పదో తరగతి విద్యార్థులు

**- 2016-2017 టెన్త్ క్లాస్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు**



**గుండాల జనవరి 13(వెలుతురు) :**
గుండాల మండలంలోని రామారం గ్రామానికి చెందిన చంద్రగిరి ప్రవీణ్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న 2016-2017 టెన్త్ క్లాస్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు చిన్ననాటి మిత్రుడు చనిపోయాడని మిత్రులు కన్నీరు మున్నీరయ్యారు. మిత్రుని ఇంటికి చేరుకొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం మిత్రుడి కుటుంబానికి తల్లికి 23100 రూపాయలు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ధార స్వామి అనేపర్తి లక్ష్మణ్ బెల్లంకొండ పవన్ నోముల మధు కొండూరు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## గుండాల మండలం సీతారాంపురం గ్రామంలో మినీ సమ్మక్క సారక్క జాతర



**గుండాల జనవరి 13(వెలుతురు):**
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామంలో సర్పంచ్ కాళి పద్మ వెంకన్న చేతుల మీదుగా మినీ సమ్మక్క సారక్క జాతర కరపత్రం ఆవిష్కరించారు. సమ్మక్క సారక్క జాతర నిర్వాహకులు వట్టిపల్లి బిక్షం మాట్లాడుతూ 28 జనవరి మొదలుకొని 30 జనవరి తారీకు వరకు ఈ జాతర కొనసాగుతుందని అన్నారు. గ్రామ సర్పంచ్ కాలి పద్మ వెంకన్న మాట్లాడుతూ గ్రామస్తులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ జాతరకు చుట్టుపక్క గ్రామస్తులు కాకుండా ఇతర ప్రాంతాల నుండి కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లెపాక నరేష్, వార్డు సభ్యులు చిలుకూరి మురళి మోహన్, మాటూరు శేఖర్, జోగు కృష్ణ, పాచిల్ల శ్రీను, శివరాత్రి లలిత, గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కో- ఆప్షన్ మెంబర్ వాజిద్ అలీ జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 13:**



నార్కెట్‌పల్లి మేజర్ గ్రామపంచాయితీ మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండి వాజిద్ అలీ పుట్టినరోజు సందర్భంగా నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దోసపాటి విష్ణు పుల్లెంల మహేష్ బోయపల్లి శ్రీనివాస్ వార్డు మెంబర్ నడింపల్లి నరేష్ యాదవ్ 5వ వార్డు అభ్యర్థి



బండారు చందు బొబ్బలి దేవేందర్ నాంపల్లి శ్రీను వడ్డేపల్లి నాగరాజు రవిచంద్ర నడింపల్లి మహేష్ ఎం జానీ బొజ్జ సిద్ధూ అయితరాజు రాజేష్ పసునూరి శ్రీనివాస్ పుల్లెంల వెంకట్ రహీం అలీ పెరమండ్ల రవి తదితరులు పాల్గొన్నారు

## సమాజంలో పత్రికలదే కీలక పాత్ర

**- యాదగిరి న్యూస్ మ్యాగజైన్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**



**యాదగిరిగుట్ట, జనవరి 13 ( వెలుతురు )**
సమాజంలో పత్రికలదే కీలకమైన బాధ్యత అని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. యాదగిరిగుట్టలో యాదగిరి న్యూస్ మ్యాగజైన్, శ్రీ యాదగిరి భక్తి ఛానల్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్ ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం పత్రికలు నిరంతరం పాటుపడుతున్నాయని అన్నారు. వివిధ పత్రికలు, జర్నలిస్టులు సమ సమాజ స్థాపనకు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. యాదగిరి న్యూస్ మ్యాగజైన్ ద్వారా నిరంతరం అద్భుతమైన వార్త కథనాలు అందిస్తూ సమాజంలోని సమస్యలను వెలికితీస్తున్నారని అన్నారు. అదేవిధంగా అనేక సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సమాజ అభివృద్ధికి ఇతోధికంగా పాటుపడుతున్న యాదగిరి న్యూస్ మ్యాగజైన్ యాజమాన్యానికి ఎడిటర్ కైరం కొండ నవీన్ కుమార్ కు అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు. శ్రీ యాదగిరి భక్తి ఛానల్ వారు ప్రతినిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాలను ముఖ్యంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి నిత్య పూజలు , యాదగిరిగుట్ట క్షేత్రానికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు భక్తులకు స్థానికులకు అందిస్తూ అద్భుతమైన సేవలు చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా యాదగిరి న్యూస్ మ్యాగజైన్, శ్రీ యాదగిరి భక్తి ఛానల్ నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించి కార్యక్రమానికి హాజరైన వారికి అందజేశారు. అనంతరం యాదగిరి న్యూస్ మ్యాగజైన్ ఎడిటర్ కైరంకొండ నవీన్ కుమార్ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో చాటింపు దినపత్రిక ఎడిటర్ , సీనియర్ జర్నలిస్టు అశోక్ కుమార్, యాదగిరిగుట్టకు చెందిన ప్రముఖులు గడ్డమీది మాధవులు గౌడ్, కొన్ని రమేష్ , తడక వెంకటేష్, శేఖర్, గుండ్లపల్లి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మేం సింగిల్ గానే ఫైట్ చేస్తాం

**- బిజెపి యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్**



**యాదగిరిగుట్ట , జనవరి 13 ( వెలుతురు )**
రానున్న మున్సిపల్ ఎన్నికల్లో యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో బిజెపి ఒంటరిగానే పోటీ చేస్తుందని యాదగిరిగుట్ట బిజెపి పట్టణ అధ్యక్షులు కర్రే ప్రవీణ్ స్పష్టం చేశారు . మంగళవారం యాదగిరిగుట్టలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీకి బి.ఆర్.ఎస్ తో పొత్తు ఉంటుందని గత కొన్ని రోజులుగా వివిధ రకాలుగా జరుగుతున్న ప్రచారం లో ఎలాంటి వాస్తవం లేదని అన్నారు. తమ పార్టీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని అన్నారు. బిజెపి యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో ఒంటరిగానే పోటీ చేస్తుందని అన్నారు. 12 వార్డుల్లో బిజెపి తరఫున అభ్యర్థులను నిలుపుతామని ఆయన వివరించారు . అత్యధిక వార్డుల్లో తమ పార్టీ అభ్యర్థులే విజయం సాధించి యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా యాదగిరిగుట్టలో అనేక సమస్యలపై బిజెపి ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటం చేస్తున్నామని అన్నారు అదేవిధంగా యాదగిరిగుట్టలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కోసం, యాదగిరిగుట్ట పట్టణ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న బిజెపి పార్టీని, బిజెపి తరఫున ఆయా వార్డుల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. బిజెపి జిల్లా కోశాధికారి కాదురి అచ్చయ్య మాట్లాడుతూ జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలలో బిజెపి ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలిపారు. ఏ పార్టీతోను తమకు పొత్తు ఉండదని అన్నారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలో బిజెపి ఘన విజయం సాధించడం ఖాయమని అన్నారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధితో ప్రజలంతా బిజెపి వైపు మొగ్గు చూపుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో. జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల చంద్రమౌళి ,పట్టణ ప్రధాన కార్యదర్శి నరేష్ ,జిల్లా భానుచందర్ ,కార్యదర్శి దొమ్మాట ప్రభాకర్ ,పలుగుల సురేష్ ,సీనియర్ నాయకులు లెంకల పల్లి శ్రీనివాస్,బందరపు మల్లేష్ ,బోడ సురేష్ ,శివరాత్రి శ్రీశైలం ,ఆకుల దేవేందర్ ,వంశీ ,అనిల్ ,శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పున: నిర్మాణానికి పాలకవర్గ శీసహకరించాలి



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 13:**
నార్కట్ పల్లి పట్టణ కేంద్రంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పున: నిర్మాణానికి గ్రామ పంచాయతీ పాలకవర్గ సహకరించాలని ఆలయ అర్చకుడు గుండె పూడి జానకి రామ శర్మ, సహాయ అర్చకులు ఉత్తర పల్లి నరసింహచార్యులు ఆలయ భక్త మండలి సభ్యులను కోరారు. మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపార, విద్యావేత్త యాద వెంకన్న సునీత దంపతులు కుటుంబ సభ్యులు దాతలుగా చేపట్టనున్న ఆలయ పున : నిర్మాణ పనులపై సందర్భంగా మంగళవారం ఆలయంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ జేరిపోతుల భరత్ గౌడ్, ఉప సర్పంచ్ సామ శిరీష ప్రవీణ్ రెడ్డి, అన్ని వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఆలయ పునర్నిర్మానం ఎందుకు చేపట్రాసి వస్తుందో, చేపట్టాల్సిన పనులేమిటో పాలకవర్గానికి, పుర ప్రముఖులు, అర్చకులు హనుమాన్ వ్యక్తమండలి సభ్యులకు వివరించారు. ఎంతో పురాతనమైన ఈ ఆలయం గతం నుంచి భక్తులు, దాతల చేయూతతో దినదిన అభివృద్ధి చెందుతున్న విషయాన్ని వివరించారు. అదే క్రమంలో ఇప్పుడు ఆలయ పునర్మానంలో భాగంగా నూతన ధ్వజస్తంభం, సలహారం, అర్చకుని గది వంటివి నిర్మాణానికి భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా ఎండోమెంట్ డిపార్టెంట్ ఇంజనీరింగ్ అధికారి చే ప్లాన్ సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఇంకా ఏమైనా సలహాలు, సూచనలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జేరిపోతుల భరత్ గౌడ్, హనుమాన్ భక్త మండలి సభ్యులు పసునూరి శ్రీనివాస్, దయాకర్, పసునూరు రమేష్, దోసపాటి ప్రసాద్, విష్ణు, కోటయ్య, గోదాల వెంకటరెడ్డి, సామ కొండల్ రెడ్డి, బిల్లం కంటి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలను కలిసి హరిహర సుతుని ప్రసాదం అందజేసిన యాదాద్రి జిల్లా యువజన నాయకులు మట్ట ధనుంజయ్ గౌడ్

**భువనగిరి వెలుతురు జనవరి 13:**
తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు, హరీష్ రావు, భువనగిరి మాజీ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి లను బి.ఆర్.యస్ పార్టీ నాయకులు మట్ట ధనుంజయ్ గౌడ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ మేరకు హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ప్రసాదాన్ని వారికీ అందజేశారు. ఈ సందర్భంగా మన పార్టీ అధికారం లోకి రావాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.





## నూతన వస్త్రాతరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 13 :**
నారాయణఖేడ్ పట్టణంలోనీ జీవన్ ఫంక్షన్ హాల్లో సంతోష్ రెడ్డి గారి కూతురి నూతన వస్త్రాతన కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించి శు భాకాంక్షలు తెలియజేసిన గౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు సంతోష్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

## రెండోవ సారి ఐతరాజు కవిత జ్ఞాపకార్థంగా అన్నదానం



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 13 :**
నార్కట్ పల్లి లో ప్రతిరోజు ఉచిత భోజనం లో భాగంగా మనం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 476 రోజున కీ,శే,ఐతరాజు కవిత జ్ఞాపకార్థంగా వారి భర్త ఐతరాజు రామకృష్ణ 100 మందికి నిరుపేదలకు, నిస్సయులకు,బాటసారులకు, అన్నదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కవిత కుమారులు కూతురు మొత్తం కుటుంబ సభ్యులు మరియు వార్త పేపర్ విలేకరి బండారు రాంబాబు, పాల్గొని,నిజమైన నిరుపేదల ఆకలి తీర్చటం గొప్ప సంతోషంనీ ఇచ్చింది.ఇంతటి పెద్ద కార్యక్రమం నడుపుతున్న ధైద నాగరాజు కీ ధన్యవాదములు. మా ముఖ్యమైన రోజులని ఇక్కడ జరుపటం పుణ్యంకర్యంగా భావిస్తాం అని తెలిపారు.

## మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా బీసీ మహిళలు లు అర్హులు కారా





**మిర్యాలగూడ వెలుతురు జనవరి 13:**
జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకే మిర్యాలగూడ మార్కెట్ కమిటీ చైర్మన్ ను నియమించాలి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఎవరిని నియమించకపోవడంలో ఆంతర్యమేమిటని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కాంగ్రెస్ పార్టీ పెద్దలను ప్రశ్నించారు. మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ జనరల్ మహిళ గా రిజర్వ్ అయిందని జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా ప్రకటించాలని దీనికోసం కాంగ్రెస్ పార్టీలో ఉన్న బీసీలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తెచ్చి తిరుగుబాటు చేయాలని లింగం గౌడ్ పిలుపునిచ్చారు.ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలను వాడుకోవడం ఆ తర్వాత పక్కన పెట్టడం సర్వసాధారణమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా బీసీ మహిళలు అర్హులు కారా అని ప్రశ్నిస్తున్నాం.బీసీలను విస్మరించే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నాం

## గృహజ్యోతి లబ్ధిదారుల పత్రాలు అందజేత



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 13:**
నార్కట్ పల్లి మండలం గోపాలయపల్లి గ్రామంలో 336 మంది లబ్ధిదారులకు గృహ జ్యోతి మంజూరు పత్రాలను సర్పంచ్, మాజీ ఎంపిటిసి, మచ్చ జయసుధ, ముత్యాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పరిగళ మమత నరసింహ, మాజీ సర్పంచ్ గోసుల భద్రాచలం, చిన్న భద్రాచలం, దేశ గాని భవాని, వేణు, రాము పాల్గొన్నారు.

## ఉదయ సముద్రం ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్ బడుగు చంద్రశేఖర్

**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 13 :**



నల్గొండ జిల్లా నార్కట్ పల్లి, నల్గొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్లో ఉన్న భూ సేకరణ, రైతులకు చెల్లింపు లు తదితరుల వివరాలను వెంటనే సమర్పించాలని. అనంతరం సర్జి ఫుల్ హౌస్ ను ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, తాసిల్దార్ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ నవీన్, జిపిఓ అనసూర్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, బ్రాహ్మణ వెల్లంల సర్పంచ్ చిరుమర్తి ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని ఒకే పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి తేవాలి

**- రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం వెలుతురు జనవరి 13:**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని పోలీస్ స్టేషన్లను ఒకే పోలీస్ కమీషనరేట్ పరిధి లోఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లాబిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రభుత్వానికి నివేదించారు. ఈమేరకు ఆయన ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిజిపి బత్తుల శివధర్ రెడ్డి కి లేఖరాశారు 1.ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్.నుమేడిపల్లి లేదా కుర్మిద్ద గ్రామాలలో ఏర్పాటు చేయా లి దీనిని మహేశ్వరం ఎసిపి పరిధి లోకి మార్చకుండా ఇబ్రహీంపట్నం ఎసిపి పరిధిలోనే కొనసాగించాలి 2.అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ ను వనస్థలిపురం ఎసిపిపరిధినుండి మినహాయించి ఇబ్రహీంపట్నంఎసిపి పరిధిలోకి తేవాలి 3.ఆదిభట్ల పోలీస్ స్టేషన్ ను హైదరాబాద్ కమీషనరేట్ లో చేర్చడం సరికాదు ఫ్యూచర్ సిటీ కమీషనరేట్. పరిధిలోనేకొనసాగించాలి 4.ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషన రేట్ కార్యాలయాన్ని కుర్మిద్ద మేడిపల్లి పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసేవిదంగా చర్యలు తీసుకోవాలనికోరారు. నియోజకవర్గ ప్రజల అభీష్టం మేరకే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## బిజెపి పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కు వినతి పత్రం



**గుండాల (వెలుతురు) జనవరి 13:**
గుండాల మండల కేంద్రంలో గత పది సంవత్సరాలుగా డీలర్ షాప్ చౌక ధరల దుకాణం ఖాళీగా ఉన్న కొత్త డీలర్ ను నియమించకపోవడంపై వెంటనే డీలర్ ను నియమించాలని తహసీల్దార్ హరికృష్ణకు బిజెపి పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించడం జరిగింది ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ పరిపాలనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గుండాల మండల కేంద్రంలో గత పది సంవత్సరాలుగా డీలర్ ఆరోగ్యా రిత్య డీలర్ సెలవుపై వెళ్లారు నేటికీ ఆ డీలరు అందుబాటులో లేక ఒకే షాపుపై బియ్యం తీసుకోవడం ప్రజలకు ఇబ్బంది జరుగుతుందని అన్నారు వెంటనే ఖాళీగా ఉన్న డీలర్ స్థానంలో కొత్త డీలర్ ను నియమించాలని అన్నారు మండలంలో ఒక నాలుగైదు గ్రామాలు గంగాపురం తురకల శాపురం రామారం డీలర్లు ఖాళీ అయిన కొత్త గా డీలర్లను నియమించకుండా కొత్తగా ఏర్పడ్డ గ్రామపంచాయతీలు పాచిల్ల, గుర్జ్ బావి , గ్రామాలలో డీలర్ నియమించకపోవడంతో వారి సమీప గ్రామాలకు వెళ్లి చౌక ధర దుకాణ ద్వారా బియ్యం తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉన్నదని వెంటనే కొత్త డీలర్ ను నియమించి వినియోగా దారులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

## భక్త మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు





**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 13 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణ శివారులోని శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో మకర సంక్రాంతి పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ సతీమణి ఉమాదేవి షెట్కార్, సంగీత షెట్కార్, ప్రభావతి షెట్కార్, పద్మశాలి మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక హారతి కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం వారు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో చక్కటి మార్కండేయ, చంద్రమౌళీశ్వరుని ఆలయం నిర్మించారని ఆలయ సభ్యులను కొనియాడారు.అనంతరం ఉమాదేవి షెట్కార్,సంగీత షెట్కార్,ప్రభావతి షెట్కార్ లను,ఆలయ కమిటీ సభ్యులు శాలువా మెమెంటుతో సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు, బాధ్యులు పాల్గొన్నారు.

## 80 లక్షలతో సిసి రోడ్డు, డ్రైనేజీ పనులు ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) జనవరి 13:**
మంగళవారం నాడు కామారెడ్డి పట్టణంలోని 20,21,22,23 వార్డ్ లలో 80 లక్షల రూపాయలతో బొంబాయి కాలనీ, రాజీవ్ కాలనీ లో నూతనంగా సీసీ రోడ్లను డ్రైనేజీ పనులను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు పండ్ల రాజు, సత్యం, యూనుస్, ప్రసాద్, వార్డ్ ప్రజలు, మహిళలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వం రైతుల కోసం సబ్సిడీ కింద మంజూరైన వ్యవసాయ యంత్రీకరణ పరికరాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**- రైతుల శ్రేయస్సు కోసమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది**

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**ఇబ్రహీంపట్నం వెలుతురు జనవరి 13:**
ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం డివిజన్ రైతులకు సబ్సి డీ కింద మంజూరు చేసిన వ్యవసా య యాంత్రీకరణ పరికరాలనురైతు లకుపంపిణీ చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి ఈసందర్భంగాఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం తెలంగాణ రైతులను ఆర్థికంగా మోసం చేసిందని సబ్సిడీ కింద రైతులకు అన్యాయం జరిగిందని మండిపడ్డారు తెలంగాణ రాష్ట్రంలో



కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేశామని సన్న వడ్లకు 500 బోనస్ ఇచ్చి రైతులను ఆదు కున్నామని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసమే పని చేస్తుందని చెప్పారు.రైతును రాజుగాచూడాలని కోరారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రైతులు రైతుకూలీలను ఆదుకుంటామని రైతులు ఎక్కువగా ఉపయోగించే పరికరాలను అధికారులు సబ్సిడీ ఇవ్వాలని ఆదేశించారు వ్యవసాయశీ అంటే ఒక పండుగ లాంటిదనిరైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర అందిస్తామని తెలిపారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉండి ఆదుకుంటుంది అని అన్నారుఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు సుజాత పద్మజ గడ్డి అన్నరం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి వైస్ చైర్మన్ భాస్కరచారి ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డివైస్ చైర్మన్ మంకాల కరుణాకర్ వివిధ గ్రామాల సర్పంచ్ లు మార్కెట్ కమిటీల డైరక్టర్లు డివిజన్ కి సంబంధించిన వ్యవసాయశాఖ అధికారులు కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు.సీనియర్ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలకు చెక్....

**- మహీంద్రా అండ్ మహీంద్రా కర్మాగారంలో 'అరైవ్ అలైవ్ల రోడ్ భద్రతా అవగాహనా కార్యక్రమం**

**- జహీరాబాద్ డీఎస్పీ సైదా....**

**జహీరాబాద్ వెలుతురు జనవరి 13:**
ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రతి ఒక్కరూ క్షేమంగా ఇంటికి చేరాలని జహీరాబాద్ డీఎస్పీ బి. సైదా ఆకాంక్షించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ శివారులోని మహీంద్రా అండ్ మహీంద్రా కర్మాగారం ఆవరణలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్ల రోడ్ భద్రతా అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ సర్కిల్ పరిధిలోని సీఐ శివలింగం, ఏఎస్ఐలు వినయ్ కుమార్, రాజేందర్ రెడ్డి, రవాణా శాఖ ఎంవీఐ వెంకటయ్య, మహీంద్రా అండ్ మహీంద్రా ప్లాంట్ హెడ్ అనిల్‌తో పాటు కర్మాగార కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలు శిక్షల కోసం కాదని, ప్రజల భద్రత కోసం రూపొందించబడినవని తెలిపారు. రోడ్డు పై ప్రయాణించే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మనం చేసే చిన్న పొరపాటు కూడా








ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. గత సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో 7 నుంచి 8 వేల మంది వరకు ప్రాణాలు కోల్పోగా, మరో 20 నుంచి 25 వేల మంది గాయాలపాలై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని వివరించారు. ఇటువంటి ప్రమాదాలను నివారించేందుకే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా మాట్లాడిన డీఎస్పీ సైదా, 'అరైవ్ అలైవ్ల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. కార్లు నడిపే వారు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల కారణంగా దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ప్రజలు మృతి చెందుతున్నారని పేర్కొంటూ, వీటిని నివారించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారితో రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తామని డీఎస్పీ సైదా ప్రమాణం చేయించారు.

## చివరి దశకు చేరిన ఖిజర్ యప్పై - 4 గోల్డ్ కప్ పోటీలు

**- ఫైనల్ కు చేరిన జై సేవాలాల్ జహీరాబాద్, జోహారఫా శేఖపూర్ సీసీ జట్లు...**



**జహీరాబాద్ వెలుతురు జనవరి 13:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణం లోని బాగారెడ్డి క్రీడా మైదానంలో మంగళవారం నాడు ఖిజర్ యప్పై గోల్డ్ కప్ 4 కప్ సెమి ఫైనల్ క్రికెట్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్ కు ముఖ్య అతిథులుగా పిపి సుభాష్ రాథోడ్, మండల తహసిల్దార్ పి దశరథ్, లు మాట్లాడుతూ ఖిజర్ యప్పై గోల్డ్ కప్ తో స్థానిక క్రీడాకారులకు ఐపీఎల్, రంజి ట్రాఫీ, జోనల్, రాష్ట్రస్థాయి ఆటగాళ్లను జహీరాబాద్ లాంటి ద్వితీయ శ్రేణి నగరంలో తీసుకొనివచ్చి ఆడించడం ద్వారా యువత ఎంతో




నేర్చుకోవచ్చని, ఈ టోర్నీ ద్వారా జహీరాబాద్ పేరు దేశంలో మారుమోగుతుందని, దేశం నలుములల నుంచి క్రీడాకారులను పరిచయం చేసి స్థానిక యువకులను క్రికెట్ పై మక్కువ పెరిగే విదంగా ఖిజర్ యప్పై చొరవ చూపడం అభినందనీయం అని, టోర్నీ గెలిచిన జట్టుకు 7 లక్షల విన్నర్, 4 లక్షల రన్నర్ ప్రైజ్ మనీతో టోర్నీ నిర్వహిస్తూ ఇక్కడి నుంచి ఆటగాళ్లను రంజి, జోనల్ స్థాయి ఆటల్లో ప్రమోట్ చెయ్యాలని అన్నారు.
ఉదయం జరిగిన మొదటి సెమీ ఫైనల్లో
డాలి క్లబ్ నగర్ కర్నూల్ మరియు జై సేవాలాల్ జహీరాబాద్ జట్ల మధ్య జరిగిన పోరులో టాస్ గెలిచి డాలి సీసీ బ్యాటింగ్ ఎంచుకోవడంతో నిర్ణిత 20 ఓవర్లలో 176 పరుగులు చేసి అలౌట్ అవ్వడంతో 177 పరుగుల లక్ష్యంతో బరిలోకి జై సేవాలాల్ సీసీ జట్టు 20 ఓవర్లలో 9వికెట్ల నష్టనికి 177 పరుగులు చేయడంతో డాలిపై విజయం సాధించి ఫైనల్ కు అర్హత సాధించింది. ఆల్రౌండర్ రాజేష్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ఇచ్చారు. రెండవ సెమి ఫైనల్ మ్యాచ్ లో జోహార్ఫా శేకపూర్ సీసీ మరియు అస్రర్ ఔరంగబాద్ మహారాష్ట్ర జట్ల మధ్య జరిగిన పోరులో అస్రర్ సీసీ టాస్ గెలిచి బ్యాటింగ్ చేస్తూ 17.2 ఓవర్లలో 135 పరుగులు చేసి అలౌట్ అవ్వడంతో 136 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శేకపూర్ సీసీ జట్టు బరిలోకి దిగి 13.2 ఓవర్లలో 4 వికెట్ల నష్టనికి 138 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్లో ప్రవేశించింది. ముఖ్య అతిధులు స్థానిక కోర్టు పిపి సుభాష్ రాథోడ్, మండల తహసిల్దార్, చేతుల మీదుగా వెయ్యి రూపాయల నగదు, ట్రాఫీతో ఆల్రౌండర్ దివ్య గజరాజ్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ చైర్మన్ రాములు నేత, మీడియా ఇంచార్జ్ మహేబూబ్ అలీ, అదం యప్పై, అబుద్ యప్పై, తహ యప్పై, నిర్వాహకులు మాక్సుద్ అలీ, మొహమ్మద్ అలీ, రాంచరణ్, వ్యాఖ్యాతలు అబ్దుల్లా సిద్దిఖీ, తయ్యబ్ అలీ, జయచంద్ రాథోడ్, విజయ్ రాథోడ్, మొహమ్మద్ జుబేర్, మొహమ్మద్ అమెర్, మొయిజ్ లష్కరి, అబ్దుల్ మజీద్, అమీర్ రేగుండా, శ్రీనివాస్ ముదిరాజ్, హిరు రాథోడ్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు, మొహమ్మద్ అబ్దుల్ వహీద్, రాకేష్ పబ్బతి తదితరులు పాల్గొన్నారు.

## పిచర్యగడి తండా వద్ద గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య

**- రైతు కంది పంట, డ్రిప్ సెట్ దగ్ధం.. రూ. 2 లక్షల నష్టం...**

**- నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికుల డిమాండ్...**



**జహీరాబాద్ వెలుతురు జనవరి 13:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలం పిచర్యగడి తండా గ్రామంలో రైతు తుమ్మలపల్లి గోపాల్ పొలంలో మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పొలంలో కోతకు సిద్ధంగా ఉన్న



కంది పంట మంటలకు బూడిద అయ్యింది. ఈ అగ్ని ప్రమాదంలో కంది పంటతో పాటు, రైతు వేల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ పైపులు, మొత్తం పైప్‌లైన్, మోటార్ కూడా ధ్వంసమయ్యాయి. ఆర్థికంగా ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్న గోపాల్‌కు సుమారు 2 లక్షల రూపాయల నష్టం కలిగింది. రైతు గోపాల్ కన్నీళ్లతో "సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డాను, అధికారులు నన్ను ఆదుకోవాలి" అని విన్నపం చేస్తున్నారు. గ్రామస్థులు, సంబంధిత వ్యవసాయ, రెవెన్యూ అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి నష్టపరిహారం అందించాలని, అలాగే ఈ దుశ్చర్యకు పాల్పడిన నిందితులను పోలీసులు గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

## యువకుల వెన్నుతట్టిన బండి

**- వారితో కలసి సరదాగా క్రికెట్ ఆడిన మంత్రి**

**సిద్దిపేట,జనవరి 13( వెలుతురు):**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ క్రాసింగ్ వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్ స్థానిక యువకులతో కలిసి క్రికెట్ ఆడారు. మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు వెళ్తుండగా మీర్జాపూర్ క్రాసింగ్ వద్ద క్రికెట్ ఆడుతున్న యువకులను చూసి ఆయన ఆగారు.

అక్కడ వంగరామయ్యపల్లి, మీర్జాపూర్, బల్లు నాయక్ తండా, జిలెల్ల గడ్డ గ్రామాలకు చెందిన యువకులంతా సంక్రాంతి పండగ సందర్భంగా యూనిటీ కప్ పేరుతో పోటీలు నిర్వహిస్తున్నారు. యువకులు బౌలింగ్ చేయగా కేంద్ర మంత్రి కొద్దిసేపు బ్యాటింగ్ చేసి రెండు మూడు బంతులను బౌండరీకి దాటించారు. పండగ సమయంలో యువకులు ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎలాంటి గొడవలు లేకుండా పోటీలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని యువకులకు సూచించారు.

## ఏడాదికోసారి గుండెను పరీక్షించుకోవాలి

**- ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ దయావాసు**



**వనపర్తి, వెలుతురు ప్రతినిధి జనవరి 13:**
ప్రతి ఒక్కరూ ఏడాదికోసారి గుండెను పరీక్షించుకోవాలని హైదరాబాద్ మెడికవర్ ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ దయావాసు అన్నారు. సోమవారం వనపర్తిలో మాట్లాడుతూ పదేళ్లు పైబడిన వారందరూ మూడేళ్లకోసారి పూర్తి బాడి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. 70 శాతం గుండె రక్తనాళాలు బ్లాక్ అయితేనే స్టంట్ కు వెళ్లాలన్నారు. ఈసీజీ, టుడీకే, స్కానింగ్, ఎంజోగ్రామ్ కు వెళ్లాలన్నారు. దమ్ము, గుండె దడ, చమటలు పట్టడం జరిగితే వెంటనే వైద్యులను సంప్రందించాలని సూచించారు. వనపర్తిలోని రెండు రోజులు గుండెకు సంబంధించి చికిత్స కోసం శ్రీ మాణిక్ హాస్పటల్లో చూడడం జరుగుతుందన్నారు.

## 29వ డివిజన్ కిసాన్ నగర్ కు సంబంధించిన తుది ఓటర్ల జాబితాలో తీవ్ర లోపాలు

**- జిల్లా కలెక్టర్, మున్సిపల్ లకు ఫిర్యాదు చేసిన న్యాయవాది నక్క ప్రమోద్**



కరీంనగర్ వెలుతురు జనవరి 13:
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన 66 వార్డుల డిలిమిటేషన్ ప్రక్రియలో, 29వ డివిజన్ (కిసాన్ నగర్) కు సంబంధించిన తుది ఓటర్ల జాబితాలో తీవ్ర లోపాలు ఉన్నాయని 29వ డివిజన్‌కు చెందిన న్యాయవాది నక్క ప్రమోద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం రోజున. జిల్లా కలెక్టర్ , మున్సిపల్ కమిషనర్ కు ఆయన ఫిర్యాదు చేశారు.జి.ఓ. నంబర్ 144, తేది: 21-06-2025 ప్రకారం, 29వ డివిజన్ పరిధిలోకి వచ్చే ఇంటి నంబర్లు 10-5-401 నుండి 10-5-824/4 వరకు, 10-6-1 నుండి 10-6-66 వరకు మాత్రమేనని స్పష్టంగా ప్రకటించారని తెలిపారు. అయితే, ఈ నిబంధనలకు విరుద్ధంగా, వాస్తవానికి అశోక్ నగర్ -- 54వ డివిజన్‌కు చెందిన ఇంటి నంబర్ 6-1-301 సిరీస్‌లోని 200కి పైగా ఓటర్లను, తప్పుగా 29వ డివిజన్ ఓటర్ల జాబితాలో చేర్చడం జరిగిందన్నారు.ఈ విషయమై గతంలోనే అధికారులకు వ్రాతపూర్వకంగా అభ్యంతరం తెలిపినప్పటికీ, 12-01-2026న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో కూడా అదే తప్పులు కొనసాగడం బాధాకరం అని పేర్కొన్నారు. ఇది జి.ఓ. నిబంధనలకు విరుద్ధం, డిలిమిటేషన్ ఉద్దేశ్యాన్ని దెబ్బతీసేదిగా ఉందన్నారు. ఇలాంటి తప్పులు కొనసాగితే, ఎన్నికల ప్రక్రియపై ప్రజల నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉందని, ప్రజాస్వామ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. వెంటనే శాస్త్రీయ పద్ధతిలో ఓటర్ల జాబితాను సవరించి, 54వ డివిజన్‌కు చెందిన ఓటర్లను 29వ డివిజన్ జాబితా నుంచి తొలగించాలని జిల్లా యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. అందుకే లోపాలను సరిదిద్దాలని జిల్లా కలెక్టర్ కి మునిసిపల్ కమీషనర్ కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.అధికారులు స్పందించకపోతే, న్యాయపరమైన పోరాటానికి దిగుతామని స్పష్టంగా తెలిపారు.

## క్రికెట్ టోర్నమెంట్ లో ముఖ్య అతిథి గా పాల్గొన్న టి పి సి సి స్టేట్ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్ర శేఖర్ రెడ్డి




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి. (వెలుతురు) జనవరి 13:**
మంగళవారం నాడు కామారెడ్డి జిల్లా ఇస్రోజివాడి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముఖ్య అతిథులుగా విచ్చేసిన టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదిగా ఆవిష్కరించారు,ఈ సందర్భంగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి గారు మాట్లాడుతూ, యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలని అప్పుడే మానసిక, శరీరకంగా ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. యువతతో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు ఇలాంటి టోర్నమెంట్లు మరిన్ని ఏర్పాటు చేయాలని ఎల్లవేళలా మీకు నా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు, జూలూరి సుధాకర్, చాట్ల వంశీ, గడ్డమీది మహేష్,గౌరు నవీన్ కుమార్ కామారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్, బండారి శ్రీకాంత్, ప్రణీత్, అజీజ్, నవీన్ లు పాల్గొన్నారు.




# కోరమీసాల వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

**- కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకున్న బండి సంజయ్**
**- ఘన స్వాగతం పలికిన ఆలయ నిర్వాహకులు, పూజారులు**
**- స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి**
**- తెలుగు ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన బండి సంజయ్**







**కరీంనగర్ వెలుతురు జనవరి 13:**
కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం రోజున హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండకు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కు స్థానిక బీజేపీ నేతలు కోలాటాలు, డప్పులతో ఘన స్వాగతం పలికారు. వారితో కలిసి శ్రీ వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు ఆలయం వద్దకు రాగానే టెంపుల్ నిర్వాహకులు, పూజారులు ఘన స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన బండి సంజయ్ అనంతరం వీరభద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే... ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు. ప్రకృతితో ముడిపడిన ఈ పండుగను తెలుగు ప్రజలందరూ సంతోషంగా, సంబురంగా జరుపుకుంటాం. విదేశీ సంస్కృతికి అలవాటుపడి మన సంస్కృతిని మర్చిపోతున్న ఈ తరుణంలో ముగ్గుల పోటీలు, సంక్రాంతి పోటీలు నిర్వహిస్తూ తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను గుర్తు చేయడం చాలా ఆనందంగా ఉంది. కొత్తకొండ వీరభద్రస్వామి స్వామి బ్రహ్మోత్సవాలకు ప్రతి ఏటా రావడం ఆనవాయితీ. అందులో భాగంగా ఇక్కడికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్న. కోరిన కోర్కెలు తీర్చే కోరమీసాల స్వామి వీరభద్రుడు. చాలా సందర్భాల్లో ఇవి నిరూపితమైంది. కోర మీసాల స్వామి కాబట్టి సమాజాన్ని నాశనం చేయాలనుకునేవాళ్లకు, చెడు ఆలోచనలు ఉన్న వాళ్లలో మార్పు తీసుకొచ్చే స్వామి వీరభద్రుడు. ఈ జిల్లా, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నా. అందరం కలిసి నరేంద్రమోదీ సంకల్పంతో భారత్ ను విశ్వగురుగా తీర్చిదిద్దేందుకు వికసిత్ భారత్ పేరిట శక్తివంచన లేకుండా కష్టపడుతున్నారు. ఈ తరుణంలో ప్రతి ఒక్కరూ మోదీకి అండగా నిలవాలని కోరుకున్నా. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలకు వస్తుంటారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తూనే ఉన్నా... భవిష్యత్తులో దేవాలయ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా.

# సత్తుపల్లి పర్యటనలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**- అగ్నిగుండం చేస్తే. ప్రజలు మిమ్మల్నే అగ్నిగుండంలోకి నెట్టెస్తారు**
**- ఓటమిని జీర్ణించుకోలేక పిచ్చి ప్రేలాపనలు**
**- బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి ధ్వజం**





**సత్తుపల్లి వెలుతురు జనవరి 13:**
తెలంగాణ ఉద్యమంలో అగ్గిపెట్టె పట్టుకుని యువతను రెచ్చగొట్టిన వారు చావలేదు కానీ..అమాయకపు వేలాది పిల్లల్ని పొట్టనపెట్టుకున్నరు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణను స్వార్థం కోసం మళ్లీ జిల్లాల పేరుమీద ఉద్యమాలు చేస్తాం..అగ్నిగుండాలు చేస్తాం..సామాన్య ప్రజలను బలిచేస్తాం అంటే..ఊరుకునే ప్రసక్తే లేదు.. ప్రజలు తెలివైన వారు.. అన్నీ గమనిస్తున్నారు మీరు ప్రజల్ని రెచ్చగొట్టి అగ్నిగుండం తయారుచేసి చలికాసుకుంట్ అంటే..ప్రజలు మిమ్మల్నే అగ్నిగుండంలోకి నెట్టెస్తారు. శాస్త్రీయంగా లేని జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల విభజనను తప్పకుండా సరిచేస్తాం. శాసనసభలో చర్చించి, రిటైర్డ్ జడ్జీ ద్వారా కమీటి వేసి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, కేబినెట్ లో చర్చించి ప్రజలకు అనుకూలమైన విధంగా సరైన పునర్వవస్థీకరణ చేస్తాం. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన బీఆర్ఎస్ నేతలు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా తీరు మార్చుకోకుండా పిచ్చి కుక్కల్లా మాట్లాడుతున్నారు, మంగళవారం సత్తుపల్లిలోని రాణి సెలబ్రేషన్స్ కన్వెన్షన్ హాల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అధ్యక్షతన జరిగిన 81 మంది సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొన్నటి పంచాయతీ ఎన్నికల ఫలితాలు చూశాక బీఆర్ఎస్ నాయకులకు మైండ్ బ్లాక్ అయ్యింది. ఓటమిని జీర్ణించుకోలేక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. రోడ్డు మీద పిచ్చి కుక్క కరిస్తే ఎలా పిచ్చెక్కినట్లు వాగుతారో.. అదే పద్ధతిలో గత పదేళ్లు పాలించిన వారు బ్లఫ్ చేస్తున్నారు. 10 మంది సర్పంచులను గెలిపించుకుని, కార్యకర్తలందరినీ నిలబెట్టి మేమే గెలిచామని చెప్పుకోవడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే గతి!

గతంలో ఎన్నికల ఫలితాలను సెమీఫైనల్స్‌గా అభివర్ణించిన మాజీ మంత్రులపై పొంగులేటి నిప్పులు చెరిగారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 69 శాతం సీట్లు గెలిచి కాంగ్రెస్ తన జైత్రయాత్రను చాటింది. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఇది 80 శాతానికి మించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సిఎం ఫోటోల మార్ఫింగ్ వ్యవహారం

**- ఐఎఎస్ మహిళా అధికారిని కించపరచేలా వార్తలు**
**- రెండు ఘటనలపై సిట్ ఏర్పాటు చేస్తూ డిజిపి ఉత్తర్వులు**
**- నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్‌కు సిట్ బాధ్యతలు**

**హైదరాబాద్,జనవరి13( వెలుతురు):**
హైదరాబాద్ సీసీఎస్‌తో పాటు నారాయణపేట జిల్లా మద్దూర్‌లో నమోదైన సంచలన కేసుల్లో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ప్రత్యేక దర్యాప్తు బృందంను ఏర్పాటు చేశారు. ఈ సిట్‌కు హైదరాబాద్ సీపీ సజ్జనార్ నాయకత్వం వహించనున్నారు. మొత్తం ఎనిమిది మంది సభ్యులతో ఈ ప్రత్యేక బృందాన్ని డీజీపీ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటోలను అసభ్యకరంగా పోస్ట్ చేసిన వ్యవహారంలో తెలంగాణా పబ్లిక్ టీవీ వాట్సాప్ గ్రూప్‌నకు చెందిన కావలి వెంకటేశ్‌పై కేసు నమోదైంది. కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 11న మద్దూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఓ మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచే విధంగా వార్తలు టెలికాస్ట్ చేసిన వ్యవహారంలో హైదరాబాద్ సీసీఎస్‌లో మరో కేసు నమోదైంది. ఈ కేసులో రెండు తెలుగు న్యూస్ ఛానల్స్, ఏడు యూట్యూబ్ ఛానళ్లపై కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై ఐఏఎస్ అధికారుల సంఘం కార్యదర్శి జయేశ్ రంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ రెండు కీలక కేసుల్లో దర్యాప్తు బాధ్యతను సిట్‌కు అప్పగించారు. నారాయణపేట జిల్లా మద్దూర్, హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైన కేసులపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం సిట్ ఏర్పాటుచేసింది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో 8 మందితో సిట్ ఏర్పాటు చేస్తూ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కావలి వెంకటేశ్ అనే వ్యక్తి సీఎం ఫొటోలను అసభ్యకరంగా రూపొందించి వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేశాడు.

మహిళా ఐఏఎస్‌ను కించపరుస్తూ వార్తలను ప్రచారం చేయడంపై సీసీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఐఏఎస్ అధికారుల సంఘం ఫిర్యాదు మేరకు రెండు తెలుగు న్యూస్ ఛానళ్లతో పాటు ఏడు యూట్యూబ్ ఛానళ్లపై కేసులు పెట్టారు. ఈ రెండు కేసుల వ్యవహారంపై సిట్ దర్యాప్తు చేయనుంది. సిట్‌లో సభ్యులుగా నార్త్ రేంజ్ జాయింట్ సీపీ శ్వేత, చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్, హైదరాబాద్ అడ్మిన్ డీసీపీ వెంకటలక్ష్మి, సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, విజిలెన్స్ అదనపు ఎస్పీ ప్రతాప్, సీసీఎస్ ఏసీపీ గురు రాఘవేంద్ర, సైబర్‌సెల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రెడ్డి, సైబర్‌సెల్ ఎస్సై హరీశ్ ఉన్నారు.

# నాలుగోసారి వాత తప్పదు!

**- ఒళ్లంతా విషం నింపుకొని బీఆర్ఎస్ నేతలు కారుకూతలు కూస్తున్నారు**
**- అప్పటి 'ప్రభువుల'కు ప్రజలే బుద్ధి చెబుతారు - మంత్రి పొంగులేటి**
**- అశ్వారావుపేటలో కాంగ్రెస్ సర్పంచుల సన్మాన సభలో బీ ఆర్ ఎస్ పార్టీ పై ధ్వజం**





**అశ్వారావుపేట వెలుతురు జనవరి 13:**
అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే కర్రుకాల్చి వాత పెట్టినా.. గత పాలకులకు ఇంకా జ్ఞానం రాలేదు. ఒళ్లంతా విషం నింపుకొని రోడ్ల మీద కారుకూతలు కూస్తున్న ఆనాటి 'ప్రభువుల'కు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో నాలుగోసారి వాత తప్పదని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అశ్వారావుపేటలోని శ్రీశ్రీ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ మద్దతుదారులైన 60 మంది సర్పంచుల సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పదేళ్ల పాలనలో పేదవాడికి ఇల్లు కట్టించాలనే జ్ఞానం కూడా లేని అప్పటి పాలకులు, ఇప్పుడు అధికారం పోయిందన్న అక్కసుతో సోల్లు వాగుడు వాగుతున్నారని మండిపడ్డారు. పదేళ్లలో నియోజకవర్గానికి కనీసం 10 ఇళ్లు కూడా ఇవ్వని వారు ఇప్పుడు తమ ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అని ఎద్దేవా చేశారు. ఇప్పటికే మూడుసార్లు చెంప చెళ్లుమనిపించిన ప్రజలు, మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే తీర్పును పునరావృతం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. అశ్వారావుపేట గిరిజన ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధతో తమ ప్రభుత్వం ఇక్కడకు 4,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించిందని, ఇది గిరిజన ప్రాంత అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే మేడారం జాతరను 200 ఏళ్ల వరకు చెక్కుచెదరని రీతిలో అద్భుతమైన రాతి కట్టడాలతో పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించారు. ఇదే క్రమంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రజలను ఎక్కడా ఇబ్బంది పెట్టకుండా, గ్రామాల్లో నిస్వార్థంగా సేవ చేస్తూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సర్పంచులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## బజార్‌హత్నూర్ లో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ప్రోగ్రాం

**- ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం**



**బజార్‌హత్నూర్ వెలుతురు జనవరి 13:**
ఆదిలాబాద్ జిల్లాలోని బజార్‌హత్నూర్ మండలం కేంద్రం లో ఆటో డ్రైవర్కు రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి వక్తలుగా ఎంవిఐ లు అల్లె. శ్రీనివాస్ , జి. ప్రదీప్ కుమార్ గౌడ్ పి. సాయన్న, సర్పంచ్ బజార్‌హత్నూర్, ఏఎంవిఐ ఎం. స్వేత , బీమ్ రావు పాటిల్ ఇన్సూరెన్స్ అడ్వైసర్ వినీల్ స్థానిక నాయకులు హెల్త్ అసిస్టెంట్, ఆటో డ్రైవర్స్ పాల్గొన్నారు . ఈ సందర్భంగా అతిథులు రహదారి భద్రత ప్రాముఖ్యతపై మాట్లాడుతూట్రాఫిక్ నిబంధనలు పాటించడం, డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వాడకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. వేగంగా వాహనాలు నడపడం వల్ల డ్రైవర్‌కు వాహనంపై నియంత్రణ తగ్గిపోతుందని తెలియజేశారు . ఆటోలో నిబంధనల ప్రకారం డ్రైవర్ తో పాటు ముగ్గురు మాత్రమే ప్రయాణించాలి. కానీ పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు.ఆటోలో నిర్ణయించిన పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించకూడదు. ఇలా ఎక్కువ మంది ప్రయాణికులను తీసుకెళ్లడం వల్ల వాహనం సమతుల్యత కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. బ్రేకులు సరిగ్గా పనిచేయకపోవచ్చు, మలుపుల వద్ద వాహనం నియంత్రణ తప్పి ప్రమాదం సంభవించవచ్చు. అలాగే డ్రైవర్‌కు సరైన దృష్టి, నియంత్రణ ఉండదు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడంవల్ల ప్రయాణికుల భద్రత తీవ్రంగా ప్రమాదంలో పడుతుంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు గాయపడే అవకాశం ఎక్కువ. ఇది ట్రాఫిక్ నిబంధనలకు కూడా విరుద్ధం. అందుకే ప్రతి డ్రైవర్ బాధ్యతగా ఆటోలో నిర్ణయించిన పరిమితిలోనే ప్రయాణికులను తీసుకెళ్లాలి. ఆటో రిక్షా డ్రైవర్ వాహనం ఇరుపక్కల (డ్రైవర్ పక్కన లేదా బయట వైపులా) ప్రయాణికులను అనుమతించరాదు. ఇలా కూర్చోబెట్టడం వల్ల వాహనం సమతుల్యత కోల్పోయి మలుపుల్లో లేదా ఆకస్మిక బ్రేక్ వేయాల్సిన పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలాగే డ్రైవర్‌కు స్టీరింగ్ మరియు నియంత్రణపై పూర్తి దృష్టి ఉండదు. ప్రయాణికులు రోడ్డుపై పడిపోవడం లేదా ఇతర వాహనాలతో ఢీకొనడం వంటి తీవ్రమైన ప్రమాదాలు సంభవించవచ్చు. కాబట్టి ప్రతి ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, కేవలం నిర్ణయించిన సీట్లలోనే ప్రయాణికులను అనుమతించి అందరి భద్రతను కాపాడాలి.ఆటో రిక్షాకు ప్రభుత్వం అనుమతించని అదనపు ఎల్ఈడి లైటులను బిగించరాదు. ఇటువంటి అదనపు లైటులు ఎదురుగా వచ్చే వాహనాల డ్రైవర్లకు కంటి చూపు మసకబారేలా చేసి ప్రమాదాలకు కారణమవుతాయి. అలాగే రాత్రి సమయంలో రోడ్డు మీద గందరగోళం ఏర్పడి ఇతర వాహనదారులు దారి తప్పే అవకాశం ఉంటుంది. ఇది ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధం కావడంతో పాటు జరిమానాలకు కూడా కారణమవుతుంది. అందువల్ల ప్రతి ఆటో డ్రైవర్ వాహన భద్రతను దృష్టిలో ఉంచుకొని, అనుమతించిన లైటింగ్ వ్యవస్థను మాత్రమే ఉపయోగించాలి.డ్రైవింగ్ చేస్తున్నప్పుడు డ్రైవర్ వద్ద ముఖ్యమైన పత్రాలు ఉండాలి – డ్రైవింగ్ లైసెన్స్, వాహనం యొక్క రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, బీమా సర్టిఫికేట్, కాలుష్య తనిఖీ సర్టిఫికేట్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ మరియు పర్మిట్ ఉండాలి అనంతరం రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుంది,
- మహబూబాబాద్ పట్టణ అభివృద్ధికి 59.62, కోట్లు మంజూరు చేసి 24. కోట్ల13 లక్షల తోపలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి,





**వెలుతురు మహబూబాబాద్ జిల్లా జనవరి 13:**
ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం సమన్వయంతో అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం, మహబూబాబాద్ పట్టణ పరిధిలో గల పలు అభివృద్ధి పనులకు గాను శంకుస్థాపనలు, శిలాఫలకాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, ఇన్చార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి మంత్రి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అలాగే శిలాఫలకాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ పట్టణంలో గల ఇల్లందు రోడ్ లోని 17వ వార్డులో రూ. 55 లక్షల విలువ కలిగిన సీసీ రోడ్లు, మురుగు కాలువలు, పైపు లైన్ నిర్మాణం, అదే విధంగా బేతోలు పరిధిలోని 6వ వార్డులో రూ. 50 లక్షల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, అలాగే రూ. 7 కోట్లతో బంధం చెరువు సుందరీకరణ పనులు, రూ. 64 లక్షల వ్యయంతో 19వ వార్డులోని పలు అభివృద్ధి పనుల కోసం, అంతే కాకుండా రూ. 40 లక్షల వ్యయంతో 33వ వార్డు, తహసిల్దార్ కార్యాలయం వద్ద అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, రూ. మూడు కోట్లతో 23వ వార్డులో అంతర్గత రోడ్లు, రూ. 59 లక్షల వ్యయంతో జంక్షన్ పరిధిలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, రూ. 12 కోట్ల వ్యయంతో 11వ వార్డులోని నందన గార్డెన్ రోడ్డు నందు హస్తినాపురం కాలనీ అభివృద్ధి, వరద ముంపు నివారణకు మురుగు కాలువల నిర్మాణ పనులు, రూ. 50 లక్షల వ్యయంతో ఇల్లందు రోడ్డులో గల 6, 17వ వార్డు జ్యోతిరావు పూలే జంక్షన్ ప్రాంతం అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, రూ. కోటి రూపాయల వ్యయంతో 32, 18వ వార్డులలో బొడ్రాయి సెంటర్ ప్రాంతం అభివృద్ధి పనులకు, రూ. కోటి వ్యయంతో 13, 14వ వార్డుల్లో మోర్ సూపర్ మార్కెట్ వద్ద బస్టాండ్ రోడ్డు అభివృద్ధి పనులకు గాను శంకుస్థాపనలు చేసి, శిలాఫలకాలు వేసి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రతి పేదవాడికి అండగా నిలుస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిబద్ధతతో అమలు చేస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమాన ప్రాధాన్యతతో అమలు చేస్తూ ప్రజలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ అని అన్నారు, ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ట్రాప్ లో రేవంత్




**హైదరాబాద్, జనవరి13 వెలుతురు :**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ట్రాప్ లో పడుతున్నట్లే కనిపిస్తుంది. కేసీఆర్ పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం గురించి మీడియా సమావేశంలో మాట్లాడిన తర్వాత వరసగా జరిగిన పరిణామాలు చూస్తుంటే కేసీఆర్ మరోసారి విసురుతున్న సెంటిమెంట్ వలలో రేవంత్ రెడ్డి చిక్కుకుంటున్నట్లే కనిపిస్తుంది. తెలంగాణ ఎన్నికలు మరో మూడేళ్లు ముందుగానే జలవివాదాలు ఒక రకంగా అధికార పార్టీని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయని చెప్పాలి. కేసీఆర్ ఓటమి పాలయిన తర్వాత ప్రధానంగా నీటి విషయంలోనూ అందులోనూ పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విషయంలో సెంటిమెంట్ లేపి కాంగ్రెస్ ను డ్యామేజీ చేయాలని చూస్తున్నారు. అందులో భాగంగానే కేసీఆర్ పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయలేదని ప్రస్తావిస్తూనే ఇరు రాష్ట్రాలకు సంబంధించి కృష్ణా నీటి పంపకాల తేనెతుట్టెను కదిపారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ వేసిన ట్రాప్ లో చిక్కుకున్నారు. కేసీఆర్ తాము పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్లగొండలలో భారీ బహిరంగ సభలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అందుకు ముందుగానే శాసనసభ సమావేశాలను పెట్టి జలవివాదాలపై సుదీర్ఘంగా చర్చించారు. అయితే ఇక్కడే తాను చెప్పినందునే చంద్రబాబు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపేశారని వ్యాఖ్యానించడంతో అటు ఏపీలోనూ నీటి యుద్ధం మొదలయింది. అయితే చంద్రబాబుకు, రేవంత్ రెడ్డికి మధ్య ఉన్న స్నేహాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్ కూడా బయటపెట్టారు. ఇద్దరి మధ్య రహస్య ఒప్పందం ఏంటని ఆయన ప్రశ్నించారు.తాజాగా రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య జలవివాదాలను పరిష్కరించుకోవడం కోసం చర్చలు జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని అన్నారు. న్యాయస్థానాలు, ట్రైబ్యునల్ లో కాకుండా మనమే పరిష్కరించుకుందామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ వ్యాఖ్యలు కూడా ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రిని రాజకీయంగా ఇబ్బంది పెట్టేలా ఉన్నాయి. కేసీఆర్ అన్న ఒక్క మాటతో రేవంత్ రెడ్డి కెలుక్కుని లేని పోని వివాదాలను కొని తెచ్చుకున్నట్లయిందన్న కామెంట్స్ సొంత పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి ఎంత కేసీఆర్ పై నీటి విషయంలో విమర్శలు చేసినా మరోసారి సెంటిమెంట్ ను రేకెత్తించడంలో గులాబీ బాస్ సక్సెస్ అయ్యారు.

# రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు




**హైదరాబాద్, జనవరి13 వెలుతురు :**
సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. చదువు రాని వారిని, అమాయకులనే కాదు.. బాగా చదువుకున్న వారిని కూడా ఇట్టే మోసం చేస్తున్నారు. ఏ మాత్రం డౌట్ రాకుండా పని కానిస్తున్నారు. మాయ మాటలతో నమ్మించి కోట్ల రూపాయలు కొట్టేస్తున్నారు. తాజాగా మాజీ ఐపీఎస్ అధికారి భార్యకే సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. ఏకంగా 2 కోట్ల రూపాయలు కొట్టేశారు. సైబర్ క్రిమినల్స్ చేతిలో మాజీ ఐపీఎస్ భార్య మోసపోయిన వైనం హైదరాబాద్ లో వెలుగుచూసింది.ఇది ఇన్వెస్ట్ మెంట్ ఫ్రాడ్ కేసు. మాజీ ఐపీఎస్ అధికారి భార్య రూ.2.58 కోట్లు మోసపోయింది. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ చిట్కాలు ఇస్తామని వాట్సాప్ నుంచి ఆమెకు సందేశం వచ్చింది. అయితే, దాని గురించి ఆమెకు అవగాహన లేదు. దాంతో ఆమె తన భర్తను వాట్సాప్ గ్రూప్ లో యాడ్ చేయించింది. ఇక సైబర్ నేరగాళ్లు తమ పని మొదలు పెట్టారు. 500 శాతం లాభాలు వస్తాయని ఆమెకు మాయమాటలు చెప్పి నమ్మించారు. ఒక లింక్ పంపిన సైబర్ మోసగాళ్లు.. సెబీ సర్టిఫైడ్ వెబ్‌సైట్ అని ఆమెను నమ్మించారు. వాట్సాప్ లో సెబీ నకిలీ సర్టిఫికెట్లు కూడా పంపారు. అది చూసి ఆమె పూర్తిగా నమ్మేసింది. 500శాతం లాభాలు అనగానే టెంప్ట్ అయ్యింది.ఆ తర్వాత డబ్బులు ఇన్వెస్ట్ మెంట్ చేయడం ప్రారంభించింది. అలా డిసెంబర్ 24 నుంచి ఈ నెల 5 వరకు 19 లావాదేవీలు చేసింది. మొత్తం 2.58 కోట్లు పంపింది. ఆ తర్వాత డబ్బులు పంపడం ఆపేసింది. అయితే, మరింత డబ్బు పెట్టుబడి పెట్టాలని సైబర్ క్రిమినల్స్ ఆమెపై ఒత్తిడి పెంచారు. ఇన్వెస్ట్‌మెంట్ చేయకపోతే ఇప్పటివరకు పెట్టిన డబ్బు పోతుందని భయపెట్టారు. దాంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు లబోదిబోమంది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.సైబర్ క్రైమ్స్ గురించి పోలీసులు నిత్యం అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. లాభాల పేరుతో జరిగే మోసాల గురించి హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. ఇలాంటి మాయ మాటలు నమ్మి మోసపోవద్దని చెబుతూనే ఉన్నారు. అయినా ఇంకా కొందరిలో మార్పు రావడం లేదు. అత్యాశతో, అమాయకత్వంతో అడ్డంగా మోసపోతున్నారు. కష్టపడి సంపాదించిన డబ్బును పోగొట్టుకుంటున్నారు.

# యువతి దారుణ హత్య

**హైదరాబాద్ జనవరి13 వెలుతురు :**
బోరబండ ప్రాంతంలో చోటుచేసుకున్న ఓ యువతి హత్య ఘటన నగరాన్ని మరోసారి షాక్కు గురిచేసింది. తనతో సరిగ్గా మాట్లాడటం లేదన్న అనుమానంతో ఓ యువకుడు యువతిని కిరాతకంగా హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల అందించిన వివరాల ప్రకారం జారాహిల్స్‌ని ఓ పబ్లో పనిచేసే సమయంలో యువతికి నిందితుడికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం క్రమంగా స్నేహంగా మారింది. అయితే ఇటీవల యువతి ఊర్వశీ బార్కు ఉద్యోగం మారడంతో నిందితుడితో మాట్లాడటం తగ్గింది. దీనితో ఆమెపై అనుమానం పెంచుకున్న యువకుడు, తనను నిర్లక్ష్యం చేస్తోందన్న కోపంతో తీవ్రంగా ఆగ్రహానికి లోనయ్యాడు. ఈ నేపథ్యంలో మాట్లాడుకుందామని చెప్పి యువతిని కలవడానికి పిలిచిన నిందితుడు అక్కడే ఆమెను హత్య చేశాడు. యువతి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వెంటనే రంగంలోకి దిగిన బోరబండ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం నిందితుడిని విచారిస్తున్న పోలీసులు హత్యకు గల పూర్తి కారణాలు, ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు.

# ఉగ్రవాదానికి తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతాం

- ఆపరేషన్ సిందూర్‌లో భూతల దాడులకు కూడా సిద్ధపడ్డాం
- భద్రతా సవాళ్లను ఎదుర్కోవ డంలో భారత్ సైనిక సంసిద్ధత
- షక్సాగామ్ వ్యాలీ ఎప్పటికీ భారత్‌లో భాగమే
- మీడియా సమావేశంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది



**న్యూఢిల్లీ, జనవరి13 వెలుతురు :**
ఉగ్రవాదులు తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతామని, ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని, త్రివిధ దళాల సమన్వయానికి ఇది నిదర్శనమని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. దిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ..భద్రతా సవాళ్లను ఎదుర్కోవ డంలో భారత్ సైనిక సంసిద్ధత దీనిద్వారా స్పష్టమైందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను చాలా కచ్చితత్వంతో అమలుచేశాం. 88 గంటల పాటు సాగిన ఆ ఆపరేషన్‌లో మన సైనిక దళాలు అత్యంత సమర్థంగా పనిచేశాయి. ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేయగలిగాం. దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చాం. ఆ సమయంలో పెద్దఎత్తున బలగాలను సరిహద్దులకు తరలించాం. పాకిస్థాన్ చిన్న తప్పు చేసినా.. భూతల దాడులను ప్రారంభించేందుకు కూడా నాడు మేం పూర్తి సన్నద్ధంగా ఉన్నాం అని ఆర్మీ చీఫ్ నాటి పరిస్థితులను వివరించారు. అలాగే ఈశాన్య సరిహద్దులో పరిస్థితులు స్థిరంగానే ఉన్నాయని, అయితే అప్రమత్తంగా ఉండటం కీలకమని వెల్లడించారు. చైనా సరిహద్దులోని భద్రత గురించి మాట్లాడుతూ.. భారత మోహరింపులు బలంగా ఉన్నాయని చెప్పారు. భవిష్యత్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు సున్నితంగానే ఉన్నా.. ప్రస్తుతం అవి నియంత్రణలోనే ఉన్నాయన్నారు. ఇక వివాదాస్పద షక్సాగామ్ వ్యాలీలోని ప్రాంతం తమ దేశంలో భాగమేనని చైనా చేసిన వాదనను భారత్ మరోసారి తిప్పికొట్టింది. ఆ వ్యాలీ అప్పగింతకు సంబంధించి 1963లో పాకిస్థాన్, చైనా మధ్య జరిగిన ఒప్పందం చట్టవిరుద్ధమని జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. ఈ వివాదం పై స్పందించారు. 'షక్సాగామ్ వ్యాలీని చైనాకు అప్పగిస్తూ బీజింగ్‌తో పాకిస్థాన్ చేసుకున్న ఒప్పందం చెల్లదు. ఆ ప్రాంతంలో జరిగే ఏ కార్యకలాపాలను మేం గుర్తించబోం. చైనా-పాక్ ఆర్థిక కారిడార్ విషయానికొస్తే.. అది ఆ రెండు దేశాలు సంయుక్తంగా చేస్తోన్న చట్టవిరుద్ధమైన చర్యగానే మేం పరిగణిస్తాం' అని జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. షక్సాగామ్ వ్యాలీ ప్రాంతంలో చైనా చేపట్టిన అభివృద్ధి పనులపై ఈ నెల 9న భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. 'పాకిస్థాన్-చైనా పేర్కొంటున్న 1963 నాటి సరిహద్దు ఒప్పందాన్ని మేం ఎప్పటికీ గుర్తించబోం. దీనిపై మా నిర్ణయంపై మారదు. షక్సాగామ్ వ్యాలీ మా దేశంలో భాగమే అని స్పష్టం చేసింది. దీనిపై చైనా స్పందిస్తూ.. భారత్‌పై అక్కసు వెళ్లగక్కింది. ఆ ప్రాంతం తమ దేశంలో భాగమేనని, అక్కడ తాము చేపడుతున్న అభివృద్ధి పనులపై భారత్ అభ్యంతరం చెప్పడానికి అవకాశం లేదని పేర్కొంది. షక్సాగామ్ వ్యాలీ కీలకమైన కారకోరమ్ రహదారిలో ఉంది. స్వాతంత్ర్యం రాగానే పాకిస్థాన్ దీన్ని ఆక్రమించుకుంది. అనంతరం దీనికి చైనాకు ధారాదత్తం చేసింది. భారత్‌కు చెందిన ప్రాంతాన్ని ఆక్రమించుకుని మరొక దేశానికి ఇవ్వడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం విరుద్ధం. ఈ వ్యాలీని బీజింగ్‌కు అప్పగించడం ద్వారా పాకిస్థాన్‌తో చైనాకు రహదారి సౌకర్యం ఏర్పడింది. దీని మీదుగానే చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవాను బీజింగ్ నిర్మిస్తోంది.

# నారావారి పల్లెలో సంక్రాంతి సంబరాలు

- ఉత్సాహంగా పాల్గొన్న చంద్రబాబు కుటుంబం
- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన చంద్రబాబు








**చిత్తూరు, జనవరి13 వెలుతురు :**
ఏపీ సీఎం చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు ఘనంగా మొదలయ్యాయి. ఈ సంబరాల్లో సీఎం చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, నారా బ్రాహ్మణి, దేవాంశ్, బాలకృష్ణ సతీమణి వసుంధర, తేజస్విని, శ్రీభరత్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రజలతో కలిసి సరదాగా గడిపారు. తన నివాసం ముందున్న మైదానంలో చుట్టుపక్కల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన గ్రామీణ క్రీడా పోటీలను సీఎం చంద్రబాబు, నారా భువనేశ్వరి దంపతులు స్వయంగా వీక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి, పిల్లలతో ఫొటోలు దిగి వారిలో ఉత్సాహం నింపారు. ఈ వేడుకల్లో నారా, నందమూరి కుటుంబాలకు చెందిన చిన్నారులు కూడా పాల్గొనడం విశేషం. సొంతూరులో పండుగ జరుపుకొంటూనే.. అటు కుటుంబ సభ్యులు, ఇటు సామాన్య ప్రజలతో సమయాన్ని గడుపుతూ.. సీఎం అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. రాజకీయ హడావుడికి దూరంగా, గ్రామీణ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు స్థానికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.నారావారిపల్లెకు చుట్టు పక్కల ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక్కో స్కూల్‌కు చెందిన పిల్లలతో సీఎం చంద్రబాబు దంపతులు వేర్వేరుగా గ్రూప్ ఫొటోలు దిగారు. ఈ క్రీడల్లో నారా, నందమూరి కుటుంబ చిన్నారులు పాల్గొనడం విశేషం. వీరిలో గెలుపొందిన వారికి ఇతర పిల్లలతో సమానంగా బహుమతులు అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో నారా దేవాన్ష్ పలు పోటీల్లో పాల్గొని ఆకట్టుకున్నారు.పరదాల సంస్కృతికి పూర్తిగా భిన్నంగా, సొంతూరు నారావారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. క్రీడా పోటీల అనంతరం ఇంటికి వెళ్లే మార్గమంతా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ముఖ్యమంత్రి స్వయంగా తమ అర్జీలు స్వీకరించడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. చుట్టు పక్కల జిల్లాల నుంచి ప్రత్యేకంగా తరలివచ్చిన ప్రజలు కూడా చంద్రబాబుకు అర్జీలు అందజేశారు. సమస్యలు విన్న సీఎం చంద్రబాబు అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది.గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ, ప్రజల అర్జీలను స్వయంగా స్వీకరించడం వంటి చర్యలు చంద్రబాబు ప్రజాపాలనకు నిదర్శనంగా నిలిచాయి. నారావారిపల్లెలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానికంగా విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను భువనేశ్వరి, బ్రాహ్మణి పరిశీలించారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటుచేసిన వివిధ క్రీడా పోటీల్లో దేవాంశ్ పాల్గొన్నాడు. ఆయా పోటీలను సీఎం, కుటుంబసభ్యులు తిలకించారు. అనంతరం విజేతలకు చంద్రబాబు, భువనేశ్వరి బహుమతులు అందజేశారు. అంతకుముందు ప్రజల నుంచి వినతిపత్రాలను సీఎం స్వీకరించారు.

# అక్కడి నుంచి కవిత పోటీ.. అజారుద్దీన్ కి కష్టమే!



నిజామాబాద్, జనవరి13 వెలుతురు :
తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో భాగంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత మహ్మద్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అయితే ప్రస్తుతం అజారుద్దీన్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కాదు. మంత్రి పదవి చేపట్టిన ఆరు నెలల్లో ఎమ్మెల్యే గానీ, ఎమ్మెల్సీ గానీ కావాలి. లేదంటే మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ఇటీవల ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన కవిత కూడా పోటీకి సిద్ధమవుతోంది. కవిత రాజీనామాను గుత్తాసుఖేందర్‌రెడ్డి ఆమోదించారు. కవిత స్థానం ఖాళీ కావడంతో, త్వరలోనే భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుంది. అధికార కాంగ్రెస్ పార్టీ ఇక్కడ తమ అభ్యర్థిని ఎంపిక చేసుకునేందుకు సంస్థాగత చర్యలు పూర్తి చేసినట్లు సమాచారం.ఖాళీ అయిన కవిత స్థానాన్ని మాజీ క్రికెటర్ అజరుద్దీన్‌కు ఈ స్థానం ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నప్పటికీ, పరిస్థితుల వల్ల మంత్రి పదవి ఇచ్చి మచ్చిక చేసుకున్నారు. రెండు సభల్లో ప్రాతినిధ్యం లేకపోవడంతో, నిబంధనల ప్రకారం ఆరు నెలల్లో ఏ సభలోనైనా సీటు సాధించాల్సి ఉంది.కవిత 2022లో నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా ద్వారా ఎమ్మెల్సీగా ఎన్నికైంది, ఇది ప్రత్యక్ష ఎన్నికే. ఇప్పుడు కూడా అదే విధానం పాటించాల్సి వచ్చింది. కానీ, నిజామాబాద్ ఎంపీ స్థానం బీజేపీ వద్ద ఉండటం, స్థానికంగా బీఆర్ఎస్ బలోపేతం కారణంగా కాంగ్రెస్‌కు సవాలు. అజరుద్దీన్ మండలిలోకి ప్రవేశించి విజయం సాధించగలరా అనేది ఆసక్తికరంగా చూడాలి.

# లాడ్జిలో యువకుడి ఆత్మహత్య

హుజురాబాద్ జనవరి13 వెలుతురు :



కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని వైస్రాయ్ లాడ్జిలో వడ్లకొండ చిరంజీవి అనే యువకుడు ఫ్యాన్ కు ఉరివేసుకొని అనుమానాస్పదంగా మృతి చెందాడు. గత రెండు రోజుల క్రితం చిరంజీవితోపాటు సంతోష్ అనే యువకుడు లాడ్జి తీసుకున్నట్లుగా తెలుస్తుంది. సంతోష్ చిరంజీవిలు గత రాత్రి 10 గంటల వరకు కలిసే ఉన్నట్లుగా లాడ్జి నిర్వాహకులు చెబుతున్నారు. అయితే రాత్రి 10 గంటల తర్వాత సంతోష్ లాడ్జి నుంచి వెళ్లి పోయినట్లు లాడ్జి నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి సంతోష్ చిరంజీవికి ఫోన్ చేస్తున్న లిఫ్ట్ చేయడం లేదంటూ లాడ్జి నిర్వాహకులకు తెలిపాడు. లాడ్జి నిర్వాహకులు తమ ల్యాండ్ ఫోన్ నుంచి చిరంజీవికి ఫోన్ చేయగా ఎంతసేపటికి ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి నిర్వాహకులు చిరంజీవి ఉంటున్న గది వద్దకు వెళ్లి డోర్ మెట్టగా లోపలి వైపు గడియ పెట్టి ఉండడంతో కిటికీలోంచి చూడగా చిరంజీవి ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి చిరంజీవి మృతదేహాన్ని కిందికి దింపారు మృతదేహంపై రక్తపు మరకలు ఉండడంతో తనకు తానే గాయపరచుకుని అనంతరం ఉరి వేసుకుని ఉంటాడ లేక ఎవరైనా గాయపరిచి చంపేశారా తెలియడం లేదు. చిరంజీవి మరణానికి గల కారణాలు ఇంకా తెలియ రాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వైద్యారోగ్య శాఖలో త్వరలో ఖళీల భర్తీ

**- జాబ్ నోటిఫికేషన్స్ ఇవ్వనున్నట్లు మంత్రి వెల్లడి**

**- ఉగాది నాటికి సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభిస్తామన్న దామోదర**

హైదరాబాద్,జనవరి13 వెలుతురు :
నిరుద్యోగులకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గుడ్ న్యూస్ చెప్పారు. వైద్యారోగ్య శాఖలో త్వరలోనే మరిన్నీ జాబ్ నోటిఫికేషన్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆరోగ్య శాఖలో గత రెండేళ్లలోనే సుమారు 10 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని.. ఇంకో 7 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ అవుతున్నాయని చెప్పారు. మంగళవారం సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగాది నాటికి సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. హాస్పిటల్ బిల్డింగ్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని.. ఎలక్ట్రికల్ వర్క్స్ కొన్ని పూర్తి కావాల్సి ఉందని తెలిపారు. ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నస్టిక్స్, ఇతర ఎక్విప్‌మెంట్ ఏర్పాటు కూడా చివరి దశలో ఉందన్నారు. ఇప్పటికే అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎంఆర్ఐ వంటి భారీ యంత్రాల ఫిట్టింగ్ పూర్తయిందని తెలిపారు. మాది ప్రచార ఆర్భాటం ఉండదని.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే మా ఆరాటమని పేర్కొన్నారు. అన్నిరకాలుగా పూర్తి స్థాయి సౌకర్యాలతో ఉగాది నాటికి పేషెంట్లకు ఇక్కడ వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. వెయ్యి బెడ్ల ఈ హాస్పిటల్‌లో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా సనత్‌నగర్ టిమ్స్ ఉంటుందని.. ఇక్కడే అవసరమైన రీసెర్చ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఇక్కడే అత్యాధునిక ఆర్గాన్ ట్రాన్స్‌ఎ÷-లాంటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అన్నిరకాల అవయవమార్పిడి సర్జరీలు చేసేలా అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో తెస్తున్నామన్నారు. డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి ఎలాంటి కొరత ఉండదని తెలిపారు.

# దుబ్బాకలో కాంగ్రెస్ జోష్

**- మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతాం: వివేక్**

సిద్దిపేట,జనవరి13 వెలుతురు :
రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. గతంకంటే దుబ్బాకలో కాంగ్రెస్ జోష్ కనిపిస్తోంది..ఆ ప్రాంతంలో మెజార్టీ సర్పంచులను కాంగ్రెస్ గెలుచుకుంది.. అదే జోష్ లో మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయం సాధించి దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగుర వేయాలన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. కాంగ్రెస్ ప్రభుత్వంలో దుబ్బాకలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.15కోట్లతో దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీలకు రూ. 50లక్షల చొప్పు న నిధులు కేటాయించామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు మంత్రి వివేక్. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నాం.. అర్హత కలిగి ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేశామన్నారు. రైతులకు 2లక్షల రుణమాఫీ పూర్తి చేశామన్నారు.రుణమాఫీ కాని వారు ఎవరైనా ఉంటే వారి పేర్లు ఇస్తే రుణమాఫీ చేయిస్తానని హామి ఇచ్చారు.

# బెంగళూరులో దారుణ ఘటన

- **కామంతో యువతిపై టీనేజర్ దాడి**
- **తిరస్కరించడంతో చంపేసి ఇంటికి నిప్పు**
- **దర్యాప్తులో బయటపడ్డ అసలు వ్యవహారం**

బెంగళూరు, జనవరి13 వెలుతురు :
బెంగళూరులో దారుణ ఘటన వెలుగు చూసింది. పక్కింట్లో ఉన్న ఓ అమ్మాయిపై బలాత్కారానికి పాల్పడ్డ ఇంటర్ విద్యార్థి, ఆమె తిరస్కరించడంతో కత్తితో పొడిచి చంపాడు. అంతేగాకుండా ఇంటిని తగులబెట్టాడు. అంతా అగ్నిప్రమాదమని భావించినా, పోలీసుల దర్యాప్తులో అసలు నిజం బయటపడింది. చిరుప్రాయంలోనే ఆ యువకుడి ఆలోచనలు అదుపు తప్పాయి. పక్కింటి యువతి ఒంటరిగా ఉన్నవేళ కామంతో అఘాయిత్యానికి తెగించాడు. ఆమె ప్రతిఘటించడంతో చివరకు హత్య చేసి, ఆధారాలు చెరిపేసేందుకు ఇంటికే మంటపెట్టాడు. ఆమె అగ్ని ప్రమాదంలో మరణించినట్లుగా తొలుత భావించినప్పటికీ.. పోస్టుమార్టం నివేదిక, సాంకేతిక ఆధారాలతో యువకుడి పాత్ర బయటపడింది.బెంగళూరులో జరిగిన ఈ దారుణంపై పోలీసుల కథనం.. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన



షర్మిల కుశాలప్ప (34) బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఇంజినీర్‌గా పని చేసేవారు. రామ్మూర్తినగర ఠాణా పరిధి సుబ్రహ్మణ్య లేఅవుట్‌లోని ఓ ఫ్లాట్‌లో తన స్నేహితుడితో కలిసి ఉండేవారు. ఈనెల 3న షర్మిల ఒంటరిగా ఉన్నవేళ ఫ్లాట్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగగా, ఆమె మరణించినట్లు ఫిర్యాదు అందింది. పోలీసులూ ఆ కోణంలోనే దర్యాప్తు చేపట్టారు. అయితే, ఇది సాధారణ మరణం కాదని ఫోరెన్సిక్ నివేదికలో తేలింది. ఆమె శరీరానికి నిప్పు అంటుకోకముందే చేతిపై గాయాలయ్యాయని, ఆపై ఊపిరాడక చనిపోయినట్లు వైద్యులు తేల్చారు. దీంతో పోలీసులు అక్కడి సీసీ కెమెరాల ఫుటేజ్‌లు సేకరించారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. షర్మిల, ఆమె మిత్రుడు ఉండే ఎ÷-లాట్ పక్కనే కొడగు జిల్లా విరాజ్‌పేటెకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి కర్నల్ కురై (18) తల్లితో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 3న షర్మిల స్నేహితుడు ఇంట్లో లేని సమయంలో కురై ఆమె ఉండే గదిలోకి కిటికీలోంచి దూరాడు. లైంగిక కోర్కె తీర్చాలని ఒత్తిడి తేవడంతో షర్మిల గట్టిగా అరుస్తూ తోసివేశారు. కోపం పట్టలేని ఆ యువకుడు.. వంటగదిలోని కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఆమె పరుపుపై పడిపోగా, మరోసారి కొట్టాడు. అరవొద్దంటూ నోటిని దిండుతో గట్టిగా మూయడంతో షర్మిల ఊపిరాడక చనిపోయారు.ఆపై సాక్ష్యాలను నాశనం చేసేందుకు రక్తపు మరకలున్న ఆమె దుస్తుల్ని తీసి, అదే గదిలో నిప్పంటించి కాల్చేశాడు. మంటలు వ్యాపించడంతో అక్కడి నుంచి పారిపోయేందుకు మళ్లీ కిటికీలోంచి దూకేశాడు. ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి ఆమె మరణించిందని, సహజ మరణంగా చూపేందుకు ఇలా చేసినట్లు నిందితుడు పోలీసుల విచారణలో అంగీకరించాడు. షర్మిల సెల్‌ఫోన్‌లోని వివరాలు ఈ కేసు దర్యాప్తునకు ఉపకరించాయి. మృతురాలి స్నేహితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.


# గులాబీ చిక్కముళ్లు.. కవిత తప్పెంత? కేటీఆర్ చేసిన ద్రోహం ఏంటి?

హైదరాబాద్, జనవరి13 వెలుతురు :
రాజకీయాలలో ముఖ్యంగా కుటుంబాలు నడిపే పార్టీలలో అంతర్గతంగా కుమ్ములాటలు చోటు చేసుకోవడం మనదేశంలో కొత్తేమీ కాదు. గతంలో కాంగ్రెస్ పార్టీ లో సంజయ్ గాంధీ వ్యవహార శైలి ఈ దేశ ప్రజలకు సుపరిచితమే. తమిళనాడులో డీఎంకే, ఉత్తర్ ప్రదేశ్ లో సమాజ్ వాదీ పార్టీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు.. అంతిమంగా అధికారం కోసం, అలవిమాలిన సంపాదన కోసం జరిగే పోరాటాలు ప్రాంతీయ కుటుంబ పార్టీల అసలు బాగోతాన్ని బయటపెడతాయి. ఇప్పుడు ఈ జాబితాలోకి భారత రాష్ట్ర సమితి కూడా చేరింది.2014లో అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి.. తెలంగాణలో వ్యవస్థలను ఎంత నాశనం చేయాలో అంత చేసింది. ప్రత్యర్థి పార్టీల ఎమ్మెల్యేలను అడ్డగోలుగా కొనేసింది. ప్రతిపక్షం అనేది లేకుండా చూసుకుంది. కాళేశ్వరం నుంచి మొదలు పెడితే గొర్రెల పంపిణీ వరకు ఇలా ప్రతి పథకంలోనూ అవినీతి జరిగిందని, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వినిపించాయి. వాస్తవానికి ఇటువంటి కుంభకోణాలు పార్టీకి డ్యామేజ్ చేయడం ఒక ఎత్తు అయితే.. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు కలిగించే డ్యామేజ్ మరొక ఎత్తు.వాస్తవానికి గులాబీ పార్టీలో ఈ స్థాయిలో అంతర్గతంగా కుమ్ములాటలు జరుగుతాయని ఎవరూ ఊహించలేదు. సాక్షాత్తు కెసిఆర్ కుమార్తె వ్యతిరేక స్వరాన్ని వినిపిస్తారని.. తన తండ్రి పరిపాలనను ఉదాహరణలతో వివరిస్తూ విమర్శిస్తారని ఎవరూ అంచనా వేయలేదు. కాళేశ్వరం ప్రయోజనం నెరవేరలేదని, పాలమూరు రంగారెడ్డి పథకాన్ని పండబెట్టారని, సామాజిక తెలంగాణ సహకారం కాలేదని ఇలా ప్రతి విషయంలోనూ కవిత విమర్శలు చేసుకుంటూ పోయారు. కొన్ని సందర్భాలలో లెక్కలతో సహా వివరించారు. ఒక రకంగా ఈ పనిని కాంగ్రెస్ చేయాల్సి ఉండేది. ఒక రకంగా బలమైన స్వరాన్ని వినిపించే ప్రయత్నం చేశారు కవిత.కవిత చేస్తున్న ఆరోపణల్లో నిజం లేకపోలేదు. కానీ 10 సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్నప్పుడు ఆమె ఏం



చేశారు అనేది ఇక్కడ అసలైన ప్రశ్న. భారత రాష్ట్ర సమితి ఏర్పాటును వ్యతిరేకించానని చెప్పిన ఆమె.. పార్టీ ప్రారంభత్సవానికి ఢిల్లీ ఎందుకు వెళ్లినట్టు? 10 సంవత్సరాల కాలంలో తెలంగాణలో విధ్వంసం జరిగిందని చెబుతున్న ఆమె.. గతంలో బంగారు తెలంగాణ సాకారం అయిందని ఎందుకు చెబుతున్నట్టు.. లిక్కర్ కేసులో అడ్డంగా ఇరుక్కుపోయారు కాబట్టి.. కేసుల నుంచి తప్పించుకోవాలంటే ఆమె కెసిఆర్ కు వ్యతిరేకంగా వ్యవహరించాలి కాబట్టి.. అలానే చేస్తున్నారని గులాబీ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్, బిజెపి రాజకీయాల లక్ష్యాలకు అనుగుణంగా ఆమె నడుచుకుంటున్నారని గులాబీ నేతలు మండిపడుతున్నారు.వాస్తవానికి తన పార్టీలో ఉన్నప్పుడు ప్రాధాన్యం దక్కలేదని పదేపదే ఆరోపిస్తున్న కవిత.. ఒకసారి ఎంపీ ఎలా అయ్యారు? మరోసారి ఎమ్మెల్సీ ఎలా అయ్యారు? సింగరేణిలో అధ్యక్షురాలిగా ఎలా ఉన్నారు? ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయని గులాబి పార్టీ నేతలు అంటున్నారు. అధికారం దూరంగానే కెసిఆర్ కు వ్యతిరేకంగా మాట్లాడటం సమంజసం కాదని ఆమెకు గుర్తుచేస్తున్నారు. మరోవైపు జాగృతి నేతలు స్పందిస్తున్న తీరు వేరే విధంగా ఉంది. కేటీఆర్ కూడా ఆమెకు ద్రోహం చేశారని.. కనీసం ఒక పని కూడా చేసుకునే అవకాశం కల్పించలేదని.. ఆమె భర్త ఫోన్ కూడా టాప్ చేశారని.. అలాంటప్పుడు ఆమె పార్టీలో ఎలా ఉంటారంటూ జాగృతి నేతలు చెబుతున్నారు. గడిచిన 10 సంవత్సరాల కాలంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో హరీష్ రావు అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డారని.. అందువల్లే కవిత ఆయన టార్గెట్ చేస్తూ ఆరోపణలు చేస్తున్నారని జాగృతి నేతలు చెబుతున్నారు.. కవిత రాజకీయ ఎదుగుదలను తట్టుకోలేక ఆమెకు అడుగడుగునా అడ్డు పుల్లలు వేస్తున్నారని.. అందువల్లే కవిత ఈ స్థాయిలో స్పందిస్తున్నారని జాగృతి నేతలు అంటున్నారు.కవితకు, కెసిఆర్ కు మధ్యలో గ్యాప్ రావడానికి ప్రధాన కారణం హరీష్, సంతోష్ రావు అని జాగృతి నేతలు చెబుతున్నారు. అందువల్లే ఆమె ఆధారాలతో సహా విమర్శలు చేస్తున్నారని.. ఇందులో వ్యక్తిగత లక్ష్యాలు అంటూ ఏమీ లేవని జాగృతి నేతలు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ అంతపురంలో జరిగే కుమ్ములాటలు రాజ్యానికి అసలు మంచివి కావు. ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చోటు చేసుకుంటున్న పరిణామాలు కూడా ఆ పార్టీకి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ఇప్పటికే పార్లమెంటు ఎన్నికల్లో 0 ఫలితాలు వచ్చాయి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలలో అధికార పార్టీకి సానుకూలమైన ఫలితాలు వచ్చాయి. స్థానిక ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థానాలు కూడా గులాబీ పార్టీకి రాలేదు. అలాంటప్పుడు ఈ అంతర్గత కుమ్ములాటను ఏ స్థాయిలో కేసీఆర్ పరిష్కరిస్తారో చూడాల్సి ఉంది.

# గులాబీ బాటలోనే కాంగ్రెస్




హైదరాబాద్, జనవరి13 వెలుతురు :
రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీని మొత్తం హైజాక్ చేశాడు. సచివాలయం నుంచి మీడియా సంస్థలకు లీక్స్ ఇస్తున్నాడు. తన అనుకూల మీడియా సంస్థల్లో కథనాలను ప్రసారం చేయిస్తున్నాడు. మంత్రులను ఇబ్బంది పెడుతున్నాడు. వారిని వేధిస్తున్నాడు. కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆ పోస్ట్ నుంచి పక్కన పెట్టడానికి రకరకాల స్టోరీలను టెలికాస్ట్ చేయించాడు. అదే మా కెసిఆర్ అయితే స్మిత సబర్వాల్ మీద ఔట్ లుక్ అనే మ్యాగజిన్ స్టోరీ పబ్లిష్ చేస్తే.. సర్కార్ సొమ్ముతో కోర్టులో కేసు వేయించాడు తెలుసా.. ఇదిగో ఇలా సాగుతోంది గులాబీ పార్టీ ప్రచారం.వాస్తవానికి స్మితా సబర్వాల్ మీద రాసిన స్టోరీ కి, తెలంగాణ ప్రజలకు ఏం సంబంధం? తెలంగాణ ప్రజలు చెల్లించిన పన్ను ను కోర్టు ఫీజుగా చెల్లించడానికి కెసిఆర్ ఎవరు? ముఖ్యమంత్రి అనంతమాత్రాన తనకి ఇష్టమైన అధికారులకు కోర్టు ఫీజులు చెల్లిస్తారా? ఇదే విషయంపై నాడు హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది కదా.. ఆ విషయం గులాబీ పార్టీ పెద్దలకు తెలియదా? ఈరోజు ఇన్ని సుద్దులు చెబుతున్న గులాబీ పార్టీ.. నాడు మంత్రిగా ఉన్న రాజయ్య విషయంలో, రాజేంద్ర విషయంలో చేసింది ఏంటి? అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.రాజయ్య మంత్రిగా ఉన్నప్పుడు నమస్తే తెలంగాణలో అంబులెన్స్ లో కొనుగోలులో కుంభకోణం అంటూ స్టోరీ రాసింది. ఆ తర్వాత రాజయ్యను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసింది. దానికంటే ముందు రాజయ్య మీద గులాబీ పార్టీ అడ్డగోలు నెగిటివ్ ప్రచారం చేసింది. నాడు రాజయ్య తొలగింపు వెనక అంబులెన్సుల కుంభకోణం కాదని, అసలు విషయం వేరే ఉందని ఇప్పటికి గులాబీ నేతలే చెబుతుంటారు.గులాబీ పార్టీకి ఓనర్లమని చెప్పినందుకు ఈటల రాజేందర్ మీద గులాబీ పార్టీ కరపత్రం నమస్తే తెలంగాణ ఎంత వ్యతిరేక కథనాలను ప్రసారం చేసిందో అందరికీ తెలుసు. నాడు ముఖ్యమంత్రికి కొంతమంది లేఖలు రాశారని.. ఆ భూములు అధికారులతో సర్వేలు కూడా నిర్వహించారు. ఈటెల రాజేందర్ కబ్జాకోరు అంటూ ముద్రవేశారు. ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించారు. చివరికి ఆయన గులాబీ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. భారతీయ జనతా పార్టీలో చేరి హుజురాబాద్ ఎమ్మెల్యేగా గెలిచారు.. వాస్తవానికి నచ్చని వ్యక్తులను బయటికి పంపించడంలో.. వారిపై అడ్డగోలుగా విమర్శలు చేయడంలో గులాబీ పార్టీ, ఆ పార్టీ అధినేత పీ హెచ్ డీ చేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్సీ రాములు నాయక్ వ్యవహారంలో.. అంతకుముందు జరిగిన పరిణామాలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఇవన్నీ బోధపడతాయని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.కోమటిరెడ్డి వ్యవహారం అనేది చాలా చిన్న విషయమని.. దానిని భూతద్దంలో పెట్టి చూస్తున్న గులాబీ పార్టీ.. గతంలో తన అధినేత ఏం చేశాడో గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ నేతలు హితవు పలుకుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను తనకు అనుకూలంగా గులాబీ పార్టీ మార్చుకుంటుందని.. మాకు నీతులు చెప్పేటప్పుడు ముందు తన కింది నలుపు చూసుకోవాలని కాంగ్రెస్ నేతలు సూచిస్తున్నారు.

## లీక్ వీరులెవ్వరు

రాజకీయాలు అనేవి కేక్ వాక్ లాగా ఉండవు. ఏదో ఒక రోజు ముసలం పుడుతుంది. అది కాస్త ఉపద్రవం అవుతుంది. అనంతరం ఒక్కసారిగా పరిస్థితులను మార్చేస్తుంది. మనదేశంలో ఇటువంటి పరిణామాలు కేంద్రం నుంచి రాష్ట్రం వరకు అనేకం చోటుచేసుకున్నాయి. సరిగ్గా కొన్ని సంవత్సరాల క్రితం మహారాష్ట్రలో కూడా ఇలానే జరిగింది. ఫలితంగా షిండే ముఖ్యమంత్రి కూడా అయ్యారు. బలమైన నాయకుడిగా పేరు తెచ్చుకున్న ఆయన.. ముసలం పుట్టించి ముఖ్యమంత్రి అయ్యారు.ఇప్పుడు తెలంగాణలో కూడా అటువంటి పరిస్థితి లేకపోయినప్పటికీ.. కొన్ని మీడియా సంస్థలు కథనాలను ప్రసారం చేస్తున్నాయి. స్టోరీలను సర్కులేట్ చేస్తున్నాయి. కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రస్తుతం బాధిత పక్షం లాగా ఉన్నారు. ఆయనపై ఓ చానల్ అడ్డగోలుగా కథనాన్ని ప్రసారం చేసింది. వాస్తవానికి ఇలాంటి కథనం హై లెవెల్ లీక్ లు లేకుండా బయటికి రాదు. అది అసాధ్యం కూడా.. ఎందుకంటే ఉన్నతాధికారుల బదిలీలు మొత్తం కూడా ప్రభుత్వ పెద్దల చేతుల్లో ఉంటాయి. ఎందుకంటే జిల్లాలలో తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా లెక్కలు వేసుకొని ప్రభుత్వ పెద్దలు నిర్ణయాలు తీసుకుంటారు. ఇటీవల బదిలీ అయిన ఆ జిల్లా కలెక్టర్ విషయంలో జరిగింది ఒకటైతే.. ఆ మీడియా ఛానల్ ప్రసారం చేసింది మరొకటి. ఈ వ్యవహారంలో మంత్రి వెంకట్ రెడ్డి తీవ్రంగా కలత చెందారు. తనకు ఇంత విషమిచ్చి చంపేయమని ఆవేదన వ్యక్తం చేశారు.కోమటిరెడ్డి ఆ స్థాయిలో వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో గులాబీ మీడియా సొంత కథనాలను రాయడం మొదలుపెట్టింది. రేవంత్ రెడ్డి పై తిరుగుబాటు మొదలైందని.. అది ఏ క్షణమైనా ఆయనను పదవి నుంచి దించేస్తుందని సొంత భాష్యం చెప్పడం మొదలుపెట్టింది. కోమటిరెడ్డి వెంకటరెడ్డి తిరుగుబాటు ఆ కోణంలోనిదేనని.. ఇప్పుడు ఆయన ప్రత్యర్థులకు ఆయుధంగా మారబోతున్నారని జోష్యం చెప్పింది. వాస్తవానికి రేవంత్ రెడ్డికి, వెంకటరెడ్డికి సాన్నిహిత్యం ఉంది. వారిద్దరు కూడా అన్నా.. అన్నా అని పిలుచుకుంటారు. ఇటీవల డిసిసి అధ్యక్షుడి విషయంలో కూడా కోమటిరెడ్డి మాటనే రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారు.. చివరికి రాజగోపాల్ రెడ్డి ఆ స్థాయిలో రేవంత్ రెడ్డి మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ.. వెంకటరెడ్డి అండగా ఉన్నారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం కూడా చేశారు. ఇన్ని పరిణామాలు జరిగిన తర్వాత.. రేవంత్ రెడ్డి కావాలని వెంకటరెడ్డి పై ఎలా కక్ష కడతారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అంటున్నారు. ఇదంతా కూడా ప్రతిపక్షాల కుట్ర అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోమటిరెడ్డి తిరుగుబాటు చేసే అవకాశం లేదని.. ఎంతో కష్టపడితే అధికారంలోకి వచ్చిన విషయాన్ని కోమటిరెడ్డి మర్చిపోరని కాంగ్రెస్ నాయకులు గుర్తు చేస్తున్నారు. బిజెపి, బీఆర్ఎస్ నాయకులు శవాల మీద చిల్లర ఏరుకునే రాజకీయాలకు పాల్పడుతున్నారని.. వారి ఆశలు తెలంగాణలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకు నెరవేరవని కాంగ్రెస్ నేతలు గుర్తు చేస్తున్నారు.

https://epaper.velthuru.com

వెలుతురు

cinema

# ఇద్దరు భామల పాత కథకు ...కొత్త కథనం

## హాస్యోచితంగా భర్త మహాశయులకు విజ్ఞప్తి మూవీ

ఓ కుటుంబ కథని ఎంచుకుని రవితేజ చేసిన సినిమానే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సున్నితమైన కథలకు పెట్టింది పేరైన కిశోర్ తిరుమల దర్శకుడు కావడంతో రవితేజని కొత్తగా చూసే అవకాశం ఉంటుందనే ఆశ ప్రేక్షకుల్లో కలిగింది. రామ్ సత్యనారాయణ (రవితేజ), బాలామణి (డింపుల్ హయాతి) భార్యాభర్తలు. తన భర్త రామ్‌పై బాలామణికి ఎంతో నమ్మకం. తను తప్ప వేరే ప్రపంచం తెలియని మనిషి అనుకుంటుంది. తన కుటుంబానికి చెందిన వ్యాపార వ్యవహారాల్లో భాగంగా రామ్ స్పెయిన్ వెళ్లాల్సి వస్తుంది. అక్కడ అనుకోకుండా మానస శెట్టి (ఆషికా రంగనాథ్)తో బంధం ఏర్పడుతుంది. తనకి పెళ్లయ్యిందనే విషయాన్ని దాచి మరీ, తనని తాను సత్య అని పరిచయం చేసుకుని మానసకు దగ్గరవుతాడు. ఏమీ జరగనట్టే ఇంటికి తిరిగొచ్చిన రామ్ సత్యనారాయణ తనపై తన భార్య చూపిస్తున్న ప్రేమతో అప్పుడప్పుడూ అపరాధ భావానికి గురవుతుంటాడు. ఇంతలోనే స్పెయిన్ నుంచి మానస ఇండియాకి వస్తుంది. ఆమె వచ్చాక ఏం జరిగింది? ఇద్దరి మధ్య బంధం కొనసాగిందా? భార్య బాలామణికి ఈ విషయం తెలిసిందా?రామ్ అలియాస్ సత్యకు పెళ్లయ్యిందనే విషయం తెలిశాక మానస ఏం చేసింది? తదితర విషయాల్ని తెరపై హృద్యంగా చిత్రీకరించారు. ఇద్దరమ్మాయిల మధ్య నలిగిపోయిన చాలా మంది కథానాయకుల్ని, కథల్ని గుర్తు చేస్తుంది ఈ చిత్రం. కానీ, హాస్యంపై మాత్రం ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. సందర్భోచితమైన హాస్యంతో సినిమా సరదా సరదాగా సాగుతూ, మంచి కాలక్షేపాన్నిస్తుంది. కిశోర్ తిరుమల సినిమాల్లో కథానాయకులు సరికొత్తగా కనిపిస్తుంటారు. ఈ సినిమా లోనూ అదే పునరావృతమైంది. రవితేజ కొత్తగానే కనిపించారు. ఆయన లుక్, పాత్రలో ఒదిగిపోయిన తీరు, అలవోకగా ఆయన వినోదం పంచిన తీరు బాగుంది. ఆయన గత సినిమాలతో పోలిస్తే ఇది ఎంతో ఉపశమనం. స్పెయిన్ నేపథ్యంలో కథ మొదలవుతుంది. సత్య, వెన్నెల కిశోర్, సునీల్ తదితరులతో రవితేజ చేసే హంగామా బాగా నవ్విస్తుంది. మానస శెట్టి ఇండియాకి వచ్చినప్పటి నుంచి సినిమా మరింత సందడిగా మారిపోతుంది. విరామ సన్నివేశాల వరకూ సినిమా ఆసక్తికరంగా అనిపిస్తుంది. ఆ తర్వాతే కథలో సంఘర్షణ తగ్గింది. మానస శెట్టికి తోడుగా మరో శెట్టి పాత్ర తోడై సన్నివేశాలు సాగిపోతాయే తప్ప కథలో మాత్రం కొత్తగా మారేదేమీ ఉండదు. తొలి సగభాగం తరహాలోనే కథానాయకుడు ఇద్దరు హీరోయిన్ల మధ్య నలిగిపోవడం కనిపిస్తుంటుంది. కాకపోతే బాబాయ్ అంటూ త్రినేత్ర పాత్ర చేసే హంగామా కాస్త నవ్వుల డోసుని పెంచుతుంది. స్పెయినా.. పెయినా.. అంటూ కథలో కొత్త టెన్షన్ మొదలవుతుంది. దాంతో పతాక సన్నివేశాల్లో సంఘర్షణ మోతాదు పెరుగుతుందేమో అనుకుంటాం. కానీ, అందుకు భిన్నంగా ఇలాంటి సమస్యలకు ఓ కొత్త పరిష్కారాన్ని చూపించి.. కథానాయకుడితో ఓ కొత్త విషయాన్ని చెప్పించి కథని ముగించారు. చాలా సార్లు చూసినట్టుగా, అసలు ఉందా లేదా అనిపించే కథతోనే దర్శకుడు నవ్వులు పండించాడు. సోషల్ మీడియాను అనుసరించే వాళ్లను ఇందులోని సంభాషణలు మరింత అలరిస్తాయి. పాటలకు తగ్గట్టుగా సన్నివేశాల రచన సాగలేదనిపిస్తుంది. మొత్తంగా కాలక్షేపానికి ఏమాత్రం ఢోకా లేదు. రవితేజ హుషారైన నటన ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణ. పాత్రలో ఒదిగిపోయి, స్వేచ్ఛగా నవ్వులు పండించారు. ఆయన డ్యాన్సులు ఆకట్టుకుంటాయి. కథానాయికలు డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ పర్వాలేదనిపిస్తారు. ఆషికా ట్రెండీగా కనిపించింది. 'వామ్మో వాయ్యో' పాటలో ఇద్దరి డ్యాన్స్ ఆకట్టుకుంటుంది. సునీల్, వెన్నెల కిశోర్, సత్య, మురళీధర్ గౌడ్, రోహన్.. పాత్రల నేపథ్యంలో పండిన కామెడీ ఈ సినిమాకి హైలైట్. సాంకేతిక విభాగాల్లో సినిమాటోగ్రఫీ, సంగీతం బాగా కుదిరాయి. స్పెయిన్ నేపథ్యంలో సాగే ప్రసాద్ మూరెళ్ల విజువల్స్ ఆకట్టుకుంటాయి. భీమ్స్ పాటలు, చిత్రీకరణ సినిమాకి ప్రధానబలం. కథ కన్నా కూడా వినోదానికే కిశోర్ తిరుమల పెద్ద పీట వేశారు.




# మనశంకరవరప్రసాద్....

## తొలిరోజు 84 కోట్లు వసూళ్లు


'పండగకు వస్తున్నాం.. హిట్ కొడుతున్నాం..' అంటూ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చి సందడి చేశారు చిరంజీవి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న విడుదలైంది. ప్రీమియర్స్ నుంచే ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు హిట్ టాక్ రావడంతో మొదటిరోజు వసూళ్లపై అందరిలోను ఆసక్తి నెలకొంది. తాజాగా ఆ వివరాలను నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రీమియర్స్‌తో కలిపి మొదటి రోజు ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.84 కోట్లు వసూలుచేసినట్లు వెల్లడించింది. 'మన శంకరవరప్రసాద్ గారు' బాక్సాఫీస్‌ను బద్దలు కొట్టేశారంటూ పోస్టర్‌ను పంచుకుంది. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ అతిథి పాత్రలో సందడి చేశారు. కథేంటంటే..: శంకరవరప్రసాద్(చిరంజీవి)నేషనల్ సెక్యూరిటీ ఆఫీసర్. కేంద్రమంత్రి శర్మ (శరత్ సక్సేనా) రక్షణ బాధ్యతల్ని చూస్తుంటాడు. మంత్రి కూడా శంకరవరప్రసాద్‌ని తన కుటుంబసభ్యుడిలా చూస్తుంటాడు. భార్య శశిరేఖ (నయనతార) నుంచి వరప్రసాద్.. విడిపోయిన సంగతి తెలుసుకుని, ఓ బోర్డింగ్ స్కూల్‌లో చదువుతున్న తన పిల్లలతో కలిసి గడిపేలా ఏర్పాట్లు చేస్తాడు మంత్రి. పీఈటీగా ఆ స్కూల్‌లోకి అడుగుపెట్టిన శంకరవరప్రసాద్ తన పిల్లలకు చేరువయ్యాడా? అసలు భార్యతో ఎందుకు విడిపోయాడు? వాళ్ల పెళ్లి ఎలా జరిగింది? ఊహ తెలియని వయసులోనే తండ్రికి దూరమైన పిల్లలకు శంకరవరప్రసాదే తమ తండ్రి అనే విషయం ఎప్పుడు తెలిసింది?కర్ణాటకకు చెందిన మైనింగ్ బిజినెస్‌మ్యాన్ వెంకీ గౌడ (వెంకటేశ్)కీ, శశిరేఖకీ సంబంధం ఏమిటి? విడిపోయిన భార్యాభర్తలు తిరిగి కలుసుకున్నారా, లేదా? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.




# ద రాజాసాబ్ సంక్రాంతి దూకుడు

## నాలుగు రోజుల్లోనే రూ. 200 కోట్ల క్లబ్‌లో చేరిక

పాన్ ఇండియా నటుడు ప్రభాస్ నటించిన లేటెస్ట్ హారర్-కామెడీ ఎంటర్‌టైనర్ 'ది రాజా సాబ్' బాక్సాఫీస్ వద్ద పరుగులు పెడుతుంది. మారుతి దర్శకత్వంలో జనవరి 9న సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా మిక్స్‌డ్ టాక్ కలెక్షన్లపై ఎటువంటి ప్రభావాన్ని చూపలేకపోయింది. తాజాగా ఈ సినిమా నాలుగు రోజుల్లోనే రూ. 200 కోట్ల క్లబ్‌లో అధికారికంగా అడుగుపెట్టింది. విడుదలైన మొదటి రోజే రూ. 100 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసిన ప్రభాస్, తాజాగా నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 201 కోట్ల గ్రాస్ మార్కును అందుకున్నారు. సోమవారం వసూళ్లలో కొంత తగ్గుదల కనిపించినప్పటికీ ఓవరాల్‌గా సినిమా ఇంకా నిలకడగా కొనసాగుతోంది. సినిమాపై విమర్శకుల నుంచి, సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, ప్రభాస్ క్రేజ్ ముందు అవేవీ నిలవడం లేదు. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారు. ప్రభాస్ వింటేజ్ కామెడీ టైమింగ్, డ్యాన్స్ మరియు మారుతి మార్క్ ఎంట్టంల్గ÷న్మెంట్ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తున్నాయి. ప్రేక్షకుల ఫీడ్‌బ్యాక్ మేరకు, చిత్ర బృందం ఇటీవలే ప్రభాస్ 'ఓల్డ్ అవతార్'కు సంబంధించిన సుమారు 11 నిమిషాల నిడివి గల కొత్త సన్నివేశాలను సినిమాకు జత చేసింది. ఈ మార్పు తర్వాత థియేటర్లలో రెస్పాన్స్ మరింత పెరిగిందని, ముఖ్యంగా సెకండ్ హాఫ్ ఇప్పుడు మరింత ఎంట్టంల్గ÷నింగ్‌గా ఉందని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు.




# వివాదంలో యశ్ టాక్సిస్

## మహిళా కమిషన్ నోటీసులు


కన్నడ స్టార్ నటుడు యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'టాక్సిక్' చిత్రం ప్రస్తుతం వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమా టీజర్‌ను ఇటీవల చిత్రబృందం విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా టీజర్‌లో అశ్లీలతతో పాటు అభ్యంతరకర సన్నివేశాలు ఎక్కువగా ఉన్నాయంటూ ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆప్ రాష్ట్ర కార్యదర్శి ఉషా మోహన్ ఈ ఫిర్యాదులో పేర్కొంటూ.. టీజర్‌లోని దృశ్యాలు పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపేలా ఉన్నాయని, తక్షణమే ఈ టీజర్‌ను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన మహిళా కమిషన్ వెంటనే రంగంలోకి దిగింది. టీజర్‌లోని అభ్యంతరకర దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సెన్సార్ బోర్డుకు లేఖ రాసింది. అంతేకాకుండా, దీనిపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఆదేశించింది. 'ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోనప్స్' అనే ఉపశీర్షికతో రూపొందుతున్న ఈ చిత్ర గ్లింప్స్‌లో ఇంటిమేట్ సన్నివేశాలు ఎక్కువగా ఉండటంతో నెట్టింట పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ విమర్శలపై దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ కాస్త ఘాటుగానే స్పందించారు. ఒక మహిళా దర్శకురాలు అయ్యుండి ఇలాంటి సన్నివేశాలను ఎలా చిత్రీకరించారు అంటూ వస్తున్న కామెంట్లను చూసి తాను ఏమాత్రం ఆశ్చర్యపోవడం లేదని, ఆ విమర్శలను తాను చాలా తేలిగ్గా తీసుకుంటున్నానని ఆమె స్పష్టం చేశారు.




# మీనాక్షి చౌదరి పండగ సందడి

## అనగనగా ఒకరాజుతో మళ్లీ నేడు రాక

టాలీవుడ్‌లో 'లక్కీ హీరోయిన్'గా పేరు తెచ్చుకున్న అందాల భామ మీనాక్షి చౌదరి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ జోష్‌లో కొనసాగుతోంది. గత ఏడాది సంక్రాంతికి విడుదలైన 'వస్తున్నాం' సినిమాతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆమె, ఇప్పుడు మరోసారి పండగ సీజన్‌ను టార్గెట్ చేస్తోంది. యంగ్ హీరో నవీన్ పోలిశెట్టితో కలిసి నటించిన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు' తో ఈసారి కూడా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు మంచి స్పందన తెచ్చుకోగా, ప్రమోషన్స్‌లో మీనాక్షి చౌదరి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ముఖ్యంగా ప్రీ రిలీజ్ ఈవెంట్స్, ఇంటర్వ్యూల్లో ఆమె మాట్లాడిన సరదా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఇటీవల ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో తనకు కాబోయే భర్త గురించి మాట్లాడిన మీనాక్షి చౌదరి, కొన్ని ఆసక్తికరమైన 'కండిషన్స్' పెట్టి అందరినీ నవ్వులు పూయించింది. తన భర్త డాక్టర్, నటుడు లేదా మిస్టర్ ఇండియా మాత్రం అసలు కాకూడదని స్పష్టం చేసింది. తాను ఇప్పటికే సినిమా రంగంలో ఉన్నానని, ఇంట్లో మరోసారి అదే ప్రొఫెషన్ అవసరం లేదని చమత్కారంగా వ్యాఖ్యానించింది. అంతేకాదు, తన జీవిత భాగస్వామికి 100 ఎకరాల పొలం ఉండాలి అంటూ చెప్పిన మాటలు ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయం, పల్లెటూరి వాతావరణం అంటే తనకు చాలా ఇష్టమని తెలిపింది. ఇక ఇంటి పనుల విషయంలో కూడా మీనాక్షి తన స్టైల్‌లో కండిషన్స్ పెట్టింది. వంట చేయడం, బట్టలు ఉతకడం, ఐరన్ చేయడం వంటి పనులు రావాలని చెప్పి నవ్వులు పూయించింది. అబ్బాయికి గతంలో బ్రేకప్స్ ఉన్నా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని,



అయితే పొడవుగా ఉండాలని మాత్రం కచ్చితంగా చెప్పింది. రోజుకు రెండు మూడు సార్లు లవ్ ప్రపోజ్ చేస్తూ, గిఫ్ట్స్ ఇచ్చే వ్యక్తే తన 'రాజు' అంటూ సరదాగా పేర్కొంది. ఇటీవల కొంతకాలంగా మీనాక్షి చౌదరికి టాలీవుడ్ హీరోలతో ప్రేమాయణం ఉందంటూ పలు రూమర్స్ వినిపించాయి. అయితే వాటన్నింటినీ ఆమె ఖండిస్తూ, పూర్తిగా అబద్ధమని కొట్టి పారేసింది. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది. 'అనగనగా ఒక రాజు' సినిమాతో పాటు మీనాక్షి చౌదరి ఇతర భాషల్లోనూ బిజీగా ఉంది. కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ నటిస్తున్న 63వ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే తమిళంలో 'వృషకర్మ' అనే చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది.

# మళ్లీ మొదలైన రాజధాని రగడ

- జగన్ వ్యాఖ్యలతో పరస్పర విమర్శలు
- లక్ష్యం మేరకు నిర్మాణం సాగితేనే ప్రజల్లో భరోసా



అమరావతి,జనవరి13( వెలుతురు):
ఇటీవల మాజీ సిఎం, వైకాపా అధినేత జగన్ వ్యాఖ్యలతో మరోమారు రాజధాని రగడ రాజుకుంది. అమరావతిని రివర్ బేసిన్‌లో నిర్మిస్తున్నారని జగన్‌తో పాటు, ఆయన అనుచరగణం చేస్తున్న విమర్శలను అధికార పార్టీ నేతలు గట్టిగా తిప్పికొడుతున్నారు. నదీ పరీవాహక ప్రాంతంలో రాజధానిని నిర్మించడం ఏమిటని జగన్ ప్రశ్నిస్తున్నారు. నదులకు, నాగరికతకు మధ్య విడదీయరాని బంధం అనాదిగా ఉందన్న విషయం జగన్‌కు తెలియదని సిఎం చంద్రబాబు ఎదురుదాడికి దిగారు. నదులు ఉన్న చోటే నాగరికత వెల్లివిరిసింది. ప్రపంచంలో అనేక మహా నగరాలు నదీ తీరాలలోనే నిర్మితమయ్యాయి. అనేక నగరాల మధ్య నుంచి నదులు ప్రవహిస్తున్నాయి. అమెరికా ఆర్థిక రాజధానిగా పేరొందిన న్యూయార్క్ నగరం హడ్సన్ నదీ తీరం వెంబడి నిర్మితం కాలేదా? సీన్ నదీ తీరం వెంట ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్, ఇంగ్లండ్ రాజధాని లండన్ నగరం థేమ్స్ నదీ తీరం వెంట, ఇటలీ రాజధాని రోమ్ నగరం టైబర్ నది వెంట, నైలు నదీ తీరంలో ఈజిప్టు రాజధాని కైరో, చైనాలోని షాంఘై నగరం యాంగ్జి నదీ తీరం వెంట నిర్మితమైనవే కదా అని ఘాటుగా సమాధానం ఇచ్చారు. ఇదే సందర్భంలో సింధూనాగరికత గురించి జగన్ తెలుసుకోవాలన్నారు. తరచుగా లండన్ వెళ్లే జగన్ రెడ్డి అక్కడ థేమ్స్ నదిని చూసే ఉంటారు కదా అని టిడిపి శ్రేణులు విమర్శలకు దిగారు. అంతెందుకు గోల్కొండ నవాబులు హైదరాబాద్ నగరాన్ని మూసీ నది ఒడ్డునే నిర్మించారు కదా అన్నారు. అయితే 2019కి ముందు జగన్ మాట్లాడిన మాటలకు ఇపపుడు మాట్లాడే మాటలకు పొంతన లేకుండా ఉంది. సిఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అంటున్నారు. తాగునీటి అవసరాలు తీరడానికి రాజధాని నదీ తీరంలో నిర్మించాలని గతంలో చెప్పిన విషయాన్ని విస్మరించారు. రాష్ట్రానికి మధ్యలో రాజధాని ఉండాలని, కనీసం 30 వేల ఎకరాల భూమి ఉండాలని, అమరావతిని రాజధానిగా ప్రకటించినందున తాను కూడా తాడేపల్లిలో ఇల్లు నిర్మించుకున్నానని చెప్పారు. 2019లో అధికారంలోకి రాగానే రాజధానిని ఒక కులం వారి కోసమే కడుతున్నారని నిందలు వేసారు. అమరావతిని శ్మశానంతో, ఎడారితోనూ పోల్చారు. భూములు ఇచ్చిన రైతులను అనేక విధాలుగా వేధించి అవమానాలకు గురిచేశారు. ఇప్పుడు రివర్ బేసిన్ అనే కొత్త రాగం అందుకున్నారు. తాను అమరావతిని రాజధానిగా వ్యతిరేకిస్తున్నానని స్పష్టంగా చెప్పారు. అమరావతి నిర్మాణాన్ని ఏదో ఒక విధంగా అడ్డుకోవాలన్నదే జగన్ నిర్ణయంగా ఉందని తెలుస్తోంది. అందుకే రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతిని ప్రకటించకుండా అడ్డుకొనే ప్రయత్నాలకు తెరలేపారు. అందులో భాగంగానే రివర్ బేసిన్ అనే వాదాన్ని తెరమీదకు తెచ్చారు. ఉమ్మడి ఎపి విభజన జరిగిన పదకొండున్నర సంవత్సరాల తర్వాత రాజధాని నిర్మాణం చర్చనీయాంశంగా మార్చాలని చూస్తున్నారు. తన ఐదేళ్ల పాలనలో జగన్ రాజధాని లేకుండా చేశారు. అమరావతి విషయంలో సజ్జల రామకృష్ణా రెడ్డి జగన్ వ్యాఖ్యలను సానుకూలంగా మార్చే యత్నం చేశారు. గత ఎన్నికల్లో పదకొండు సీట్లకే పరిమితమైనప్పటికీ రాజధాని విషయంలో ఆయన వైఖరి మారలేదని ఇప్పుడు స్పష్టమైంది. రాజధాని అవసరమే లేదని చెబుతున్న జగన్ ,ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుద్ధీ జ్ఞానం లేవని ఆరోపించారు. అయితే అమరావతిని అద్భుతమైన నగరంగా నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కలలు కంటున్నారు. దక్షిణ్యాదికే తలమానికంగా రాజధాని నిర్మాణం కావాలని చంద్రబాబు ఉబలాట పడుతున్నారు. విమర్శలు ఎలా ఉన్నా ఇక ఉన్నది మూడేళ్ల కాలమే. ఈ లోగా రాజధాని నిర్మాణం పూర్తి చేసి తన సత్తా ఏమిటో చాటాలి. వీలైనంత త్వరగా రాజధానిలో పౌర సౌకర్యాలు కల్పించడంతో పాటు నిర్మాణాలను పూర్తి చేయాలి. అమరావతిని ఆవాసయోగ్యంగా మార్చగలిగితే ఎవరు అధికారంలో ఉన్నా అభివృద్ధి దానంతటదే జరుగుతుంది. ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తి చేయడం ఎంత ముఖ్యమో ఇళ్ల నిర్మాణం జరగడం కూడా అంతే ముఖ్యం. రాజధాని అంటే కార్యాలయాలు మాత్రమే కాదు, ప్రజలతో కళకళలాడాలి. ఇందుకోసం ఇళ్ల నిర్మాణాలను ప్రోత్సహించాలి. ఆవాస ప్రాంతాలలో పౌర సౌకర్యాల కల్పనకు ప్రాముఖ్యతను ఇవ్వాలి. ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలి. అప్పుడే జనసాంద్రత పెరుగుతుంది.

# భోగిపళ్లు పోయడం తెలుగువారి ఆచారం

- పిల్లల్లో గ్రహపీడ పోవాలనే భోగి పళ్ల వ్యవహారం



రాజమహేంద్రవరం,జనవరి13( వెలుతురు):
తెలుగు ప్రజలు జరుపుకొనే ముఖ్యమైన పండుగ సంక్రాంతి. ఈ పండుగను మూడు రోజుల పాటు ఘనంగా జరుపుకొంటారు. ఈ మూడు రోజుల్లో తొలి రోజును భోగి పండుగగా.. రెండో రోజును మకర సంక్రాంతి పండుగగా.. మూడో రోజును కనుమ పండుగగా పిలుస్తారు. అయితే.. ఈ భోగి పండుగ రోజు ఆచరించే ప్రధానమైన ఆచారాల్లో భోగి మంటలు వేయడమే కాకుండా భోగి పళ్లు పోయడం కూడా ఉంటుంది. భోగి పండుగ రోజు సాయంత్రం పెద్దలు తమ ఇంట్లోని ఐదు లేదా ఆరేళ్లలోపు చిన్నారుల తలపై రేగుపళ్లు పోస్తారు. వీటినే భోగి పళ్లు అంటారు. ఈ భోగి పండ్ల కోసం రేగు పండ్లు, చెరుకు గడలు, బంతిపూల రెక్కలు, చిల్లర నాణెళిలు తీసుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో శనగలు, చిటికెడు పసుపు, కొన్ని బియ్యం కూడా కలుపుతారు. ఈ భోగి పండుగ రోజున సాయంత్రం పూట చుట్టుపక్కల ఉండే పెద్దవాళ్లను పిలిచి వారితో పిల్లలకు దిష్టి తీయిస్తారు. గుప్పిట నిండా భోగి పళ్లు తీసుకుని మూడుసార్లు పిల్లల చుట్టూ తిప్పి తలపై పోస్తారు. వాటిని పిల్లలు ఆనందంగా ఏరుకుంటారు. భోగి పీడ తొలగాలంటే శాస్త్రం ఒక ఉపదేశం చేసింది. అదేమిటంటే.. చెరుకు ముక్కలు, రేగు పండ్లు, పైసలు ఈ మూడింటిని కలిపి చిన్న పిల్లల్ని కూర్చోబెట్టి దిగదుడుపు తీసి తలపై నుంచి కిందకి వదిలేస్తారు. ఇలా చేయడం వల్ల భోగి పీడ తొలగిపోయి.. వాళ్లు భోగం అనుభవించడానికి కావల్సిన శక్తిని పొందుతారని నమ్మిక. సాధారణంగా చిన్న పిల్లలకు నర దృష్టి , గ్రహపీడ కలుగుతూ ఉంటుంది. చిన్న పిల్లల తలపై భాగంలో బ్రహ్మరంధ్రం ఉంటుంది. కాబట్టి తలపై భోగి పండ్లు పోసి ఆ బ్రహ్మరంధ్రాన్ని ప్రేరేపితం చేస్తే పిల్లల్లో జ్ఞానం పెరుగుతుంది. అంతే కాకుండా భోగి పండ్లను విష్ణుమూర్తి స్వరూపంగా భావిస్తారు. కాబట్టి రేగి పళ్ళు పిల్లల తలపై పోయడం వల్ల శ్రీమన్నారాయణుడి ఆశీస్సులు లభిస్తాయని, పిల్లలపై ఉన్న చెడు దృష్టి తొలిగిపోతుందని చెబుతారు. అంతే కాకుండా సూర్యభగవానుడి ఆశీస్సులు పిల్లలకి ఉండాలనే సూచనగా కూడా ఈ భోగి పళ్లు పోస్తారు. ఇంకా రేగు పళ్ళతో పాటు బంతిపూల రెక్కలని కూడా వాడటం వల్ల పిల్లల చుట్టుపక్కల ఉండే క్రిములు మాయమైపోతాయట. క్రిములను చంపడమేనది బంతిపూలకి ఉన్న ప్రాథమిక లక్షణంగా చెబుతారు. అంతే కాకుండా చర్మ సంబంధమైన వ్యాధుల నుంచి ఉపశమనం కలిగించే లక్షణం కూడా వీటికి ఉంటుందట.

# కోనసీమలో కోడిపందాల జోరు

- ఆత్రేయపురంలో సంబరాలు

కాకినాడ,జనవరి13( వెలుతురు):
గోదావరి జిల్లాల్లో ప్రాంతాల్లో భోగి రోజున కోడి పందాలు వేయడం ఒక ఆనవాయితీగా వస్తుంది, పౌరుషానికి ప్రతీకగా ఉండే కోళ్లు పోటీలో ప్రాణాలను పణ్ణంగా పెట్టి పోరాడుతాయి, ఈ పోటీలను చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తారు. పోటీలో పాల్గొనే కోళ్లపై పందాలు కాస్తారు. తాహత్తుకు మించి మితిమీరిన పందాలు కాయడం వలన కలిగే అనర్ధాల వలన పందాలు కాయడంపై నిషేధాంక్షలు ఉన్నాయి. హిందూ మత ఆచారాల ప్రకారం, సూర్య భగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని 'మకర సంక్రాంతి' అంటారు. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు 'భోగి' పండుగను జరుపుకుంటారు. ఈ పవిత్రమైన రోజున తెల్లవారుజామునే నిద్ర లేచి భోగి మంటలు వేస్తారన్న విషయం మనందరికీ తెలిసిందే.. అదే విధంగా చిన్నారులపై భోగి పళ్లను పోస్తారు. భోగి రోజు సాయంకాలం సమయంలో బొమ్మలకొలువును కూడా జరుపుతారు. కోనసీమలో సంక్రాంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇక, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ సంబరాల్లో భాగంగా మూడు రోజుల పాటు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నారు. జాతీయ స్థాయి పడవల పోటీలు జరగనున్నాయి. అంతేకాదు.. కోనసీమ రుచులు గురించి తెలుపుతూ ఫుడ్ ఫెస్టివల్ కూడా జరగనుంది. తొలిరోజు ఈత పోటీలు, రంగవల్లులు, ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంటున్నాయి. జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, ఎమ్మెల్యే బండారు సత్యనందరావు పోటీలను ప్రారంభించారు.

# ఆగని బంగారం పరుగులు


- రోజురోజుకూ గరిష్ఠ ధరలు నమోదు



న్యూఢిల్లీ,జనవరి13( వెలుతురు):
వరుసగా పెరుగుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు మంగళవారం కూడా భారీ పెరుగుదల నమోదు చేశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారం, వెండిపై మదుపర్లు దృష్టి సారిస్తున్నారు. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం, వెండి ధరల డిమాండ్‌కు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 6:30 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,42,160కి చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,30,310కి చేరింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 1,42,310కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 1,30,460కి చేరుకుంది. మరోవైపు వెండి కూడా భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో దేశంలోని పలు ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు అమాంతంగా పెరిగాయి.

# ఇరాన్‌తో వ్యాపార దేశాలపై ట్రంప్ అక్కసు

- 25శాతం సుంకాల విధిస్తామని తాజాగా హెచ్చరిక
- ట్రంప్ బెదిరింపులకు లొంగబోమన్న ఖొమేనీ



వాషింగ్టన్, జనవరి13(వెలుతురు):
ఆర్థిక సంక్షోభం, అంతర్గత తిరుగుబాటు సమస్యలతో సతమతమవుతున్న ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో పిడుగు వేశారు. ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై 25 శాతం సుంకాలను విధిస్తామని హెచ్చరించారు. అమెరికా జోక్యం, ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ సుప్రీం లీడర్ ఆయుతొల్లా ఖమేనీ తాజాగా స్పందించారు. ఆమెరికాకు వార్నింగ్ ఇస్తూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. శత్రువుల ముందు తలొగ్గేది లేదని గతంలో పలుసార్లు చాటి చెప్పాం. ఇప్పటికైనా అమెరికా మోసపూరిత చర్యలకు దూరంగా ఉండాలి. మా దేశానికి ద్రోహం చేస్తున్న కిరాయి మూకలపై ఆధారపడడం మానెయ్యాలి. ఇరాన్ చాలా బలమైన, శక్తివంతమైన దేశం. శత్రువు గురించి మాకు తెలుసు. వారిని ఎలా ఎదుర్కోవాలో మాకు తెలుసు. వారిని ఎదుర్కోవడానికి మేం ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటాం' అని ఖమేనీ పోస్ట్ చేశారు. ప్రజలు చేస్తున్న నిరసనలు హింసాత్మకంగా మారడంతో ఇరాన్‌పై సైనిక చర్యను చేపట్టడం గురించి అమెరికా ఆలోచిస్తోంది. ఇరాన్‌పై వైమానిక దాడులు చేయడం ఒక ఆప్షన్‌గా ఉందని ట్రంప్ యంత్రాంగం ఇటీవల ప్రకటించింది. అలాగే ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్టు తాజాగా ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాల్లో చైనా, తుర్కియే, యూఏఈ, భారత్ ముందు వరుసలో ఉన్నాయి.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com